

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-6-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 135 పేజీలు: 8+16 వెల: 6.50



ట్రంప్ వైఖరిపైనే జి7 దేశాధినేతల ఫోకస్
భారీగా పెరుగుతున్న కరోనా కేసులు
5




## బాసరలో విషాదం

### గోదావరిలో ఐదుగురు యువకుల మృతి

అందరూ హైదరాబాద్‌కు చెందిన వారే..

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లా బాసరలో విషాదం చోటు చేసుకుంది. బాసరలో సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చి గోదావరి నదిలో స్నానం చేసేందుకు దిగిన ఐదుగురు యువకులు వరదనీటిలో కొట్టుకుపోయి మరణించారు. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘటన పలు కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. మృతులంతా హైదరరాబాద్‌లోని చింతల్‌కు చెందిన వారుగా తేలింది. దిల్‌సుక్‌నగర్, చింతల్ ప్రాంతానికి చెందిన నాలుగు కుటుంబాలకు చెందిన 18 మంది ఉదయం పది గంటల సమయంలో బాసరకు వచ్చారు. ముందుగా అందరు సమీపంలోని గోదావరి నదిలో స్నానం కోసం దిగారు. ఇందులో కొందరు బోటులో నది మధ్యలోకి వెళ్లారు. ఆ సమయంలో ఐదుగురు వరదనీటి ఉధృతికి నీటిలో మునిగిపోయారు. ఒడ్డున వున్న మిగతా కుటుంబ సభ్యులు ఈ దృశ్యాన్ని చూసి కేకలు వేయగా అదే ప్రాంతంలోని గజ ఈతగాళ్లు నదిలో దూకి నీటిలో కొట్టుకుపోతున్న వారిని >>2



## కుప్పకూలిన హెలికాప్టర్

### పైలట్, ఆరుగురు యాత్రికుల మృతి

### ఉత్తరాఖండ్‌లోని గౌరీకుండ్‌లో దుర్ఘటన

**డెహ్రాడూన్,జూన్ 15:** ఉత్తరాఖండ్‌లోని గౌరీకుండ్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన హెలికాప్టర్ కూలిన ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు చేయనుంది. కేదార్‌నాథ్ పుణ్యక్షేత్రం గుప్త్ కాన్షీ పట్టణంలోని ఆర్యన్ హెలిప్యాడ్ రూట్‌లో రాకపోకలు సాగిస్తున్న ఈ హెలికాప్టర్ ఎందుకు కూలిందనే వివరాలను ఏఏఐబీ తెలుసుకోనుంది. ప్రమాద కారణాలను తెలుసుకునేందుకు ఏఏఐబీ దర్యాప్తు చేస్తుందని వెల్లడించింది. ప్రమాదంలో మొత్తం ఏడుగురు మృతిచెందారని అధికారికంగాప్రకటించారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా చార్‌ధామ్ మార్గంలో హెలికాప్టర్ సర్వీసులను రెండు రోజుల పాటు నిలిపివేయాలని ఉత్తరాఖండ్ సర్కారు నిర్ణయించింది. వాతావరణ ప్రతికూలతలు, ప్రయాణికుల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. >>2

# సైప్రస్‌లో ప్రధాని మోడీ

### నేడు కెనడాలో జి-7 సదస్సుకు హాజరు



సైప్రస్ విమానాశ్రయంలో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న దేశాధ్యక్షుడు నికోస్

**న్యూఢిల్లీ, జూన్ 15, ప్రభాతవార్త:** వివిధ రంగాల అభివద్ధికై సహకారం పెంపొందించేందుకు ప్రధానమంత్రి మోడీ ఆయా దేశాధినేతలతో చర్చించనున్నారు. ఈ మేరకు ఆదివారం సైప్రస్‌కు చేరుకున్నారు. దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. రెండు రోజుల పర్యటన అనంతరం ఇక్కడి నుంచి కెనడాలో జరిగే జీ7 సదస్సుకు హాజరుకానున్నారు. వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, పునరుత్పాదక ఇంధనం, కౌంటర్ టెర్రరిజం తదితర రంగాల్లో తోడ్పాటుకు సంబంధాలు మెరుగుపరిచేందుకు ఆయనతో సమావేశం కానున్నారు. అయితే సైప్రస్ దేశానికి 23ఏళ్ల తరువాత భారత్ ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనకు వెళ్లే ముందు ట్వీట్ చేస్తూ మధ్యధరా, ఈయూ ప్రాంతంలో సైప్రస్‌ను విలువైన భాగస్వామిగా చెప్పారు. మూడు దేశాల పర్యటనలతో ఆయా దేశాలతో వివిధ కీలకరంగాల్లో సంబంధాలను మరింత పెంపొందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్- ఇరాన్ పరస్పర దాడుల నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రయాణిస్తున్న విమానం అరేబియా సముద్రం, ఆఫ్రికా మీదుగా సైప్రస్‌కు చేరుకున్నట్లు >>2



ఆదివారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ సమక్షంలో ఎంఒయులు మార్చుకొంటున్న దృశ్యం

### సర్కార్ బడుల్లో ఉచితంగా

# సాంకేతిక విద్య

### ప్రముఖ ఎన్జీవోలతో విద్యాశాఖ ఎంఒయు

### సిఎం రేవంత్ సమక్షంలో ఆరు సంస్థలతో ఒప్పందాలు

### ఐదువేలు పైగా ప్రాథమిక పాఠశాలల్లో వివిధ సాంకేతిక కార్యక్రమాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 15:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతికబోధన సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో ప్రముఖ ఎన్‌జిఓ సంస్థలతో విద్యాశాఖ ఎంఓయు కుదుర్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన 6ప్రముఖ సంస్థలభాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన ఎడ్‌టెక్ సదుపాయాలను ప్రభుత్వం అందించనుంది. ఇందుకు నందన్ నీలేకణి నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే అధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ నిర్వహిస్తున్న ఫైజామ్ పౌండేషన్, సఫీనా హుస్సేన్ అధ్వర్యంలోని ఎడ్యుకేట్‌గర్ల్స్ లాంటి పేరొందిన సంస్థలతో విద్యాశాఖ సిఎం రేవంత్ సమక్షంలో ఆదివారం ఎంఓయు కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పేరొందిన సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్ర విద్యారంగంలో విప్ల వాత్మక మార్పులు తీసుకురావచ్చని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో విద్యానాణ్యత ప్రమాణాలను మెరుగుపరచాలన్న సిఎం ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలకు ఆకర్షితులై రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు వస్తున్న వివిధ సంస్థలు. నందన్ నీలేకణి నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్ కృత్రిమ మేథ ఆధారిత ప్లాట్ ఫారమ్‌తో 540 పాఠశాలలలో పని చేస్తుంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో 5,000కి పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్‌ను ఈ సంస్థ అందిస్తుంది. ఫిజిక్స్ వాలా ఇంటర్ విద్యార్థులకు నీట్, జేఈఈ, క్లాట్ పరీక్షలకు సన్నద్ధులను చేస్తుంది. ఖాన్ అకాడమీ రాష్ట్రంలో 6వ తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలకు అను గుణంగా వీడియో ఆధారిత స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) శిక్షణను అందజేస్తుంది. డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలో ప్రజ్వల ఫౌండేషన్ 6వ తరగతి నుంచి క్లాస్ 12 వరకు విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తుంది. ఫై జామ్ ఫౌండేషన్ ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు కోడింగ్, కంప్యూటేషనల్ థింకింగ్‌పై శిక్షణను అందిస్తుంది. ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేలకు పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పిం చటంతో పాటు, బాలికల అక్షరాస్యత, విద్యా అవకాశాలను మెరుగు పరుస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ స్పెషల్ సెక్రటరీ హరిత, ఎక్‌స్టెప్ ఫౌండేషన్ సీఈవో జగదీష్ బాబు, ప్రజ్వల ఫౌండేషన్ చీఫ్ డా.సునీతా కృష్ణన్, ఫిజిక్స్ వాలా కోఫౌండర్ ప్రతీక్ మహేశ్వరి, ఖాన్ అకాడమీ ఇండియా ఎండీ స్వాతి వాసుదేవన్, ఫైజామ్ పౌండేషన్ ఫౌండర్ షోయబ్ దార్, ఎడ్యుకేట్ గర్ల్స్ సిఈవో గాయత్రి నాయిర్ లోబో, తదితరులు పాల్గొన్నారు.

## కూలిన వంతెన

### పుణేలోని ఇంద్రాయని నదిలో దుర్ఘటన

### ఇద్దరు మృతి, 15 మంది గల్లంతు..

### ఆరుగురిని రక్షించిన ఎన్డీఆర్ఎఫ్



ఆదివారం పుణేలోని ఇంద్రాయని నదిపై కూలిన బ్రిడ్జి

**పుణే, జూన్ 15:** పూణెలోని ఇంద్రాయని నదిపై నిర్మించిన వంతెన కూలిపోవడంతో ఇద్దరు మృతిచెందారు. 15 మందికిపైగా ఆచూకీ గల్లంతయింది. మొత్తం 32 మందికి తీవ్ర గాయాలయ్యాయి, వీరిలో ఆరుగురిపరిస్థితి విషమంగా ఉందని మహారాష్ట్రసీఎం దేవేంద్ర ఫడ్నవిస్ తెలిపారు. పర్యాటక కేంద్రం అయిన కుంద్‌మాలా ప్రాంతంవద్దనే రుతుపవనాల సమయంలో పెద్ద ఎత్తున జలపాతాలు దర్శనమిస్తుంటాయి. వీటిన ఇచూడటంకోసం వందలాదిగా పర్యాటకులు వస్తుంటారు. ఆదివారం కూడా అదేవిధంగా పర్యాటకులు ఈ దృశ్యాలుచూసేందుకు వంతెనపైకి చేరారు. ఆకస్మికంగా వంతెన కూలిపోవడంతో కొందరి ఆచూకీ కూడా గల్లంతయింది. ఎన్‌డి ఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్ అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే ప్రమాదస్థలానికి వెళ్లి ఆరుగురిని రక్షించారు. గల్లంతయినవారి >>2



### స్థానిక సమరానికి

## సిద్ధం కండి

### -మంత్రి పొంగులేటి

**కూసుమంచి, జూన్ 15 ప్రభాతవార్త:** ఈ నెలలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు వస్తున్నాయని, అతి కొద్ది రోజుల్లోనే షెడ్యూల్ విడుదల అవుతుందని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. కూసుమంచిలోని ఎమ్మెల్యే >>2

### నెలాఖరులోగా

# 'స్థానిక' షెడ్యూలు

### నేటి కేబినెట్ సమావేశంలో చర్చ

### ముందుగా ఎంపిటిసి, జడ్పీటిసి, తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు

### గ్రామాలు, పంచాయతీల్లో ఓటర్ల జాబితాల తయారీ పూర్తి

### పట్టుకోసం కాంగ్రెస్, బిఆర్ఎస్ పోటాపోటీ



**హైదరాబాద్ జూన్ 15 ప్రభాతవార్త:** ఎంతో కాలంగా వాయిదా పడుతూ వస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ అంశంగా పంచాయితీరాజ్‌ఖ మంత్రి సీతక్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసిరెడ్డి సంకేతాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. జూన్ నెలాఖరులోగా నోటిఫికేషన్ విడుదలవుతుందని చెప్పారు. సోమవారం జరగబోయే కేబినెట్ భేటీలో ఎన్నికల నిర్వహణ తేదీపై స్పష్టత వస్తుందని తెలిసింది. ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఒక వైపు మంత్రుల ప్రకటనలతోనే కాకుండా మరో వైపు క్యాబినెట్ సమావేశంలో వీటికి సంబంధించి చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే మంత్రుల వ్యాఖ్యలు క్షేత్రస్థాయిలో రాజకీయ నాయకులు, ఆశావహులలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు, ప్రతిపక్ష పార్టీలు కూడాఎన్నికల సన్నాహాల్లో నిమగ్నమయ్యాయి. సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి, ఎన్నికలకు సంబంధించిన జూన్ నెలాఖరులో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందంటున్నారు. సోమవారం జరగబోయే >>2



### ఎపిలోనూ త్వరలో

## ఫిలిం అవార్డులు

### ప్రభుత్వ కార్యక్రమాలకు సినీ పరిశ్రమ ప్రాధాన్యత ఇవ్వాలి

### సిఎం రేవంత్, మంత్రులకు కృతజ్ఞత తెలిపిన దిల్‌రాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్15:** ప్రభుత్వాలు నిర్వహించే సినిమా అవార్డుల కార్యక్రమాలకు చిత్ర పరిశ్రమ ప్రముఖులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు సూచించారు. శనివారం అట్టహాసంగా జరిగిన తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ ప్రదానోత్సవం విజయవంతమైన నేపథ్యంలో, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసేందుకు ఆయన ఆదివారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిత్ర పరిశ్రమ ప్రభుత్వంతో కలిసి ప్రయాణించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అవార్డులు ప్రకటించనుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి పురస్కారాలు అందుతున్నాయంటే, వాటిని ఎంతో గౌరవంగా స్వీకరించాలని సూచించారు. ఎక్కడ ఉన్నా, షూటింగ్‌లతో ఎంత బిజీగాఉన్నా సరే, ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రభుత్వంతో కలిసి ప్రయాణించాల్సిన బాధ్యత సినిమా వాళ్లందరిపైనా ఉందన్నారు. 'ఇకపై ప్రభుత్వం తరఫున అవార్డుల వేడుక ప్రకటన వచ్చినప్పుడు, దయచేసి మీ డైరీలలో ఆ తేదీని >>2

## నేడు ఎసిబి విచారణకు కెటిఆర్



### 'ఫార్ములా కార్' కేసు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్15:** ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ఏసీబీ అధికారుల ఎదుట హాజరవుతున్నారు. ఈ కేసు విచారణ నేపథ్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు తెలంగాణ భవన్ చేరుకుంటారు. అనంతరం ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఏసీబీ కార్యాలయంలో విచారణకు హాజరు కానున్నారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ విచారణ జనవరి 9వ తేదీన విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. నాడు దాదాపు ఆరున్నర గంటల పాటు కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు విచారించారు. తన లాయర్ రామచంద్రరావుతో కలిసి కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. ఈసారి కూడా లాయర్ వెంట తీసుకుని హాజరవుతారు. ఈకార్ రేసుకు సంబంధించి రూ.54.89 >>2

## 17 మందిపై క్రిమినల్ కేసులు!

### 'మేడిగడ్డ' బాధ్యులైన ఇంజినీర్లకు నేడు షోకాజ్ ఇచ్చే అవకాశం

### 64 మందిపై శాఖాపరమైన చర్యలు



**హైదరబాద్,జూన్ 15,ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో కీలకమైన మేడిగడ్డ కుంగుబాటుకు బాధ్యులైన ఇంజనీర్లు, ఇతర అధికారులపై విజిలెన్స్ మాన్యువల్ ఆధారంగా చర్యలు తీసుకొనేందుకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీచేసేందుకు తెలంగాణ నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జాకు ప్రభుత్వం నుంచి సంకేతాలు అందినట్లు తెలిసింది. విజిలెన్స్ కమిషన్ నివేదిక ఆధారంగా 17 మంది అధికారుల పైన, నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టి, పిఇఎస్ పైన క్రిమినల్ ప్రొసీడింగ్ చేపట్టనన్నట్లు తెలిసింది. క్రిమినల్ కేసులు నమోదు చేసే అధికారులతోపాటు శాఖపరమైన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ నివేదికలో పేర్కొన్న 64 మందికి కూడా షోకాజు నోటీసులు జారీచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏకంగా 17 మంది సీనియర్ ఇంజినీర్లపై క్రిమినల్ కేసులకు సిఫార్సు చేసింది. అందులో అంతా మేడిగడ్డతో సంబంధం ఉన్నవారేనని తెలిసింది. నిర్మాణంతో పాటు డిజైన్లు, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ తదితర విభాగాల్లో పని చేసిన ఇంజినీర్లు ఉన్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. క్రిమినల్ కేసుకు విజిలెన్స్ అండ్ >>2



సెంట్రల్ ఇజ్రాయెల్‌పై బాంబుల వర్షం కురిపించిన ఇరాన్

### ఇరాన్, ఇజ్రాయెల్

# హోరాహోరీ

### వరుసగా మూడో రోజున దాడులు ముమ్మరం

### దాదాపు 100 మంది మృతి

### అమెరికాపై తెగబడితే తీవ్ర పరిణామాలంటూ ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

**టెహ్రాన్,జూన్ 15:** ఇజ్రాయెల్ ఇరాన్ మూడోరోజు కూడా పరస్పరం భీకరంగా దాడులు చేసుకుంటున్నాయి. నెతన్యాహు సేనలు దాడుల తీవ్రతను మరింత పెంచాయి. మూడో రోజు ఇరాన్ ఇంధన పరిశ్రమ, రక్షణ కార్యాలయం లక్ష్యంగా క్షిపణులతో విరుచుకుపడ్డాయి. తాజాగా టెహ్రాన్ జరిపిన దాడుల్లో ఇజ్రాయెల్‌లో నలుగురు మృతిచెందారు. 3 రోజులుగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో దాదాపు 100 మంది మృతి చెందినట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలే లక్ష్యంగా రెండ్రోజుల క్రితం ఇజ్రాయెల్ ప్రారంభించిన దాడులు మూడోరోజు కూడా కొనసాగుతున్నాయి. ఇరుదేశాలు పరస్పరం భారీ ఎత్తున క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసుకుంటున్నాయి. టెహ్రాన్ నగరం పేలుళ్ల శబ్దాలతో దద్ధరిల్లింది. ఇరాన్ క్షిపణులు గలీలి రీజియన్‌లో ఓ అపార్‌మెంటును తాకినట్లు ఇజ్రాయెల్ అత్యవసర విభాగం అధికారులు తెలిపారు. ఈదాడుల్లో నలుగురు చనిపోయినట్లు తెలిపారు. ఇజ్రాయెల్ యుద్ధవిమానాలకు ఇంధనం సరఫరాచేసే కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేసినట్ల్లు ఇరాన్‌మిలిటరీకి చెందిన రివల్యూషనరీ గార్డ్స్ పేర్కొంది. ఇజ్రాయెల్‌పై అత్యాధునిక క్షిపణిని ప్రయోగించినట్లు ఇరాన్ ప్రకటించింది. ఆదివారం జరిపిన క్షిపణి దాడిలో హాజ్ ఖాస్సీం గైడెడ్ బాలిస్టిక్ మిసైల్‌ను వినియోగించినట్లు తెలిపింది. ఇరాన్ రక్షణమంత్రి అజీజ్ నసీర్‌జాదా మాట్లాడుతూ తమవద్ద సరికొత్త బాలిస్టిక్ మిసైల్ సిద్ధమైనట్లు ప్రకటించారు. అది అమెరికా థాడ్, పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థలను ఛేదించగలదన్నారు. ఈ సరికొత్త క్షిపణి రేంజ్ 1200 కిలోమీటర్లు అని ఇరాన్ పేర్కొంది. దీని వార్ హెడ్ తన గమనాన్ని మార్చుకోగలదని అందుకే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదిస్తుందని వెల్లడించింది. దీనికి ఖుద్స్ ఫోర్స్ జనరల్ ఖాసిం సులేమానీ పేరు పెట్టినట్లు తెలిపింది. ఇరాన్‌కు చెందిన ఇంధనపరిశ్రమ, రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం, అణుశుద్ధి కార్యక్రమాలతో సంబంధాలు కలిగిన వారిని లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ దాడులు చేపట్టింది. అయితే ఇరాన్‌లో ఎంతమంది చనిపోయారనే సమాచారం లేదు. కానీ టెహ్రాన్ తగులబడుతోందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. సంక్షోభ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ అమెరికా మధ్య ఒమన్‌లో ఆదివారం జరగాల్సిన చర్చలు రద్దయ్యాయి. దీంతో రెండ్రోజుల క్రితం ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య >>2

# ఇరాన్, ఇజ్రాయెల్ హోరాహోరీ

>> మొదలైన దాడులు ఇప్పట్లో ఆగే సూచనలు కనిపించటం లేదు.

**ఇరాన్ గగనతలంపై పూర్తి పట్టు సాధించాం: ఇజ్రాయెల్**

**జెరూసలెం, జూన్ 15:** ఇరాన్‌పై భారీ వైమానిక దాడుల అనంతరం, టెహ్రాన్ గగనతలంపై తమకు పూర్తి స్వేచ్ఛ లభించిందని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్ రాజధాని ఇకపై తమ దాడుల నుంచి తప్పించుకోలేదని, ఆ నగరం ఇప్పుడు తమ లక్ష్యాలకు బహిర్గతమైందని ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) స్పష్టం చేశాయి. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేసేలా ఉంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ అతిపెద్ద దాడుల్లో ఒకటి నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో 70కి పైగా యుద్ధ విమానాలు పాల్గొన్నాయని ఐడీఎఫ్ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ ఎఫీ డెఫ్రిన్ తెలిపారు. రెండున్నర గంటలకు పైగా సాగిన ఈ దాడుల్లో ఇరాన్ అణు కార్యక్రమాన్ని, కీలక సైనిక, క్షిపణి స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఆయన వివరించారు. సుమారు 40 ప్రాంతాలపై దాడులు జరిగాయని, వీటిలో ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థలు, వాటికి సంబంధించిన ఆస్తులు కూడా ఉన్నాయని డెఫ్రిన్ పేర్కొన్నారు. టెహ్రాన్‌పై మా యుద్ధ విమానాలు, డ్రోన్లు స్వేచ్ఛగా సంచరించాయి. ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థల ముప్పును తొలగించడం వల్లే ఇది సాధ్యమైంది. ఇరాన్ అంతర్భాగంలో ఇజ్రాయెల్ వైమానిక దళం (ఐఎఎఫ్) ఇప్పటివరకు చేపట్టిన అత్యంత లోతైన ఆపరేషన్ ఇదే“ అని డెఫ్రిన్ అన్నారు. టెహ్రాన్ ఇకపై సురక్షితం కాదు; ఇజ్రాయెల్ దాడులకు ఆ నగరం పూర్తిగా అందుబాటులోకి వచ్చిందని ఆయన నొక్కి చెప్పారు. ఈ ఆపరేషన్ విజయవంతమైందని ప్రకటించిన ఐడీఎఫ్, ఇరాన్ సైనిక, అణు సామర్థ్యాలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ఈ ప్రణాళికాబద్ధమైన దాడులు కొనసాగిస్తున్నట్లు తెలిపింది.

**ఊహాకందని స్థాయిలో ప్రతిస్పందిస్తాం: ట్రంప్**

**వాషింగ్టన్, జూన్ 15:** ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న భీకర దాడుల్లో అమెరికా ప్రమేయం లేదని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. అయినా లెక్కచేయకుండా అమెరికాపై దాడికి తెగబడితే.. తమ సాయుధ దళాలు మునుపెన్నడూ కనీవినీ ఎరుగని స్థాయిలో.. టెహ్రాన్‌పై విరుచుకుపడతాయని హెచ్చరించారు. ఇరాన్ ఏ రూపంలో దాడి చేసినా తాము పూర్తి శక్తితో వాటిని తిప్పికొడతామన్నారు. టెహ్రాన్-టెల్‌అవీవ్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడం తనకు చాలా ఈజీ అని ట్రంప్ పేర్కొన్నారు. తాను తలుచుకుంటే ఈ సంఘర్షణను వెంటనే ముగించగలనని తెలిపారు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ పూర్తిగా నాశనం కాకముందే తమతో అణు ఒప్పందం చేసుకోవాలని ట్రంప్ ఇప్పటికే టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఈ మారణ హోమం ఇలాగే కొనసాగితే ఇరాన్‌లో ఏమీ మిగలదన్నారు. ఒకప్పుడు ఇరానియన్‌సామ్రాజ్యంగా పేరొందిన దేశాన్ని కాపాడుకోవాలంటే అక్కడి పాలకులు ముందుకు రావాలని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అగ్రరాజ్యంతో చర్చలు అర్థరహితమని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. ఒకవైపు తమపై దాడులకు మద్దతునిస్తూ.. మరోవైపు అణుఒప్పందంపై చర్చలకు ఆహ్వానించడం సరికాదని అన్నారు. తాముఇజ్రాయెల్‌పై చేస్తున్న దాడులను ఆపడానికి అమెరికా, యుకె, ఫ్రాన్స్ వంటి దేశాలు ఇజ్రాయెల్‌కు సహకరిస్తే ఆయా దేశాలకు చెందిన స్థావరాలపై దాడులు చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. కొద్దిరోజులుగా ఇరాన్, అమెరికా మధ్య అణుఒప్పందం కోసం ఒమన్ మధ్యవర్తిత్వంలో చర్చలు జరుగుతున్నాయి. దీనిపై ఇప్పటివరకు ఇరు దేశాల మధ్య 5 భేటీలు జరిగినప్పటికీ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో ఒమన్‌లో ఆదివారం జరగాల్సిన ఆరో విడత చర్చలను రద్దు చేసుకున్నారు.



ఉత్తరాఖండ్ రుద్రప్రయాగ్‌లోని కేదార్‌నాథ్ ఆలయానికి ఆదివారం పోటెత్తిన భక్తజనం

# ఎపిలోనూ త్వరలో ఫిలిం అవార్డులు

>> నోట్ చేసుకోండి. మీకు వచ్చిన అవార్డును తప్పకుండా స్వీకరించండి. ఇది చిత్ర పరిశ్రమకు నా వ్యక్తిగత విజ్ఞప్తి. అందరూ అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను' అని దిల్ రాజు అన్నారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుక ఎంతో ఘనంగా జరిగిందని, ఇందుకు ఆనందంగా ఉందని దిల్ రాజు అన్నారు. ఈ కార్యక్రమ విజయం కోసం గత ఆరు నెలలుగా శ్రమించాం. మొదట 2024 చిత్రాలకే పురస్కారాలు ఇవ్వాలని అనుకున్నప్పటికీ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి అవార్డులు ఇస్తే బాగుంటుందని పలువురు సూచించడంతో ఆ దిశగా కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. 2014 నుంచి 2023 వరకు ప్రతి ఏటా మూడు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేయడం సవాలుతో కూడుకున్న పని అని ఆయన వివరించారు. అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గంట సమయం కేటాయించినప్పటికీ, కార్యక్రమ ప్రణాళిక నాలుగున్నర గంటలు ఉండటంతో, తాను వ్యక్తిగతంగా ముఖ్యమంత్రిని కలిసి, కార్యక్రమం పూర్తయ్యే వరకు ఉండాలని కోరినట్లు దిల్ రాజు తెలిపారు. ఎంతసేపు ఉండాలి? అని సీఎం అడిగారు. పూర్తయ్యే వరకు ఉంటే చాలా సంతోషం సార్ అని చెప్పాను. ఆయన దాదాపు 2 గంటల 15 నిమిషాల పాటు ఉండి, విజేతలకు అవార్డులు అందజేశారు. ఇది అందరికీ ఎంతో ఆనందాన్నిచ్చింది అని దిల్ రాజు పేర్కొన్నారు. ఈ పురస్కారాల వేడుకకు మార్గనిర్దేశం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వేడుకలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఫిలిండెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ హరీష్ కూడా పాల్గొన్నారు.

# లక్ష్యం ఘనం.. నిర్వహణ శూన్యం

## యేటా కోట్లాది మొక్కలు నాటుతున్నారు

## నిర్వహణలో మాత్రం అధ్వాన్నం

## క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేవారు ఎవరు?

## ఈ యేడాది 4.5కోట్ల మొక్కలు నాటుతామంటున్న హెచ్ఎండిఎ

**హైదరాబాద్, జూన్ 15 ప్రభాతవార్త:** వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో హెచ్ఎండిఎ మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నది. పర్యావరణ పరిరక్షణ విషయంలో హెచ్ఎండిఎ తీసుకుంటున్న శ్రద్ధ బాగానే ఉంది. లక్ష్యాలు సైతం ఘనంగా పెట్టుకుంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో నిర్వహణ మాత్రం అధ్వాన్నంగా కనిపిస్తుంది. గడిచిన పది సంవత్సరాలుగా సుమారు 40 నుంచి 50కోట్ల వరకు మొక్కల వరకు నాటారు. ఈ మొక్కలలో ఎంత శాతం మొక్కలు పెరిగిపెద్దవిగా అయ్యాయి, ఎంత మేర ఫలితాలు ఇస్తున్నాయి. వాటిలో ఎన్నింటిని క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించారన్న విషయాలు అధికారుల వద్ద కనిపించవు. వర్షాకాలం వస్తుందంటే చాలు హడావుడి చేసి నర్సరీలను నుంచి మొక్కలను తీసుకుని వచ్చి పంపిని చేయడం, పలు ప్రాంతాలలో ప్రజాప్రతినిధులతో మొక్కలునాటడం, ప్రచారం చేసి చేతులు దులుపుకోవడం ఆనవాయితీగా మారింది. ప్రతి యేటా కోట్లాది మొక్కలు నాటుతున్నారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఏ అధికారి కూడా ముందుకు వెళ్లడం లేదు. తూతూ మంత్రంగా, హడావుడి మొక్కలు నాటడం, చేతులు దులుపుకోవడం ఆనవాయితీగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తాజాగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ(హెచ్ఎండీఏ) పరిధిలో ఈ యేడాది 4.5 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అర్బన్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో మొక్కలు నాటాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న వనమహోత్సవంలో హెచ్ఎండిఎనే ఎక్కువశాతం మొక్కలను నాటుతున్నది. దీనికి సంబంధించిన కసరత్తును హెచ్ఎండిఏలోని అర్బన్ ఫారెస్ట్రీ విభాగం ప్రారంభించింది. హెచ్ఎండిఏ పరిధిని ప్రభుత్వం 10,472.72 చదరపు కిలో మీటర్లకు పెంచిన విషయం తెలిసిందే. హెచ్ఎండిఏలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మేడ్చల్, సిద్దిపేట్, సంగారెడ్డి, యాదాద్రి-భువనగిరి జిల్లాలున్నాయి. కొత్తగా నల్గొండ, వికారాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాలను చేరాయి. అయితే ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ప్రణాళికతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1355 రెవెన్యూ గ్రామాల్లో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 533 గ్రామాలు, అత్యల్పంగా నాగర్ కర్నూల్ జిల్లాలో మూడు గ్రామాలున్నాయి. రంగారెడ్డి 533, మేడ్చల్ -మల్కాజ్‌గిరి 163, యాదాద్రి-భువనగిరి 162. సంగారెడ్డి 151, మెదక్ 101, సిద్దిపేట్ 74, హైదరాబాద్ 64, వికారాబాద్ 31, మహబూబ్ నగర్ 19, నాగర్ కర్నూల్ జిల్లాలో మూడు గ్రామాల చొప్పున ఉన్నాయి. వీటన్నింటిలోనూ మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించడానికి కసరత్తు చేస్తున్నారు.

అర్బన్ ఫారెస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 4.5 కోట్ల మొక్కలను నాటనున్నారు. ఇప్పటికే పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అయితే ఈ మొక్కలను అత్యధికంగా హెచ్ఎండిఏ పరిధిలో 18 అర్బన్ ఫారెస్ట్ పార్కులు. సుమారు 500 కిలోమీటర్లకుపైగా సెంట్రల్ మీడియన్స్, రహదారుల వనాలు, ఫారెస్ట్ బ్లాకులు, ఆయా విద్యాసంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు. ఇతర పార్కులు, చెరువుల సుందరీకరణకు సంబంధించిన మొక్కలను నాటాలని నిర్ణయించారు. అధికారులు తయారు చేసిన ప్రణాళికలు చూస్తే భారీగా ఉన్నాయి. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితులను చూస్తే అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. గడిచిన పది సంవత్సరాలలో నాటిని మొక్కలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎంతమేర ఈ మొక్కలు బతికాయో, వాటి వివరాలను ఉన్నతాధికారులు ఆరా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి యేడాది మాదిరిగానే తూతూ మంత్రంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టడం వద్ద వన మహోత్సవ కార్యక్రమం అభాసుపాలయ్యే అవకాశం ఉంది.

# స్థానిక సమరానికి సిద్ధం కండి

>> క్యాంప్ కార్యాలయంలో పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, కూసుమంచి మండలం, తిరుమలాయపాలెం మండలం, నేలకొండపల్లి మండలానికి చెందిన ముఖ్య నాయకులతో తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఒక్కో మండలం వారీగా సమావేశం నిర్వహించిన మంత్రి.... ఈ సందర్భంగా నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ వస్తుందన్నారు. రేపటి కేబినెట్ సమావేశంలో చర్చించక ఎన్నికల తేదీ పై స్పష్టత ఇస్తామని తెల్పి చెప్పారు. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, ఆ తరువాత అతి కొద్ది రోజుల్లోనే అవి పూర్తయిన వెంటనే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు వస్తాయని మంత్రి ప్రకటించారు. అందరు ఐక్యంగా ఉండి పని చేయండిఎన్నికలకు అందరు సిద్ధంగా ఉండాలని మంత్రి సూచించారు. ఆయా గ్రామాల్లో నాయకుల మధ్య సఖ్యత ఉండాలని, నాయకులు ఎవరైనా ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎన్నికలకు రావడానికి 15రోజుల గడువు మాత్రమే ఉందని, కాబట్టి మీ మీ గ్రామాల్లో చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకుని ఎన్నికలకు సిద్ధం కావాలని హెచ్చరించారు. రిజర్వేషన్ల ఆధారంగా ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఎక్కువ ఉన్న అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలను ప్రజల దరిచేర్చడం జరిగిందన్నారు. రాబోవు వారం రోజుల్లోనే అర్హులైన సంక్షేమ పథకాల ఆవశ్యకతను ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక నాయకులదేన్నారు. మీ మీ గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించుకోవడమే కాదు, వాటి నిర్మాణం పూర్తి చేయించే బాధ్యత కూడా మీరే చూసుకోవాలని సూచించారు. రైతు సోదరులందరికీ కుంట మొదలుకోని ఎన్ని ఎకరాలుంటే అన్ని ఎకరాల వరకు రైతు భరోసా, సన్నాలకు రైతు బోనస్ వారి వారి బ్యాంకు ఖాతాలలో జమా చేయడం జరుగుతుందన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 16-06-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
పంచమి మ.3.28
ధనిష్ఠ రా.1.11
వర్జ్యం ఉ.8.29-ఉ.9.55
దు.మ.12.35-1.27, 2) మ.3.13-సా.4.05
శుభముహూర్తం : ఉ.5.15-5.55
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఉద్యోగావకాశాలు పొందుతారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం :** సంతానం నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**మిథునం:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

**కర్కాటకం :** పారిశ్రామిక, కళారంగాలవారికి ప్రభుత్వం నుండి కీలక సమాచారం అందుతుంది.

**సింహం :** ఉద్యోగులకు అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి.

**కన్య :** సన్నిహితుల నుండి ఆహ్వానాలు అందుతాయి. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.

**తుల :** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు.

**వృశ్చికం:** రాజకీయ, కళ, పారిశ్రామిక రంగాలవారికి కొంత అనుకూలంగా వుండును.

**ధనుస్సు:** ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తారు. వాహనయోగం.

**మకరం:** ఆరోగ్యం, వాహనాల విషయాలలో నిర్లక్ష్యం తగదు. ఇతరుల విషయాలలో జోక్యం తగదు.

**కుంభం :** మీ మాటకు విలువ పెరుగుతుంది. బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకొంటారు.

**మీనం :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి - వ్యాపారాలు విస్తరిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 17 మందిపై క్రిమినల్ కేసులు!

>> ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఫార్సు చేసిన వారిలో కాళేశ్వరం మాజీ ఇఎన్‌సి నల్లా వెంకటేశ్వర్లుతో పాటు గతంలో ఎస్ఇగా పని చేసిన రమణా రెడ్డి, ప్రస్తుత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తిరుపతి రావు తదితరులున్నట్లు సమాచారం. ఇప్పటికే కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో కీలకపాత్ర పోషించిన గజ్వేల్ డిప్యూటీ ఇఎన్‌సి హరిరామ్, ఇఇ నూనెశ్రీధర్ వంటివారి ఇళ్ళపై ఎసిబి దాడులతో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యక్షచర్యలను చేపడుతోంది. మరోవైపు 2017 సెప్టెంబరు 12న సాధారణపరిపాలన శాఖ జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా బ్యారేజీ కుంగుబాటుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదికలోని సిఫార్సు లపై విజిలెన్స్ మాన్యువల్ ఆధారంగా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. ముఖ్యంగా ఎల్ అండ్‌టి, పిఇఎస్ సంస్థల నుంచి మేడిగడ్డ 7వబ్లాకు పునరుద్ధరణకు అయ్యేవ్యయాన్ని కాంట్రాక్టర్ నుంచి వసూలు చేయాలని విజిలెన్స్ నివేదించింది. నిర్మాణంలో లోపం జరిగి రాఫ్ట్ కింద పైపింగ్ జరగడం, గుంత ఏర్పడటం, కుంగడం వంటి పరిణామాలు చోటుచేసుకుని ప్రాజెక్టు వైఫల్యంకు కారణమైందని నివేదించారు. ఎల్‌అండ్ పిఇఎస్ అనుబంధ ఒప్పందం ప్రకారం చేయాల్సిన పనులు పూర్తి చేయకుండానే, పూర్తయినట్లు సర్టిఫికెట్ ఇమ్మని కోరినందుకు నిర్మాణసంస్థ పై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ నివేదికలో ప్రత్యేకంగా సూచించింది. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లకుండా చూసేలా రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ సభ్యు లకు సమగ్రమైన మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో ఎస్ ఎల్ఎస్సీ ఛైర్మన్, సభ్యులు తమ బాధ్యతను పూర్తిగా ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్పై నెట్టేస్తున్నారని విజిలెన్స్ తప్పుపట్టింది. నీటిపారుదలశాఖ కూడా నిర్లక్ష్యంగా ఏలాంటి శాఖపరమైన అవగాహన లేని ఎఇలను క్షేత్రస్థాయిలో నియమించి కాంట్రాక్టు సంస్థలు ఏదీ చెబితే దానికి అనుగుణంగా వ్యవహరించారని కనీసం ఎంబి బుక్స్ కూడా సరిగా నమోదు చేయలేని వైఫల్యం వారిలో కనిపించిందని తప్పు పట్టింది. కాంట్రాక్టరుకు ఆర్థికపరమైన చెల్లింపుల విషయంలో కూడా అనేక లొసుగులు ఉన్నట్లు విజిలెన్స్ నివేదికలో పేర్కొంది. కాంట్రాక్టర్తో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు, పనికి సంబంధించిన సర్టిఫికెట్లు జారీ చేసేటప్పుడు నిబంధనలు పాటించాలి. వీటిని ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని ఆర్థికశాఖను కూడా విజిలెన్స్ తప్పుపట్టింది. దీనితో ప్రభుత్వం విజిలెన్స్ మాన్యువల్ ప్రకారం క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలని, అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించడం వంటి తీవ్రమైన చర్యలకుఉపక్రమించేందుకు కసరత్తు చేస్తున్నది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ కోరడం అందరికీ షోకాజ్ నోటీసులివ్వడం వంటివి చేసే అవకాశం ఉంది. 2023 అక్టోబర్ మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, ఏడో బ్లాక్లో కొన్ని పియర్స్ దెబ్బతిన్న నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ దర్యాప్తు చేసి మార్చిలో నివేదిక అందజేసింది. దీన్ని పరిశీలించిన విజిలెన్స్ కమిషన్అందులోని సిఫార్సులను పూర్తిగా అమలు చేయాలని సూచిస్తూ, మార్చి 18న నీటిపారుదల శాఖ కార్యదర్శికి లేఖ రాసింది. ముఖ్యమంత్రి ఇటీవల మంత్రులతో జరిగిన సమావేశంలో విజిలెన్స్ నివేదికపై చర్యలు తీసుకోవాలని సూచించడంతో మళ్ళీ విజిలెన్స్‌పై కదలిక వచ్చింది. బ్యారేజీ నిర్మాణంలో పలు అక్రమాలకు అవకాశం కల్పించారని గుర్తించిన కొందరు సీనియర్ ఇంజినీర్లపైన, నిర్మాణ సంస్థపైన క్రిమినల్ ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకోవాలని, మిగిలిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నీటిపారదలశాఖ మంత్రి ఉత్తమ్ రెండు రోజులక్రితం నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు ఆదేశాలు ఇచ్చారని నీటిపారుదలశాఖ ఉద్యోగులు చర్చించుకొంటున్నారు. విజిలెన్స్ మాన్యువల్ ప్రకారం చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనిపై తదు పరి కార్యాచరణ బాధ్యతను సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌కు అప్పగించారు.



కేరళలోని కొల్లం జిల్లా ఓచిరా పదనిలంలో ఆదివారం జరిగిన 'ఓచిరా కలి' ఉత్సవంలో పాల్గొన్న ప్రజలు

# 'స్థానిక' షెడ్యూలు

>> కేబినెట్ భేటీలో చర్చించి ఎన్నికల తేదీపై స్పష్టత ఇస్తామని ప్రకటించారు. ముందుగా ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు జరుగుతాయాని, ఆ తర్వాత సర్పంచ్ (గ్రామ పంచాయతీ), మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో, పంచాయతీల్లో వార్డుల విభజన, ఓటరు జాబితా తయారీ పనులను పూర్తి చేసిందన్నారు. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితాను కూడా సిద్ధం చేసి ఎన్నికలకు సన్నద్ధమవుతోందని చెప్పారు. జూన్ నెలాఖరులో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని చెప్పారు. సోమవారం జరగబోయే కేబినెట్ భేటీలో చర్చించి ఎన్నికల తేదీపై స్పష్టత ఇస్తామని ప్రకటించారు. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయాని, ఆ తర్వాత సర్పంచ్ (గ్రామ పంచాయతీ), మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో, పంచాయతీల్లో వార్డుల విభజన, ఓటరు జాబితా తయారీ పనులను పూర్తి చేసిందన్నారు. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితాను కూడా సిద్ధం చేసి ఎన్నికలకు సన్నద్ధమవుతోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి స్థానిక సంస్థల ఎన్నికలు ఇవి. గత ఏడాదే ఎన్నికలు నిర్వహించాలనుకున్నా వాయిదా పడుతూ వస్తున్నాయి. ఈ ఎన్నికలను ఇప్పుడు నిర్వహించడం ద్వారా క్షేత్రస్థాయిలో తమ పట్టును బలోపేతం చేసుకోవాలని కాంగ్రెస్‌భావిస్తోంది. ఇటీవల అమలు చేసిన రైతు భరోసా, మహాలక్ష్మీవంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్ధి పొందాలని చూస్తోంది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కూడా ఈ ఎన్నికలను తమ బలాన్ని తిరిగి నిరూపించుకునే అవకాశంగా చూస్తోంది. గ్రామ స్థాయిలో తమ కార్యకర్తలను, నాయకులను క్రియాశీలం చేసేందుకు ఈ ఎన్నికలను వినియోగించుకోవాలని యోచిస్తోంది. బిజెపిసైతం లోక్‌సభ ఎన్నికలవిజయం తర్వాతస్థానిక సంస్థలఎన్నికల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రంలో తమ ఉనికిని మరింత పటిష్టం చేసుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి స్థానిక సంస్థల ఎన్నికలు ఇవి. గత ఏడాదే ఎన్నికలు నిర్వహించాలనుకున్నా వాయిదా పడుతూ వస్తున్నాయి.

# కుప్పకూలిన హెలికాప్టర్

>> మహారాష్ట్రలోని యావత్మల్‌కు చెందిన రాజ్‌కుమార్ జైస్వాల్ శ్రద్ధా దంపతులు, వారి రెండేళ్ల కుమార్తె కాశీ హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వీరితో కూడిన హెలికాప్టర్ ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు కేదార్‌నాథ్ నుంచి గుప్త్ కాశీకి బయలుదేరింది. గౌరీ కుండ్ అడవులకు దాదాపు 5 కి.మీ ఎగువ ఉన్న కొండ ప్రాంతానికి చేరుకోగానే అది కూలిపోయింది. మహారాష్ట్రలోని వణికి చెందిన మాజీ ఎమ్మెల్యే విశ్వాస్ నందేకర్ ఈవిషయాన్ని విలేకరులకు తెలియజేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన ఏడుగురిలో నలుగురు భక్తులతో పాటు శిశువు, హెలికాప్టర్ పైలట్, బద్రీనాథ్‌కేదార్‌నాథ్ ఆలయ ఉద్యోగి ఉన్నారు. ఈ ప్రమాదంలో చనిపోయిన హెలికాప్టర్ పైలట్ పేరు రాజ్‌వీర్ సింగ్ చౌహాన్. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉన్న శాస్త్రీ నగర్ వాస్తవ్యుడు. ఆయన భారత ఆర్మీలో దాదాపు 15 ఏళ్లకుపైగా సేవలు అందించారు. రాజ్‌వీర్‌సింగ్ చౌహాన్‌మరణం గురించి ఆయన తండ్రికి అధికార వర్గాలు సమాచారాన్ని అందించాయి. దట్టమైన పొగమంచువల్ల పైలట్‌కు మార్గంసరిగ్గా కనిపించక ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని రుద్రప్రయాగ్ జిల్లా విపత్తు నిర్వహణ విభాగం అధికారి నందన్‌సింగ్ రాజ్వార్‌చెప్పారు.

# బాసరలో విషాదం

>> కాపాడేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. కొద్ది దూరంలో రాకేష్, వినోద్, మదన్, రిత్విక్‌ల మృతదేహాలు లభించగా మరికొంత దూరంలో భరత్ మృతదేహం దొరికింది. ఐదుగురు మృతదేహాలను బాసర పోలీసులు భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి పోస్టుమార్టం పూర్తయిన తరువాత శవాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై బాసర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సైప్రస్‌లో ప్రధాని మోడీ

>> తెలుస్తుంది. పర్యటన ముగిసిన తర్వాత కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు ఈ నెల16,17న జీ7 సదస్సుకు మోదీ హాజరుకానున్నారు. ఇక్కడ అంతర్జాతీయ అధినేతలతో సమావేశమై ఇంధనభద్రత, సాంకేతికత ఆవిష్కరణలపై చర్చలు జరపనున్నారు. తిరుగు ప్రయాణంలో 18న ఐరోపాలోని క్రొయేషియాకు వెళ్లడం కూడా తొలిసారి.

# నేడు ఎసిబి విచారణకు కెటిఆర్

>> కోట్లు దుర్వినియోగం జరిగినట్లు నమోదైన కేసులో ఎ1గా కెటిఆర్, ఏ2గా ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండిఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్‌రెడ్డి ఉన్నారు. గతంలోనే వీరిని ఏసీబీ విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది, ఇప్పుడు కెటిర్‌ను మరోసారి ప్రశ్నించనుంది.

# కూలిన వంతెన

>> ఆచూకీకోసం గాలిస్తున్నారని, ఎన్డీఆర్ఎఫ్ స్పాట్‌లో రక్షణ కార్యకలాపాలుప్రారంభించినట్లు ఫడ్నవిస్ ట్వీట్‌చేసారు. పూణె, పింప్రి చించ్‌వాడ్‌ప్రాంతాల్లో ఇప్పటికే ఆరంజ్ అలర్ట్ జారీ అయింది. ఒకమోస్తరునుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఘాట్‌ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ కూడా హెచ్చరించింది. వంతెన భద్రతపైనా, వంతెన పటిష్టతపైనా స్థానికులు ఆందోళన వ్యక్తంచేసారు. నాలుగైదేళ్లక్రితం ఈ వంతెనను ఆధునీకరించారని, అయితే ఎక్కువమంది పర్యాటకులు ఈ వంతెన పరిస్థితి తెలియకనే పైకి వచ్చారని స్థానికులు చెపుతున్నారు. ఇంద్రాయణి నదిపై ఈ ఇనుప వంతెన 30 ఏళ్లక్రితం నిర్మించారు. ఇది కేవలం కాలినడకకు మాత్రమే ఉపకరిస్తుంది. ప్రమాదం సమయంలో సుమారు 100 మందికిపైగా ఉన్నారు. వారిలో కొందరు ఒడ్డుకు చేరుకున్నప్పటికీ పలువురు గల్లంతయానయరు.

# నేడు కేబినెట్ భేటీ

## రైతు భరోసా, వడ్లకు బోనస్, ఇందిరమ్మ ఇళ్లపై కీలక నిర్ణయాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్15:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ కేబినెట్ సమావేశం జరుగునుంది. రాష్ట్రంలో తాజా పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ తేదీ సహా పలు అంశాలపై చర్చించనున్నారు. అలాగే వర్షాకాల సీజన్‌కు సంబంధించి రైతు భరోసా చెల్లింపు, వడ్లకు బోనస్ చెల్లింపు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీ తదితరాలపై కేబినెట్ సమావేశంలో చర్చించి పలు నిర్ణయాలు తీసుకోనున్నారు.

# అఖిలపక్ష సమావేశం నిర్వహించండి

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హరీష్ రావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్15:** బనక చర్ల ప్రాజెక్టు అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి ఒక విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం లేఖ రాశారు. ఏపీ విభజన చట్టం 2014 ప్రకారం కొత్త ప్రాజెక్ట్ చేపట్టినప్పుడు గోదావరి, కృష్ణా బోర్డులతో పాటు అపెక్స్ కౌన్సిల్ అనుమతి తీసుకోవాలని, కానీ ఏపీ ప్రభుత్వం చట్టాన్ని ఉల్లంఘించిందని పేర్కొన్నారు.

దీనిపై తక్షణమే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయమని కేంద్రాన్ని కోరాలని ఉత్తమ్‌కు లేఖ ద్వారా సూచించారు. ఏపీ ప్రభుత్వం గోదావరి నుంచి 200 టీఎంసీల నీటిని బనకచర్లకు తరలించేందుకు మూడు దశల్లో ప్రాజెక్టును డిజైన్ చేసి, కేంద్రానికి ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్ సమర్పించడాన్ని హరీష్ రావు తీవ్రంగా వ్యతిరేకించారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఇంకా అనుమతులు రాకముందే ఏపీ ఇలా ఏకపక్షంగా వ్యవహరించడం తెలంగాణ నీటి హక్కులను కాలరాయడమేనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర జలశక్తి మంత్రికి ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ జూన్ 13, 2025న లేఖ రాసినందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని హరీష్ రావు అభినందించారు. ఏపీ తీసుకుంటున్న చర్యలు 2014 రాష్ట్ర పునర్విభజన చట్టంతో పాటు నదీ జలాల బోర్డుల నియమాలను ఉల్లంఘించడమేనని ఆయన స్పష్టం చేశారు. వెంటనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరాలని విజ్ఞప్తి చేశారు.

# నిర్మల్ జిల్లాలో బిఆర్ఎస్ నేత కిడ్నాప్ కలకలం

## తెల్లవారుజామున కారులో వచ్చి హారీశ్‌ను కిడ్నాప్ చేసిన దుండగులు

### కేసులో ట్విస్ట్.. డ్రైవరే కిడ్నాప్ సూత్రధారి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** మెదక్ జిల్లా తూప్రాన్ మండలం 44వ నేషనల్ హైవే టోల్‌గేట్ వద్ద ఆదివారం ఉదయం కిడ్నాప్ కలకలం రేపింది. నిర్మల్ జిల్లా మామడకు చెందిన మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నేత హారీశ్‌ను కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారు. అతడి ఇన్నోవా వెహికల్ లోనే అపహరించి హైదరాబాద్ వైపు తీసుకెళ్లారు. కిడ్నాపర్లు రూ.3 కోట్లు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈక్రమంలో మెదక్ జిల్లా తూప్రాన్ టోల్‌గేట్ వద్ద వెహికల్ వేగం తగ్గడంతో కిడ్నాపర్ల నుంచి హారీశ్ తప్పించుకుని తూప్రాన్ ఠాణాకు చేరుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆయన్ను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. హారీశ్ చాకచక్యంగా తప్పించుకుని పోలీస్ స్టేషన్‌కు చేరడంతో అతడి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం తాను సేఫ్‌గానే ఉన్నట్లు హారీశ్ తన సన్నిహితులకు ఫోన్‌లో చెప్పాడు. ఈ ఘటనపై తూఫ్రాన్ పోలీసులు మామడ పోలీసులకు ఈ విషయమై సమాచారం అందించడంతో ఈ కిడ్నాప్ ఘటనపై నిర్మల్ పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా, హారీశ్ డ్రైవరే కిడ్నాప్ సూత్రదారిగా ఉన్నట్లు తెలుస్తోంది. కిడ్నాపర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# లోక్‌అదాలత్ ద్వారా సైబర్‌క్రైం బాధితులకు రూ.15.79 కోట్ల అందజేత

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా శనివారం నాడు జరిగిన మెగా లోక్ అదాలత్ ద్వారా తెలంగాణలో సైబర్ నేరాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ క్రైం బాధితులకు ఒకేరోజున 15.79 కోట్ల రూపాయలను అందజేశారు. ఈ మేరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజి శిఖా గోయల్ ఆదివారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది రెండవ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా ఈ నగదును బాధితులకు అందజేయడం జరిగిందని ఆమె తెలిపారు. గత మార్చి నెలలో జరిగిన మెగా లోక్ అదాలత్‌లో 3527 మంది బాధితులకు 14.30 కోట్ల రూపాయలను అందజేయడం జరిగిందని ఆమె వెల్లడించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 6848 మంది బాధితులకు 53.50 కోట్ల రూపాయలను సైబర్ నేరగాళ్ల నుంచి జప్తు చేసి అందజేశామని ఆమె తెలిపారు. సైబర్ నేర గాళ్లపై కఠిన చర్యలు తీసుకోవడంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిరంతరం ముందంజలో వుంటుందని ఆమె తెలిపారు. కాగా సైబర్ నేరగాళ్ల బాధితులకు నగదు అందిన జిల్లాలలో హైదరాబాద్ మొదటి స్థానంలో వుంది. ఇక్కడ 782 కేసుల్లో 14.54 కోట్ల రూపాయలు, సైబరాబాద్‌లో 2997 కేసుల్లో 13.81 కోట్ల రూ పాయలు, రాచకొండలో 1005 కేసుల్లో 11.01 కోట్ల రూపాయలు, టిజిసిఎస్‌బి హెడ్ క్వార్టర్స్‌కు సంబంధించి 172 కేసుల్లో 5.74 కోట్ల రూపాయలు, సంగా రెడ్డి జిల్లాలో 163 కేసుల్లో 1.62 కోట్ల రూపాయలు, వరంగల్‌లో 250 కేసుల్లో 89 లక్షల రూపాయలు అందజేశారు. లోక్ అదాలత్ ద్వారా సైబర్ నేరాలకు సంబంధించిన బాధితులకు నగదు అందజేయడం 2024 ఫిబ్రవరి నుంచి మొదలవగా ఇప్పటి వరకు 30,478 మంది బాధితులకు 281.1 కోట్ల రూపాయలు అందజేశారు.



# కేరళలో అత్యవసర లాండింగ్ చేసిన బ్రిటన్ ఎఫ్-35 జెట్‌ఫైటర్!

**తిరువనంతపురం, జూన్ 15:** బ్రిటన్‌కు చెందిన ఎఫ్-35బి రకం యుద్ధ విమానం కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానా శ్రయంలో అత్యవసర ల్యాండింగ్‌చేసింది. హిందూ మహాసముద్రంపై ప్రయా ణిస్తున్న మయంలో అందులో ఇంధనం తగ్గిపోవడమే కారణమని తెలుస్తోంది. ఐదో తరానికి చెందినీ ఫైటర్‌జెట్ యుకెకు చెందిన హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్‌వేల్స్ క్యారియర్ స్ట్రైక్‌గ్రూప్‌లో భాగం.
ప్రస్తుతం ఇండో పసిఫిక్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తోంది. భారత నావికాదళంతో కలిసి యుద్ధ విన్యాసాలు కూడా చేసింది. ఎఫ్-35బి జెట్ ఈప్రాంతంలో ల్యాండింగ్ కావడం అరుదైన సంఘటన అయినా ఇదేమీ అసాధారణ సంఘటన కాదని ఎయిర్‌ఫోర్స్ నిపుణులు చెపుతున్నారు. ఎఫ్-35బి వేరియంట్‌ను స్వల్పదూరంలోనే టే కాఫ్, వర్టికల్ ల్యాండింగ్ కోసం రూపొందించారు. విమాన వాహకనౌకలపై పనిచేసేందుకు వీలుగా ఉంటుంది. ఈ యుద్ధవిమానం సామర్థ్యం, ఎలక్ట్రా నిక్ వార్‌ఫేర్‌సిస్టమ్స్, డేటా షేరింగ్ మౌలిక సదుపాయాల వల్లనే అమెరికా, యుకె, ఇజ్రాయెల్, నాటో వైమానికదళాల్లో అత్యంత కీలకమైనదిగా మారింది. అయితే రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి మాత్రం ఎలాంటి సమాచారం లేదు.

# విమానప్రమాద మృతులకు 'నైటా' సంతాపం

### ప్రమాదాల నివారణకు ఎయిర్ ఇండియా చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** అహ్మదాబాద్ దుర్ఘటనలో చనిపోయిన మృతుల కుటుంబాలకు న్యూయార్క్ తెలంగాణ తెలుగు అసోసియేషన్ (నైటా) తీవ్ర సంతాపం ప్రకటించింది. న్యూయార్క్ లో జరిగిన ఒక కార్యక్రమంలో నైటా అధ్యక్షురాలు వాణి అనుగు, కార్యవర్గం, సభ్యులు మృతులకు నివాళులు అర్పించి, మౌనం పాటించారు.ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం ఎన్ఆర్ఐలుగా తమను తీవ్రంగా కలిచివేసిందన్నారు. విదేశాల్లో ఉంటున్న భారతీయుల సంఖ్య భారీగా పెరిగిందని, వారంతా భారతదేశం రాకపోకలకు తరచుగా ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించేందుకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఎన్ఆర్ఐల్లో ఆత్మవిశ్వాసం నింపాలంటే భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నైటా కార్యవర్గం భారత ప్రభుత్వాన్ని కోరింది.

# ఢిల్లీలో దొంగల ముఠాగా మారిన కుటుంబం!

## పది నెలల వ్యవధిలో 25 ఖరీదైన కార్ల చోరీ

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సంపన్నులు వుండే ప్రాంతంలో పార్కింగ్ చేసే ఖరీదై న ఎస్‌యువి కార్లను దొంగిలిస్తున్న వైనాన్ని పోలీసులు రట్టుచేశారు. ఈ ముఠాకు ఓ వృద్దుడు నాయకుడు కాగా అతని కుమారుడు, అల్లుడు ఇందులో సభ్యులు గా వున్నారు. తూర్పు ఢిల్లీ ప్రాంతానికి చెందిన రమణ్ (56) అతని కుమారుడు సాగర్ (30), అల్లుడు నీరజ్ (32)లు కలిసి ఒక ముఠాగా ఏర్పడి కొంతకాలం గా ఖరీదైన ఎస్‌యువి వాహనాలను దొంగిలిస్తున్నారు. ఈ దొంగల ముఠా పార్కులు, జిం సెంటర్ల వద్ద నిలిపివున్న కార్లను టార్గెట్ చేసేవారు. హ్యుందాయ్ క్రెటా, ఫార్చ్యునర్, మారుతి బ్రెజా వంటి ఖరీదైన కార్లను మాత్రమే దొంగిలిస్తున్నారని పోలీసుల విచారణలో తేలింది. ఈ ముఠా తెల్లవారుజామున ఎక్కువగా చోరీలకు పాల్పడేదని తేలింది.

లాక్ వేసిన వాహనాలను కూడా అధునాతన ఉపకరణాలను వాడుతూ ఐదు నుంచి పది నిమిషాల వ్యవధిలో వీరు చోరీచేసే వా రు. వాహనాల్లో వుండే ఆన్ బోర్డ్ డయాగ్నస్టిక్ పోర్ట్‌లను తమ వద్ద వున్న ప్రత్యేకమైన ఉపకరణాలతో తారుమారుచేసి, అందులోని సెక్యూరిటీ వ్యవస్థను నిలిపివేసి కార్లను దొంగిలించేవారు. ఢిల్లీలోని పలుచోట్ల పది నెలల వ్యవధిలో బలమైన సెక్యూరిటీ వ్యవస్థ వున్న 25 ఖరీదైన కార్లు చోరీకి గురవడంతో దీనిపై రంగంలో దిగిన పోలీసులు ఆయా ప్రాంతాలలోని 200 సిసి టివిలను పరిశీలించి ఈ నేరాలకు పాల్పడింది రమణ్ ముఠాగా నిర్ధారించారు. ఈ ముఠాను ఆదివా రం నాడు పోలీసులు అరెస్టు చేసి 20 కార్లను జప్తు చేశారు. కాగా దొంగిలించిన కార్లను రమణ్ ముఠా ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో మరో దొంగల ముఠాకు విక్ర యించేదని తేలింది. కాగా ఈ ముఠాలోని రమణ్‌పై గతంలో 18, సాగర్‌పై 12 నీరజ్‌పై 14 కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

# సఫ్దర్‌జంగ్ ఎన్‌క్లేవ్‌లో కూలిన 100 అడుగుల మొబైల్ టవర్!



**న్యూఢిల్లీ, జూన్ 15:** నగరంలోని సఫ్దర్‌జంగ్ ఎన్‌క్లేవ్‌వద్ద ఉన్న బి-2 బ్లాక్‌వద్ద 100 అడుగుల ఎత్తయిన మొబైల్ టవర్ కుప్పకూలింది. సంపన్నులు నివాసం ఉండే ఈ ప్రాంతంలో ఆదివారం ఉదయం కురుస్తున్న భారీ వర్షాలకు ఈ టవర్ కూలినట్లు తెలుస్తోంది. తెల్లవారుజామున నాలుగు గంటలకు జరిగిన ఈసంఘటనలో ప్రజలెవ్వరూ రోడ్లపైకి రాకపోవడం వల్ల అందరూ ఇళ్లలోనే ఉండే సమయం కావడంవల్ల పెనుప్రమాదం తప్పిందని చెపుతున్నారు. అయితే స్థానికులు మాత్రం కాలనీ వాసుల అనుమతులు లేకుండా ఈ మొబైల్ టవర్‌ను ఏర్పాటుచేసారని ఆరోపిస్తు న్నారు. ముందు వీధిలైట్లు ఏర్పాటుచేస్తున్నామని చెప్పారని, తర్వాత మొబైల్ టవర్ వచ్చిందని ఈ టవర్ కూలిపోవడంవల్ల అనేక చెట్లు కూలిపోయి విద్యుత్‌వైర్లు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. టవర్ ఏర్పాటుచేయవద్దని నిరసన కూడా తెలిపామని, మహిలా పోలీసులను పిలిపించి మమ్మల్ని గెంటివేసారని ఆప్రాంత గృహిణులు ఆరోపిస్తున్నారు. తెల్లవారుజామున కూలిన టవర్‌ను తొలగించేందుకు ఉదయం తొమ్మిది గంటలు దాటినా ఎవ్వరూ రాలేదని సరికదా టవర్‌ను అక్కడినుంచి తొలగించ లేదన్నారు. ఆమ్ ఆద్మీపార్టీ నాయకుడు సోమ్ నాథ్‌భర్తీ మాలవీయనగర్‌నుంచి అక్కడికి చేరుకుని బిజెపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలుచేసారు. ఢిల్లీలోని ప్రభుత్వశాఖలన్నీ బిజెపి అధీనంలోనే ఉన్నాయని, బిజెపి ప్రభుత్వ తీరును ఈ సంఘటన తెలుపుతోందన్నారు. ఈ టవర్‌ను ఒక మురికికాలువపై నిర్మించినట్లు తెలుస్తోంది.

# ఆర్‌టిసిలో తొలి మహిళా డ్రైవర్‌గా సరిత

### అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
### సరితకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు
### మహిళా సాధికారత దిశగా ఆర్‌టిసి పయనం

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్‌ఆర్‌టిసి)లో తొలి మహిళా డ్రైవర్ బాధ్యతలు చేపట్టారు. తొలి మహిళా డ్రైవర్‌గా ఒక గిరిజన మహిళ చేరారు. తొలి మహిళా డ్రైవర్‌గా బాధ్యతలు చేపట్టిన సరితను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించగా.. రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆర్‌టిసిలో తొలి మహిళా డ్రైవర్‌గా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సిత్య తండాకు చెందిన వి సరిత మిర్యాలగూడ డిపోలో జెబిఎం సంస్థ నుండి ఆర్‌టిసి ఎలక్ట్రిక్ బస్సు మహిళా డ్రైవర్‌గా విధుల్లో చేరారు. సరిత హైదరాబాద్ టూ మిర్యాలగూడ బస్సు ను నడుపుతున్నారు. గతంలో ఢిల్లీలో రవాణా సంస్థలో 10 సంవత్సరాలు డ్రైవర్‌గా విధులు నిర్వహించారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా తనకు స్వస్థలంలో డ్రైవర్‌గా అవకాశం ఇవ్వాలని ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన సరిత మంత్రికి విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్‌టిసి అధికారులతో జెబిఎం సంస్థ ప్రతినిధులతో మాట్లాడి మిర్యాలగూడ డిపో నుండి నియమించారు. తనకు అవకాశం ఇచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కి మహిళా డ్రైవర్ సరిత ధన్యవాదాలు తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తుందని ఇప్పటికే మహాలక్ష్మీ పథకం ద్వారా ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రత్యేక పథకాలు చేపట్టా మని.. తాజాగా ఆర్‌టిసిలో మహిళా డ్రైవర్‌గా అవకాశం ఇవ్వడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలు పురుషులతో సమా నంగా అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

**సరితకు సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు**

ఆర్‌టిసిలో తొలి మహిళా డ్రైవర్‌గా చేరిన వాంకుడోతు సరితకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అవకాశాలు వస్తే మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలరని నిరూపించారని ప్రశంసించారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసిన సరితకి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం ఆర్‌టిసి బస్సులకు మహిళలనే యజమానులుగా చేస్తున్న సందర్భంలో, మహిళా డ్రైవర్ నియామకం ఒక కీలక ముందడుగని పేర్కొన్నారు. మహిళలు విద్య, విజ్ఞానం, వృత్తి, వ్యాపారం, క్రీడలు, సైన్యం వంటి అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని చెప్పారు. గృహ బాధ్యతలు, సమాజ నిర్మాణంలోనూ మహిళల పాత్ర అపూర్వమైనదిగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎన్నో అవమానాలను ఎదుర్కొంటూ, అడ్డంకులను అధిగమించి మహిళలు విజయాల బాటలో ముందుకెళ్తున్నారని, ఈ క్రమంలో సరిత అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాలకు సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు ప్రారంభించిందని సిఎం గుర్తుచేశారు. కోటి మందిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధన కోసం ప్రతి మహిళా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

**ఆర్‌టిసిలో శాశ్వత డ్రైవర్‌గా ఉద్యోగం కల్పించాలి**

తెలంగాణ ఆర్‌టిసిలో తొలి మహిళా డ్రైవర్ అయిన సరితకు ఆర్‌టిసిలో పర్మినెంట్ డ్రైవర్‌గా ఉద్యోగం కల్పించి ఆమెకు గౌరవం కల్పించేలా చూడాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి, ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సజ్జ నార్‌కు స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. డ్రైవర్ సరితను ఆర్‌టిసిలో నియమించకుండా ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీ అయిన జెబిఎం సంస్థలో, అది కూడా మంత్రి సహకారంతో తాత్కా లిక ఉద్యోగం కల్పించి ఆమెకు సరైన గౌరవం కల్పించకపోవడం, పైగా జెబిఎం సంస్థలో ఉద్యోగం ఇప్పించడమే గొప్పపని అన్నట్లు పత్రికలకు ప్రకటన విడుదల చేయడం అత్యంత బాధాకరమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ రావ్ అన్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయులు తరగతి గదిలో కొత్త టెక్నాలజీని ఉపయోగించాలి

### ఎస్‌సిఇఆర్‌టిని సందర్శించిన కేంద్రమంత్రి జయంత్ చౌదరి

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులందరూ తరగతి గదిలో కొత్త టెక్నాలజీని వాడేలా చూడాలని కేంద్ర మంత్రి జయంత్ చౌదరి అన్నారు. విద్యాశాఖ, నైపుణ్యాభివృద్ధి, ఎంటర్‌ప్రెనర్‌షిప్ శాఖల కేంద్ర సహాయ మంత్రి జయంత్ చౌదరి ఆదివారం ఎస్‌సిఈఆర్‌టిని సందర్శించారు. తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఎస్‌సిఈఆర్‌టితో పలువురు అధికారులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి గోదావరి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల ఫోటోలతో ఏర్పాటు చేసిన ఈ ఫోటో ఎగ్జిబిషన్‌లో ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు, పిఎంశ్రీ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలు, విద్యార్థులు తరగతి గదులలో వినియోగిస్తున్న బోధనాభ్యసన సామగ్రి, బడిబాట, సమ్మర్ క్యాంప్ వంటి వివిధ కార్యక్రమాల ఫోటోలను పరిశీలించారు. దాంతోపాటు ఎస్‌సిఈఆర్‌టి రూపొందించిన వివిధ మాడ్యూల్స్, కరదీపికలతోపాటు ప్రభుత్వము విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పరిశీలించారు. వాటితోపాటు విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న యూనిఫారాలను కూడా పరిశీలించారు.

విద్యార్థులు కంప్యూటర్ల ద్వారా తెలుగు, ఆంగ్లం, గణిత అంశాలను అభ్యసిస్తున్న తీరును పరిశీలించి, విద్యార్థులు నేర్చుకుంటున్న తీరు గురించి వారితో కేంద్ర మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ డైట్స్, ఎస్‌సిఈఆర్‌టి నిర్వహించే పరిశోధనలు, అధ్యయనాలను తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో అమలు చేసేలా చూడాలన్నారు. విద్యకు సంబంధించి డైట్స్, ఎస్‌సిఈఆర్‌టిలు మార్గదర్శకం వహించి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. దీర్ఘకాల, స్వల్ప కాల లక్ష్యాలను నిర్దేశించుకుని.. వాటి సాధనకు అవసరమయిన వ్యూహాలను అమలు చేయాలని కేంద్ర మంత్రి జయంత్ చౌదరి సూచించారు. ప్రపంచం మొత్తంలో తెలంగాణ ఐటికి కేంద్రంగా గుర్తించబడ్డదని.. కాబట్టి ప్రభుత్వ ఉపాధ్యాయులు అందరూ కొత్త సాంకేతికతను తరగతి గదిలో వాడేలా చూడాలన్నారు. మిషన్ మోడ్‌తో విద్యాసంస్థలు పనిచేయాలని, రాష్ట్రంలో ఉన్న అన్ని సంస్థల సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర మంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు చాలా ప్రాముఖ్యతను ఇస్తుందని పాఠశాల విద్య డైరెక్టర్ అన్నారు.

# అమేథిలో ఘోరప్రమాదం

### పికప్‌వాన్‌ను ఢీకొన్న అంబులెన్స్
### ఐదుగురు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

**అమేథి, జూన్ 15:** ఉత్తరప్రదేశ్‌లోని అమేథిలో జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో ఐదుగురు చనిపోయారు. పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వేపై జరిగిన ఈ ప్రమాదంలో మరొ కరు గాయపడ్డారు. లక్నోనుంచి ఘాజి పూర్ బీహార్‌కు మృత దేహాలను తీసు కెళుతున్న ఒక అంబులెన్స్ వాహ నం ఈ ప్రమాదానికి గురయింది. షుకుల్ బజార్‌పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయిన వారిని ఆసుపత్రులకు తరలించారు. అంబులెన్స్ వాహనం ఒక పికప్ వ్యాన్‌ను ఢీకొనడం వల్లనే ఈ ప్రమాదం సంభవించింది. అంబులెన్స్ డ్రైవర్‌తో





పాటు వాహనంలో ఉనన ఐదుగురు చనిపోయారు. మృతులు రాజ్‌కుమార్‌శర్మ, అలియాస్ సతీశ్‌శర్మ, రవిశర్మ, సర్ఫరాజ్, అబిద్, పూలోశర్మలుగా గుర్తించినట్లు ఎస్ఐ అభినేష్‌కుమార్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన శంభురాయ్‌ను కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లోచేర్చినట్లు తెలిపారు. అమేథి ప్రమాదంపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన సంతాపంప్రకటించారు. బాధితులకు తక్షణమే వైద్యసాయం అందించాలని వారు సత్వరమే కోలుకోవాలని ఆకాక్షిస్తున్నట్లు తెలిపారు. గత మే 31వ తేదీ కూడా ఒక పెళ్లికి వెళ్లి తిరిగివస్తున్న సందర్భంగా జరిగిన ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు చనిపోయారు. హార్డోయి జిల్లాలో తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది.

# మరో ఎయిరిండియాకు తప్పిన ముప్ప

### హిండన్ ఎయిర్‌పోర్టులోనే నిలిపివేత

**ఘజియాబాద్, జూన్ 15:** ఘజియాబాద్ నుంచి కోల్‌కతాకు వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం లో సాంకేతికలోపం తలెత్తింది. ఎయిరిండియాకు చెందిన ఎఐ1511 విమానం ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరే ముందు సిబ్బంది సమస్యను గుర్తించారు. దాంతో విమానాన్ని నిలిపివేసి అధికారులకు సమాచారం ఇచ్చారు. గ్రౌండ్ ఇంజినీర్‌లు వచ్చి సమస్యను సరిచేశారు. సాంకేతిక సమస్య కారణంగా విమానం సుమారు ఒక గంటపాటు ఎయిర్‌పోర్టులో రన్‌వేపైనే నిలిచిపోయింది. ఈ విమానాన్ని గతంలో రక్షణ శాఖలో బలగాలను సామాగ్రిని తరలించేందుకు వినియోగించారు. ఈ మధ్యనే దీన్ని పౌర యానానికి వినియోగిస్తున్నారు. విమానంలో సమస్య కారణంగా కోల్‌కతాకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో పడిగాపులు కాస్తున్నారు. ప్రయాణీకులకు రీషెడ్యూలు చేయడం, లేదా రీఫండ్‌చేయడానికి సిద్ధంగా ఉన్నామని సంస్థ ప్రకటించింది. విమానం మరో ఏడు గంటలు ఆలస్యంగా బయలుదేరుతుందని కూడా ప్రకటించింది. టేకాఫ్‌కి ముందే సాంకేతిక లోపాన్ని గుర్తించినట్లు మేనేజ్‌మెంట్ వెల్లడించింది.

# ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలి

### లోకసభ స్పీకర్, కేంద్ర హోంమంత్రికి లేఖ రాస్తా: ఎంపి ధర్మపురి అరవింద్

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ ఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా వెంటనే పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఎంపి ధర్మపురి అరవింద్ డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డికి మాజీ సిఎం కెసిఆర్ కుటుంబంతో సంబంధం ఉన్నందునా, తెలంగాణ ప్రభుత్వం నేరస్థులపై చర్యలు తీసుకునే అవకాశం చాలా తక్కువ ఉండొచ్చని ఆరోపించారు. ఒక లోకసభ సభ్యుడిగా నాకు ప్రజలు బాధ్యతనిచ్చారని, కానీ నా ఫోన్ కాల్స్, బెడ్రూమ్స్, బాత్రూంలను అక్రమంగా నిఘాలో పెట్టడానికి కాదన్నారు. ఇది కేవలం రాజకీయ కక్ష కాదని, ఇది నేరపూరిత వేధింపులు అని పేర్కొన్నారు. 2019 నుండి నన్ను శారీరకంగా దాడి చేసి, నిరంతరం వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ మొత్తం కుట్రకు మాజీ కెసిఆర్ కుటుంబమే మూలం, వారు రాష్ట్ర యంత్రాంగాన్ని వ్యక్తిగత నిఘా సాధనంగా ఉపయోగించారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ట్యాపింగ్ కేసుపై లోక్ సభస్పీకర్, కేంద్ర హోం మంత్రికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఇది నా పై చేసిన దాడి మాత్రమే కాదు.. ఇది ప్రజాస్వామ్యం, ప్రజాప్రతినిధుల గౌరవంపై దాడి అని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారించాలని, దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రికి లేఖ రాయనున్నట్లు ఎంపి ధర్మపురి అరవింద్ ట్వీట్ చేశారు.

# నేడు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

### మధ్యాహ్నం ఆన్‌లైన్ ద్వారా విడుదల

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** మే 22 నుంచి జూన్ 3 వరకు జరిగిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను నేడు(సోమవారం) విడుదల చేయనున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆన్‌లైన్‌లో ఫలితాలను విడుదల చేయనున్నట్టు ఇంటర్ బోర్డు ప్రకటించింది. అయితే ఇంటర్ ఫలితాలను నేరుగా కాకుండా ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం మే 29 నుంచే ప్రారంభం కాగా.. రెండో విడత మూల్యాంకనం మే 31న ప్రారంభమైంది. మొదటి విడతలో మే 29 నుంచి సంస్కృతం, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, గణితం, పొలిటికల్ సైన్స్, ఫిజిక్స్, ఎకనామిక్స్ మూల్యాంకనాన్ని ప్రారంభించగా.. రెండో విడతలో మే 31 నుంచి బొటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, హిస్టరీ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ప్రారంభించి ఈ నెల 10తో ముగించారు. మార్చిలో జరిగిన ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల్లో 2,89,907 మంది ఫీజు చెల్లించినట్టు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. అలాగే ఇంప్రూవ్‌మెంట్ కోసం 1,23,647 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారిలో సుమారు 90 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ నెల 10 నాటికే మూల్యాంకనం ప్రక్రియ ముగియగా.. అనంతరం ఇతర పనులను పూర్తి చేసి సోమవారం ఫలితాలను విడుదల ఇంటర్ బోర్డు విడుదల చేయనుంది.

# వినాయక విగ్రహాల తయారీ కేంద్రం వద్ద విద్యుదాఘాతం

### ఇద్దరు మృతి.. 8 మందికి తీవ్రగాయాలు

**కోరుట్ల, ప్రభాతవార్త :** కోరుట్ల పట్టణ శివారులోని వినాయక విగ్రహాల తయారీ కేంద్రం ముందు విద్యుత్ షాక్కు గురై ఇద్దరు మృతి చెందగా ఆరుగురు గాయాలైన సంఘటనతో కోరుట్ల పట్టణంలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే కోరుట్ల పట్టణ శివారు ప్రాంతంలో గల జివిస్ గార్డెన్ పక్కన బాలాజీ కళా ఆర్ట్స్ వద్ద ఆదివారం మధ్యాహ్నం సమయంలో వినాయక షెడ్ లోని వినాయకుని 10మంది యువకులు బయటకు తీసుకు వచ్చే క్రమంలో విద్యుత్ మెయిన్ లైన్‌కు తగలడంతో వినాయక విగ్రహాన్ని పట్టుకున్న 10 మంది కుప్పకూలి పోయారు. ఈ ప్రమాదంలో కోరుట్లకు చెందిన అలువాల వినోద్, మహారాష్ట్రకు బంటి అలియాస్ సాయినాథ్ మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా, ఆరుగురుకి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలిసిన పోలీసులు ఘటనా



స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కోరుట్ల ప్రభుత్వసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ చేరుకొని ప్రమాదం జరిగిన తీరు, కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిఐలు సురేష్ బాబు, అనిల్ కుమార్, ఎస్సైలు శ్రీకాంత్, రామ్ చంద్రం, నవీన్ కుమార్ తదితరులున్నారు.

**బాధితులకు మెరుగైన చికిత్స అందించాలి : ఎమ్మెల్యే సంజయ్‌కుమార్**

పట్టణంలోని గణేష్ విగ్రహాల తయారీ కేంద్రంలో కరెంట్ షాక్‌కు గురైన కార్మికుల పరిస్థితి ఫోన్ ద్వారా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అడిగి తెలుసుకున్నారు. కోరుట్ల సివిల్ హాస్పిటల్ డాక్టర్లతో క్షతగాత్రుల పరిస్థితిని తెలుసుకొని జగిత్యాల జిల్లా కేంద్రంలోని డిఎంహెచ్ఒకు ఫోన్‌చేసి షాక్‌కు గురైన కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

# నేరాలు చేసి తప్పించుకోలేరు

## ఎపి హోం మంత్రి అనిత

### మాజీ సీఎం జగన్ కుట్రలు సాగనివ్వం

**విజయవాడ,జూన్ 15,ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌రెడ్డి రాజకీయాల ముసుగులో ఉన్న నేరాలు ప్రోత్సహిస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపిం చారు.ఏ ముసుగు వేసుకున్నా,చేసిన నేరాల నుంచి తప్పించు కోలేరన్నారు. కూటమి హయాం లో జరుగుతున్న అభివృద్ధిని ఆయన ఓర్చుకోలేకపోతున్నారని. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించాలని చూస్తున్న ఆయన కుట్రలు సాగనివ్వబోమని హెచ్చరించారు. పొదిలిలో జగన్ పర్యటన నేపథ్యంలో శాంతి యుతంగా నిరసన తెలుపుతున్న మహిళలు,పోలీసులపై వైకాపా కార్యకర్తల రాళ్ళదాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. 'కిలో పొగాకు ధర కూడ తెలియకుండా రైతుల పరామర్శకు వెళ్ళిన జగన్ మానసికస్థితి అర్థం చేసుకోవాలి. అమరావతి మహిళల గురించి కొందరు చేసిన అసభ్యకర వ్యాఖ్యల్ని



ఆయన సమర్థించడం సిగ్గుచేటు. కొమ్మినేని శ్రీనివాస రావును నిర్దోషిగా విడుదల చేయలేదు. షరతులతో కూడిన బెయిలు మీదే ఆయన్ను వదిలిపెట్టారని జగన్‌గుర్తుంచుకోవాలి' అని అనిత పేర్కొన్నారు.

జీవితంలో స్వయంగా పైకి వెళ్లినవాడు వినమ్రంగా ఉంటాడు. అణకువగా జీవించే వాడే పైకి వెళ్లగలడు.

న-జార్జిమూల్

# పౌష్టికాహారలేమిలో భారతావని!

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా,మరెన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా, వెచ్చిస్తున్నా ప్రజలను పౌష్టికాహార లోపం నుండి గట్టెక్కించలేకపోతున్నారు. ఇప్పటికీ దేశంలో కోట్లాది మంది పౌష్టికాహార లోపంతో రకరకాల సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవై శాతంపైగా భారతావనిలోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక ఏనాటి నుంచో చెప్తున్నాయి. ఈ భూమ్మీద పుట్టినవారు ఎవరికైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కన్నులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన పోషకవిలువలతో కూడిన ఆహారం అందక చనిపోతే దానికి బాధ్యత వహించాల్సింది పాలక పెద్దలే. తల్లీబిడ్డకు పోషకాహారం అందివ్వలేకపోవడం కూడా పాలకుల బాధ్యతారాహిత్యం కిందకే వస్తుంది. అందుకోసం దేశవ్యాప్తంగా కొత్త పథకాలు ప్రవేశపెట్టకపోతే పోయారు. ఉన్న పథకాలు ఏమేరకు అర్హులకు అందుతున్నాయో అధ్యయనాలే కాదు పర్యవేక్షణ కూడా అవసరం. ఈ పర్యవేక్షణ లోపం కారణంగా కోట్లాది రూపాయల విలువైన ఈ పోషకాహారాలు పక్కదారి పడుతున్న విషయం ఎన్నోసార్లు వెలుగు చూసినా నిర్దిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పోషకాహార లోపం పెచ్చరిల్లిపోతుందని చెప్పొచ్చు. తాజాగా కరోనా మళ్లీ విస్తరిస్తుందనే వార్తలతో రోగనిరోధకశక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉందని వైద్యనిపుణులు చెప్తున్నారు. ఇది కొత్తగా చెప్పడం లేదు. ఏనాటి నుంచో డాక్టర్లు ఈ విషయాన్ని పదేపదే స్పష్టం చేస్తున్నారు. అందుకు పౌష్టికాహారాలే ముఖ్యం. కానీ పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు కనీసం కడుపునిండా తినేందుకు కూడా నోచుకోని అభాగ్యులు కోట్ల సంఖ్యలో ఉన్నారు. ఇటీవల ప్రపంచ ఆహార నివేదిక వెల్లడించిన సమాచారం ప్రకారం పౌష్టికాహారంతో బాధపడేవారి సంఖ్య దాదాపు ఎనభై కోట్లకు పైగా ఉంది. 2014తో పోలిస్తే ముప్పైశాతం అధికం. భారత్‌లో పౌష్టికాహారం ప్రధానంగా సూక్ష్మపోషకాహార సమస్య అధికంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పోషకాహార లోపంతో బాధపడుతున్నవారిలో మూడోవంతు భారత్‌లో ఉన్నారని ప్రపంచఆరోగ్య సంస్థ గతంలో వెల్లడించింది. వాస్తవంగా భారత్‌లో పౌష్టికాహారలోపాన్ని అధిగమించేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. 1975లో ఆరేళ్లలోపు పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ఆనాటి కేంద్రప్రభుత్వం సమీకృత శిశు అభివృద్ధి పథకాన్ని (ఐసిడీఎ) ప్రవేశపెట్టింది. ప్రధాన మంత్రి మాతృవందన యోజన, పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం తదితర కార్యక్రమాలు ఎన్నో కొనసాగుతున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు పిల్లలకు కోడిగుడ్లు కూడా అందిస్తున్నారు. అయినా భారత్‌లో పౌష్టికాహారలోపం ఎందరినో పట్టిపీడిస్తున్నది. 2022లో ప్రపంచ ఆకలి సూచీలో భారత్ 121 దేశాల్లో 107స్థానంలో ఉంది. పౌష్టికాహారలోపం కారణంగా ఆరోగ్యపరంగా ముఖ్యంగా మహిళల్లో, చిన్నారుల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.ఐదేళ్లలోపు పిల్లల్లో దాదాపు ముప్పైశాతానికిపైగా వయసుకు తగిన ఎత్తుకు పెరగడం లేదు. మరో పంతొమ్మిది శాతం ఎత్తుకు తగిన బరువు ఉండడం లేదు. ముప్పైరెండుశాతం లోపు పిల్లలు ఎదుగుదల లోపాన్ని ఎదుర్కొంటున్నారు. జార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్, అసోం తదితర రాష్ట్రాల్లో ఈ పౌష్టికాహార సమస్య అధికంగా ఉన్నది. ఇంకోవైపు పదిహేనేళ్ల బాలికల నుండి యాభైఏడులోపు మహిళలలో యాభైఏడు శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. ఎనభైశాతానికి పైగా సూక్ష్మపోషకాలు ఎదుర్కొంటున్నట్లు అంతర్జాతీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా పోషకాలు కలిగిన బియ్యాన్ని అందించే కార్యక్రమం కొనసాగిస్తున్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం దొడ్డు బియ్యం స్థానంలో సన్నబియ్యం అందించడంతో పేదలకు ఎంతో మేలు జరుగుతున్నది. గతంలో ప్రభుత్వం సబ్సిడీకింద ఇచ్చే బియ్యాన్ని కిలో ఐదు,పదిరూపాయలకు అమ్ముకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టినా కూడా కోట్లాది మందికి ఉపయోగపడుతుంది. 2030 నాటికి పిల్లల్లో తీవ్రమైన పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు మూడువేల కోట్ల రూపాయలకుపైగా వ్యయంతో ప్రత్యేక పథకాన్ని ఒడిశా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మరికొన్ని రాష్ట్రాలు కూడా ఆ కోణంలో ఆలోచించి ప్రవేశపెడుతున్నాయి. పథకాలు, ఉద్దేశాలు అన్నీ సక్రమంగా ఉన్నా సంతృప్తికలిగించే విధంగా కన్పిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి కాగితాలకే పరిమితమవుతున్నాయి. దళారులప్రమేయం పెరిగిపోతున్నది. వాస్తవంగా చూసినా భారత్‌లో గత దశాబ్దకాలంగా ఆహారోత్పత్తులకు కొరత లేదు. రికార్డుస్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ఇలా ఆహారోత్పత్తులు భారీగా పెరుగుతున్నా అందరికి రెండుపూటల ఆకలి తీర్చుకునేందుకు తిండిగింజలు అందించలేకపోతున్నారు. సమగ్రశిశు అభివృద్ధి పథకం కింది, మాతాశిశు సంరక్షణ కోసం పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయని కాగ్ ఏనాటి నుంచో హెచ్చరిస్తున్నది. ఇప్పటికైనా పాలకులు కొత్త పథకాల గురించి ఆలోచించకపోయినా ఉన్న పథకాల్లోని లోపాలను సవరించి పర్యవేక్షణ పెంచితే కొంతవరకైనా లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం.

సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.



సోక్రటీస్

సజ్జనుడి జీవితం ఎలా ఉత్తమమవుతుందీ అంటే ప్రేమతో, దయాగుణంతో అతను చేసే చిన్న చిన్న పనుల వల్లనే.



వివేకానంద


# తికమక రాజకీయ ఆరోపణలతో ఒరిగేదేమిటి?

**తెలంగాణ రాజకీయాల్లో సామాన్య ప్రజలనే కాదు రాజకీయ విశ్లేషకుల మేధస్సును సైతం తొలుస్తున్న చిక్కు ప్రశ్నలివేనని చెప్పక తప్పదు. ఐతే ఓ వినూత్న రాజకీయ క్రీడగా మారిన ఈ మూడు పార్టీల మధ్య ఆరోపణలూ, ప్రత్యారోపణలతో ప్రజలకు ఒనగూడే ప్రయోజనం శూన్యమేననేది రాజకీయ విశ్లేషకుల నిశ్చితాభిప్రాయం. నిజానికి ప్రజలు విస్పష్టమైన రాజకీయ నీతితో,ప్రజారంజకమైన పాలనా విధానాలతో రాష్ట్ర ప్రజల అభివృద్ధికీ, సంక్షేమానికి రాజీలేని కృషి చేసే రాజకీయ పార్టీలే అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజ కీయ పార్టీలు మెజారిటీ ప్రజల అభీష్టానికి అనుగుణంగా తమని తాము తీర్చిదిద్దుకుంటూ వారి మనస్సులను గెలవాలే తప్ప తమ ప్రత్యర్థి పార్టీలు రెండూ ఒకటై అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ఆరోపణలతో సాధించేది శూన్యమేనని చెప్పక తప్పదు.**



డాక్టర్ నీలం సంపత్

నిజానికి ఎవరికి వారు తమ పార్టీ స్వంత రాజకీయవిధానంతో ఎన్నికలలో గెలిచి అధికారాన్ని చేజిక్కించుకోవడం సాధ్యం కాదనుకున్నప్పుడు భావసారూప్యత గలిగిన మరో పార్టీతో కలిసి ఎన్నికల బరిలోనిలబడడం రాజకీయాల్లో సహజంగా కనపడే ప్రయోగాత్మక ప్రక్రియగా, ఆనవాయితీగా కొనసాగుతున్నదేనని చెప్పక తప్పదు. ఐతే ఆ సాంప్రదాయానికి భిన్నంగా మూడు రాజకీయ పార్టీలు అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసంలేదా వున్న అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం తమ రాజకీయ ప్రత్యర్థులైన రెండు పార్టీలలో ఒకటి మరొకపార్టీతో కలిసి పని చేస్తున్నాయనే ఆరోపణలతో పొద్దు గడుపు తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.దేశ సమకాలీన రాజకీయాల్లో ఉప్పు,నిప్పుగా కొనసాగుతున్న కాంగ్రెస్, బిజెపిలు కలిసి బిఆర్‌ఎస్‌ను టార్గెట్ చేస్తున్నాయనే బిఆర్‌ఎస్ ఆరోపణల్లో నిజమెంత ? బిఆర్‌ఎస్, బిజెపిలు కలిసి కాంగ్రెస్‌పై రాజకీయ దాడులు చేస్తున్నాయనే కాంగ్రెస్ వాదనల్లో నిజమెంత? కాంగ్రెస్, బిఆర్‌ఎస్ రహస్య అవగాహనతో బిజెపిపై విరుచుకుపడుతున్నాయనే బిజెపి ఆరోపణల్లో నిజాయితీ ఎంత? ఇందులో ఏదినిజం ?ఏది అబద్ధం? తేలేదెలా? తేల్చాల్సిందెవరు?ఈ రోజు తెలంగాణ రాజకీయాల్లో సామాన్య ప్రజలనే కాదు రాజకీయ విశ్లేషకుల మేధస్సును సైతం తొలుస్తున్న చిక్కు ప్రశ్నలివేనని చెప్పక తప్పదు. ఐతే ఓ వినూత్నరాజకీయ క్రీడగా మారిన ఈ మూడు పార్టీల మధ్య ఆరోపణలూ, ప్రత్యారోపణలతో ప్రజలకు ఒనగూడే ప్రయోజనం శూన్యమేననేది రాజకీయ విశ్లేషకుల నిశ్చితాభిప్రాయం. నిజానికి ప్రజలు విస్పష్టమైన రాజకీయ నీతితో,ప్రజారంజకమైన పాలనా విధానాలతో రాష్ట్ర ప్రజల అభివృద్ధికీ, సంక్షేమానికి రాజీలేని కృషి చేసే రాజకీయ పార్టీలే అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ పార్టీలు మెజారిటీ ప్రజల అభీష్టానికి అనుగుణంగా తమని తాము తీర్చిదిద్దుకుంటూ వారి మనస్సులను గెలవాలే తప్ప తమ ప్రత్యర్థి పార్టీలు రెండూ ఒకటై అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ఆరోపణలతో సాధించేది శూన్యమేనని చెప్పక తప్పదు. రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న పార్టీ తనకున్న సంస్థాగత కారణాల దృష్ట్యా పదిహేను నెలల తర్వాత 96 మందితో జంబోపార్టీ కార్యవర్గంతోపాటు ముచ్చటగా ముగ్గురితో మంత్రివర్గ విస్తరణను పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత మిగతా మూడింటిని పూర్తిచేస్తామని ముక్తాయించినా పదవులురాని నేతలు పార్టీని భూస్థాపితం చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో అసమ్మతి రాగాలను ఆలపిస్తున్న వారిని ఉటంకిస్తూ తమ పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఆరోప్రాణంగా భావిస్తుందని, ఈ క్రమంలో వారు వ్యక్తపరుస్తున్న భావాలను తప్పకుండా గౌరవిస్తుందనే అధినాయ కత్వపు అభిప్రాయాలు సైతం ఆహ్వానించదగినవే. మరోవైపు కేంద్రంలో అధికారాన్ని చెలాయిస్తూ రాష్ట్రంలోప్రతిపక్షపాత్రలో కొనసాగుతున్న భారతీయ జనతా పార్టీలో కూడా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆపార్టీ రాష్ట్రఅధ్యక్ష పదవిలో సమర్థులైన వ్యక్తులను నియమించే ప్రక్రియకు సంబంధించి ఆ పార్టీనేతల నుండి భిన్న స్వరాలు వినపడుతుండడం బహిరంగ రహస్యమే.ఈ ప్రక్రియలో ప్రధాన ప్రాతిపదికగా కొన్నిప్రత్యేక అంశాలు పరిశీలనలోకి వస్తాయి.విస్తృతమైన జనాకర్షక శక్తియా?సంపన్నత, హిందూత్వభావజా లమా? సీనియారిటీనా అనే అంశాలపై అధినాయకత్వానిదే తుదినిర్ణయం కాగలదు. ఐతే ఆ పార్టీకి




సంబంధించిన ఓ సీనియర్ మోస్ట్ శాసన సభ్యుడు ఒకరు పార్టీని,నాయక త్వాన్ని టార్గెట్‌చేస్తూ పత్రికలకు లీకేజీలు ఇవ్వడమేకాకుండా అలా చేస్తున్నందుకు తన ప్రాణాలకే ప్రమాదముందని ఘోషిస్తున్న వైనంతో క్రమశిక్షణకు మారుపేరుగా భావించే ఆ పార్టీలో ముసలం పుట్టిందేమోననే భావన ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది.మరో వైపు తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ముందస్తు చర్యగా ఇతర పార్టీలనుండి ఈపార్టీలో చేర్చుకున్న ప్రజాదరణ కలిగిన కొత్త అభ్యర్థులు ఆది నుండి పార్టీలో కొనసాగుతున్న సీనియర్ పార్టీల అభ్యర్థుల మధ్య చిటపటలతో ఆ పార్టీకి సంబంధించిన పోటీదారులను తొక్కిపెట్టడానికి వారిపై కువిమర్శలను ఎక్కుపెడుతూ పార్టీకి కొంతమేరకు నష్టాన్ని కలిగిస్తున్నా అవివారి వ్యక్తిగత అభిప్రాయాలే తప్ప మరోటికాదు వారు సర్వదా పార్టీకి విధేయులుగానే వుంటా రంటూ ఆ పార్టీ రాష్ట్ర అధినాయకత్వం సరిపెట్టుకుని గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారాన్ని చెలా యించి మూడోసారి అధికారానికి దూరమైన భారత రాష్ట్రసమితిలోనూ నిన్నటివరకూ అధినాయకత్వం పట్ల వీరవిధేయతే తప్ప అసంతృప్తికి ఆస్కారమే లేని పరిస్థితి నెల కొంది. ఉద్యమ పార్టీగా ఆపార్టీ అధినేత అభిప్రాయాన్ని వేదవాక్కుగా భావించే ఆ పార్టీక్యాడర్‌లో ఆశ్చర్యకరంగా తొలిసారి ఆపార్టీ శాసనమండలి సభ్యురాలు, ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు తనయ ఓ వైపు పార్టీ అధినేత దేవుడంటూనే ఆయన చుట్టూదయ్యాలు ఆవరించివున్నాయంటూ చేస్తున్న తీవ్ర వ్యాఖ్యలతో ఉద్యమ పార్టీ ఒకింత ఉక్కపోతకు గురౌతుందన్న సంకేతాలు వెల్లువెత్తు తున్నాయని చెప్పక తప్పదు. ఈ నేపథ్యంలో ఆమె సంధి స్తున్న ప్రశ్నల పట్ల ఆపార్టీ అధ్యక్షుడు,కార్యనిర్వాహక అధ్యక్షులిద్దరు మౌనవ్రతాన్ని పాటిస్తుండడం ఆ పార్టీ శ్రేణులను ఒకింత ఆందోళనకు గురిచేస్తుందని చెప్పక తప్పదు. కేంద్ర మంత్రి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు,శాసన సభ్యులలో కొంత మంది బి.ఆర్.యస్ పార్టీ శాసనమండలి సభ్యురాలి లేఖ ఉదంతంపై పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యానాలు చేస్తుండడం గమనార్హం. తమ పార్టీని బి.ఆర్.యస్‌గా మార్చినందుకే కక్షసాధింపు చర్యలోభాగంగా తమ కూతురు కవితను లిక్కర్ కుంభకోణంలో ఇరికించారని ఆ పార్టీ అధినేత బహిరంగంగా ప్రకటించడంతో పాటు ఆ తర్వాత దేశ ప్రధాని రాష్ట్రపర్యటనకు వచ్చినప్పుడు ప్రొటోకాల్ ప్రకారం ఆయనను కలవక పోవడం తెలిసినదే. ఈ నేపథ్యంలో కేంద్రంతో సయోధ్యచెడి రాష్ట్రానికి అభివృద్ధిపరంగా సమస్యలు ఎదురైనా పార్టీ శ్రేణులు సదరు చర్యను ఆమోదించక తప్పలేదు. జాతీయ స్థాయిలో ఉప్పు, నిప్పులా కొనసాగుతున్న భారతీయ జనతాపార్టీ, కాంగ్రెస్‌పార్టీల మధ్య రాజకీయ సాన్నిహిత్యముందంటూ బిఆర్‌ఎస్ ఆరోపిస్తోంటే బిజెపి, బిఆర్‌ఎస్‌ల మధ్యలోనే ఫెవికాల్ బంధం కొనసాగుతోందని మరో పార్టీ ప్రవచిస్తోంది. అందులో భాగంగానే లిక్కర్ కేసులో బి.ఆర్.యస్ యమ్.ఎల్.సి కవిత జైలు నుండి బయటకు రాగలిగిందంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణలు న్యాయవ్యవస్థను కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ ప్రభావితం చేసిందనే అర్థాన్నివ్వడం బాధాకరమే. ఈ సంఘటన పై స్పందించిన న్యాయస్థానం ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకోవాల్సివస్తుందని హెచ్చరించింది. తదనంతరం పార్లమెంట్ ఎన్నికలలో నా ఓటమికి కారణం పార్టీలోనే వున్న కొన్ని దయ్యాలేనని ఆరోపణలు చేసిన కవిత తాను జైలులో వున్నప్పుడు బిజెపితో చెలిమికి బిఆర్‌ఎస్ చేసిన ప్రయత్నాలను నేను వ్యతిరేకించాననడం తోపాటు తాను పార్టీ అధ్యక్షుడికి ఇటీవల వ్రాసిన లేఖలో ఎలకతుర్తిలో జరిగిన పార్టీ రజతోత్సవ సభలో కె.సి.ఆర్ ఉద్దేశిస్తూ డాడీ మీరు బిజెపిపై ఎందుకు ఎక్కువ విమర్శలను చేయలేదనే ప్రశ్న బిఆర్‌ఎస్, బిజెపిల మధ్య ఏదో సౌహార్ద సంబంధం ఉందేమోనన్న విశ్లేషకుల అభిప్రాయం సహజమే. బి.జె.పి,బిఆర్‌ఎస్ పార్టీలుమూడూ ఒకరిపై ఇంకొకరు మీరు ఫలనా రాజకీయ పార్టీతో చీకటి ఒప్పందం లో భాగస్వాములుగా కొనసాగుతున్నారంటూ చేసుకుంటున్న ఆరోపణల తో ప్రజలను గందరగోళంలోకి నెట్టివేసే ప్రయత్నంచేస్తూ అందులో నుండి రాజకీయప్రయోజనాలను పొందడం కోసం తహతహలాడుతున్నారు. ●

# రైతు 'ఆత్మగౌరవం' పెంచే చర్యలు అవసరం

జి.అజయ్ కుమార్

పంటకి మద్దతు ధర లేదు, వస్త్రధారణకి గౌరవం లేదు, పెళ్లికి అంగీకారం లేదు, చివరికి ప్రాణానికి విలువ లేదు. మట్టిపై మమకారంతో జీవితాంతం బ్రతికే రైతు చివరికి ఆ మట్టిలో కలిసే దాకా అయినా ఆత్మగౌరవంతో బ్రతికేలా చేయడం అందరి బాధ్యత. స్వేదాన్ని ఆయుధంగా మార్చి శ్రమను పెట్టుబడిగా మలిచి సేద్యం అనే యుద్ధంలో నిత్య శ్రామికుడిగా పోరాడుతూ అందరి ఆకలిని తీర్చే అన్నదాతల పట్ల ఈ వ్యవస్థల వైఖరి ఏంటి?.రైతు ఉనికే ఈ దేశానికి ధైర్యం. రైతు చేతిలో పుట్టిన విత్తనమే ఈ దేశానికి ప్రాణం. రైతు చేతితో తడిసిన నేలే ఈ దేశానికి అన్నపూర్ణ. కానీ ప్రస్తుత సమాజం రైతును చూసే కోణం మాత్రం చాలా దారుణంగా ఉంటుంది. ఇది నేటి సమాజపు మానసిక వైకల్యానికి నిదర్శనంగా మారుతుంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తెలంగాణ రాష్ట్రంలో చాలా జిల్లాలో వడ్ల కొనుగోలు కేంద్రాలలో వడ్లు తడిసి మొలకెత్తిన సంఘటనలు చాలా చోట్ల జరిగాయి. చాలా రోజులుగా వడ్లు కొనుగోలు కేంద్రాలలోనే ఉండడం ఈదుస్థితికి కారణం ఇలాంటి పరిస్థితులలో వడ్లను కొనాలని మహబూబాబాద్‌లో మహిళా రైతులు అధికారాల కాళ్లు మొక్కడం రైతుల ఆత్మగౌరవానికి ఆటంకంగా మారింది. ఇలాంటి పరిస్థితులు రైతులకునిత్యం ఎక్కడో అక్కడ ఎదురవుతూనే ఉన్నాయి. ఇది రైతుల పట్ల ప్రభుత్వాల వైఖరికి నిదర్శనంగా నిలుస్తాయి. ఇలాంటివి పార్టీలతో సంబంధం లేకుండా ఏ పార్టీ అధికారంలో ఉన్నా జరగడం ఆమోదించతగినది కాదు ఆ మధ్యకాలంలో కర్ణాటకాలో రైతు పంచకట్టుకొని ఉన్నాడని, బట్టలు మాసిపోయి ఉన్నాయని మెట్రో రైలులోకి అనుమతించలేదు. అలాగే మరో రైతును షాపింగ్ మాల్‌లోని థియేటర్‌లోకి అనుమతించలేదు. ఈ సంఘటనలు దేశవ్యాప్తంగా నిత్యం ఎక్కడో అక్కడ జరుగుతూనే ఉన్నాయి. ఇవి రైతుల పట్ల సమాజ వైఖరిని తెలుపుతున్నాయి. దేశానికే గర్వకారణమైన అన్నదాతను అగౌరవపరచడం వ్యవస్థ వినాశనానికి దారి తీస్తుంది. ఇటీవల కాలంలో వ్యవసాయం చేసే చాలామంది యువకులకు పెళ్ళిళ్లు కావడం కష్టంగా మారింది. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగించే యువతకు పెళ్లికి అమ్మాయిని ఇవ్వడానికి చాలా మంది తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. కారణం ఉద్యోగ భద్రత లేదని, స్థిరమైన ఆదాయం లేదని అమ్మాయిల తల్లిదండ్రులు తిరస్కరిస్తున్నారు. పంటలకు పెట్టుబడులు పెరిగాయి, దిగుబడులు తగ్గాయి, వచ్చిన పంటకు మద్దతు ధరలు లేకపోవడం, వంటి అనేక సమస్యల వలన రైతు అప్పులఊబిలో చిక్కుకుపోయి చివరకు ఆత్మహత్యే శరణ్యంగా భావిస్తున్నాడు. ఇది రైతుల పట్ల ప్రభుత్వాల వైఖరికి అద్దంపడుతుంది. రాజకీయ వేదికలపై 'రైతేరాజు' అనే మాటలు కాదు క్షేత్రస్థాయిలో రైతులకు అండగా నిలవడం కావాలి. నాయకుల ఉపన్యాసాలలో రైతును గౌరవించడంకాదు దేశంగర్వపడేలా రైతును ఆర్థికంగా అభివృద్ధి చేయవలసిన బాధ్యత ప్రతి రాజకీయపార్టీ, నాయకులపై ఉంది. మద్దతు ధరలు ఖచ్చితంగా అమలు చేయాలి. కనీస లాభంతోపాటు స్థిరమైన ధరలను నిర్దేశించాలి. రైతులే నేరుగా వారి ఉత్పత్తులను అమ్ముకునే వీలు కల్పించాలి. దానికి తగినట్టుగా సమీపంలోనే మార్కెట్ యార్డ్స్‌నీ నిర్మించాలి. వ్యవసాయంలో పంటలకు, రైతులకు బీమా పూర్తి స్థాయిలో అమలవాలి. బీమా మొత్తం రైతుకు,రైతు కుటుంబ సభ్యులకు స్వయంగా, సమయానికి చెల్లించాలి. తడిసిన ధాన్యాలను, ప్రభుత్వం మద్దతు ధరతో పాటే కోనుగోలు చేయాలి. ●

# ప్రజావాక్కు



## రేషన్ షాపులపై నియంత్రణ!

పవిత్రపుణ్యక్షేత్రమైన తిరుపతిలోని రేషన్‌షాపులు అధ్వాన్నస్థితిలో, అధోగతిలో నడుస్తున్నాయి.దానిలో భాగంగా తిరుపతి నగర పరిధిలో సుమారు 100 రేషన్‌షాపులు పనిచేస్తున్నాయి. అందులో కొన్నిఎప్పుడు తీస్తారో, ఎప్పుడు మూస్తారో, ఎప్పుడు రేషన్ ఇస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. కొన్ని షాపులకు నోటీసు బోర్డులు ఉండవు. మరికొన్ని షాపులు మాత్రం 1వ తేది నుండి తూతూ మంత్రంగా 2,3 రోజులు ఇచ్చి సరుకు అయిపోయిందని, డీలర్లు మూసివేస్తారు. అందులో కొన్ని షాపులు కేవలం బియ్యం మాత్రమే ఇచ్చి మిగిలినవి లేవు పొండి అంటారు.కాబట్టి ఈ రేషన్‌షాపుల డీలర్లను అదుపులో పెట్టాలి. తరువాత బ్లాకుల్లో అమ్మే కస్టమర్లను అదుపులో పెట్టాలి

- వి.ఆర్.కె.మూర్తి, తిరుపతి

## వెల్‌నెస్ సెంటర్లో సేవలను మెరుగుపరచాలి

ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా హనుమకొండలోని మెటర్నిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేయబడ్డ వెల్ నెస్ సెంటర్‌లో నిత్యం వచ్చే వారికి పూర్తి స్థాయిలో అందడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి ములుగు మహబూబాద్ జనగాం వరంగల్ హనుమకొండ ప్రాంతాల్లోని ప్రభుత్వఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగులు జర్నలిస్టులు నిత్యం వెల్‌నెస్ సెంటర్‌కి వస్తారు. కానీ అన్ని సేవలు అందుబాటులోకి రావడం లేదు.న్యూరో డాక్టర్ పీడియాట్రిక్ డాక్టర్ అందుబాటులో లేకపోవడం వల్ల నానా యాతన పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెల్‌నెస్ సెంటర్లో అన్ని విభాగాల వైద్యులను ఏర్పాటు చేసి బలోపేతం చేయాలి. ఇక్కడికి వచ్చే వారికి అన్ని రకాల సదుపాయాలు, మంచినీటి వసతి కల్పించాలి.

- కె. సతీష్, భూపాల్ పల్లి జిల్లా

## ఆయకట్టు స్థిరీకరణ

ఇప్పటికే సీతారామ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆయకట్టుకు నీరు అందించడంతోపాటు సరికొత్త ఆయకట్టును సాగులోకి తేవడంతో పాటు ఆయకట్టు స్థిరీకరణ చేయడం తద్వారా సరికొత్త రూపురేఖలను ఖమ్మం జిల్లాకు అందించడం సాధ్యం అవుతుంది. ఇవన్నీ గత ప్రభుత్వం తెచ్చినప్రపోజల్స్ అనిగుర్తుపెట్టుకోవాలి. ఏది ఏమైనా తక్కువఖర్చుతో సాగులోకి తేవడం గొప్ప విషయమే.

- బి.అవినాష్,జనగామ

## పెరుగుతున్న సమస్యలు

చైనా దశాబ్దాల క్రితమే భారత్‌లోని తూర్పు భాగాన ఉన్న అరుణాచలప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 38వేల చదరపు కిలోమీటర్లు స్థలాన్ని చట్టవ్యతిరేకంగా ఆక్రమించుకుని తన స్థావరాలను ఏర్పరుచుకుంది. ఆక్రమించుకన్న ప్రదేశాలకు చైనా తమ దేశానికి చెందిన పేర్లను పెడుతోందని నిన్న మొన్నటి వార్త. వెంటనే మన విదేశాంగశాఖ రంగంలోకి దిగి పేర్లు పెట్టుకున్నంత మాత్రాన అవి భారత్ భూభాగానికి చెందకుండా పోతాయా అని చప్పిడిమాటలు మాట్లాడుతోంది.చైనా ఆక్రమించిన మొద ట్లోనే ఎందుకు ఖండించలేదు? మళ్ళీ మొదటి కోస్తే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌నూ తెలిగ్గా తీసుకుంటూ అది భారత్ లోనిదే అంటూ కాలాయాపన చేసారు.సమస్యలు ఉత్పన్నమయినప్పుడే వాటిని వెంటనే పరిష్కరించుకోవాలి.

-ఎన్. పి.రాజేష్, నల్గొండ

## దారికి అడ్డంగా గృహనిర్మాణ మెటీరియల్

గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలు వాహనాలతో ప్రయాణించే రోడ్లపై గృహ నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్‌ను నెలలు, సంవత్సరాల కొద్దీ రోడ్లపై ఉంచడం వలన ప్రయాణికులకు,వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రోడ్లపై చెత్త చెదారం, కంకర రాళ్లు వేసిన వారిపై స్థానిక సంస్థలు అధికారులు నోటీసు జారీ చేసి వాటిని తొలగించి సులభమైన ప్రయాణానికి కృషి చేయాలి. రాత్రిపూట ఇలాంటి రోడ్లపై నడవడం వాహనాలు ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుంది. రోడ్లపై వేసిన గృహనిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ తీసివేయాలని ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేయాలి.

- ఈ.వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

## నియంత్రణ అవసరం

మద్యం సేవించి డ్రైవింగ్ హైదరాబాద్‌లో ప్రజల భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారింది.వాహనదారులే కాకుండా, అమాయక ప్రయాణికులు, బాటసారులు కూడా ఈ ప్రమాదానికి గురవుతున్నారు. పట్టుబడినవారిలో ఎక్కువ మంది 18 నుండి 40 ఏళ్ల మధ్యవారే. వారిరక్తంలో మద్యం స్థాయిలు ప్రమాదకరంగా ఎక్కువగా ఉన్నాయి. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మద్యం సేవించి డ్రైవింగ్ కేసులు పెరుగుతుండటం ఆందోళనకరం. మద్యం సేవించి వాహనం నడపడం కేవలం చట్ట ఉల్లంఘనే కాదు, ఇది ప్రాణాలకు ప్రమాదకరం.

-వి.కృష్ణ కుమార్, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నిరంతర అభివృద్ధితో తెలంగాణ ప్రస్థానం

డాక్టర్ తిరునహరి శేషు

తెలంగాణ ఉద్యమ నేల అనేక ఉద్యమాలకి పురుడు పోసిన తెలంగాణ ధిక్కారమే సహజ ఆభరణంగా నాటి నైజాం వ్యతిరేక ఉద్యమం నుండి నేటి తెలంగాణ ఉద్యమం వరకు దేశంలోనే తెలంగాణది ఒక ప్రత్యేక వరవడి.చరిత్ర పుటలలో తెలంగాణ రాష్ట్రం ఒక భౌగోళిక రాష్ట్రమే కాదు అది ప్రజల ఉద్యమ ఆకాంక్ష ఉద్యమకారుల త్యాగాలపునాది కాబట్టి రాష్ట్రం ఏర్పాటై 11వసంతాలు పూర్తిచేసుకుని 12వ వసంతంలోకి అడుగుపెడుతున్న తెలంగాణ రాష్ట్రం అనేక మైలురాళ్లను అధిగమిస్తూ తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటుంది. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో నిధులు నీళ్ల నియామకాలలో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయం, వివక్షత ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి బీజాలు వేసింది. 1969లోరాష్ట్ర ఏర్పాటు కోసం 369మంది ఉద్యమకారులు పోలీస్ తూటాలకు ఎదురు నిలిచి తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేశారు.అలాగే మలిదశ ఉద్యమంలో 1200 మంది ఉద్యమకారులు రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను లెక్క చేయకుండా బలిదానం చేసుకున్న తెగువ తెగింపు లాంటి అరుదైన ఘటనలు ఒక్క తెలంగాణ ఉద్యమంలోనే కనపడతాయి. 1960 నుండి గుజరాత్‌తో మొదలు 2014లో తెలంగాణతో సహా దేశంలో 15 రాష్ట్రాలు ఏర్పాటయినాయి. ఉద్యమాలతో విభజిత రాష్ట్రంగా తెలంగాణ మనగలుగుతుందా అనే సందేహాలను పటాపంచలు చేస్తూ విమర్శకుల నోళ్లను మూయిస్తూ ఈ 11 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం దేశంలో అనేక పెద్ద రాష్ట్రాలతో పోటీపడుతూ అనేక విషయాలలో, వివిధ రంగాలలో అద్భుతమైన ప్రగతిని సాధిస్తుందనే చెప్పాలి. ఆర్థికంగా ఈ 11 సంవత్సరాలలో అనేక ఆర్థిక, ఆర్థికాభివృద్ధి సూచికలలో తెలంగాణ రాష్ట్రం గణనీయమైన మెరుగుదలనే సాధించింది. రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి ఐదు లక్షల కోట్ల రూపాయలుగా ఉన్న రాష్ట్ర ఆదాయం (జిఎస్ డి పి) 16 లక్షల కోట్ల రూపాయలకు పెరగడమే కాదు జీఎస్ డిపి వృద్ధిరేటులో తమిళనాడు ఉత్తరప్రదేశ్ తర్వాత దేశంలోనే తెలంగాణది మూడవస్థానం. 2014-15లో 1,24,104 రూపాయలుగా ఉన్న తలసరి ఆదాయం 2024-25 నాటికి 3,79,757 రూపాయలకు పెరిగి తెలంగాణ దక్షిణాదిలో మొదటి స్థానం, దేశంలోనే మూడో స్థానంలో నిలబడింది. అలాగే ఈ 11సంవత్సరాల కాలంలో రాష్ట్ర బడ్జెట్ లక్షకోట్ల రూపాయల నుండి మూడు లక్షల కోట్ల రూపాయలకి పెరిగింది. తెలంగాణ దేశ జీడీపీలో ఐదుశాతం వాటాను కలిగి దేశ అభివృద్ధిలో కూడా తెలంగాణ కీలక భాగస్వామిగా మారిందనే చెప్పాలి. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో (ఎస్‌డిఎస్) తెలంగాణ దేశంలో ఆరో స్థానంలో నిలిచి మిగతా రాష్ట్రాలకి ఆదర్శంగా నిలబడిందనే చెప్పాలి. ఈ పదకొండు సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ఆదాయం, తలసరి ఆదాయం గణనీయంగా పెరిగినప్పటికీ రాష్ట్ర అభివృద్ధి ఫలాలు కింది వర్గాల ప్రజలకి అందకపోవటం వలన రాష్ట్రంలో పెరిగిన సంపద,




ఆదాయం నిజమైన అభివృద్ధిని ప్రతిబింబించడం లేదు.రాష్ట్ర ఆదాయం లక్షల కోట్ల రూపాయలకు పెరిగినా ఆ పెరిగిన ఆదాయంలో 51శాతం ఒక్క హైదరాబాద్, రంగారెడ్డి,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల నుండే రావడం అదేవిధంగా తలసరి ఆదాయంలో కూడా జిల్లాల మధ్య పెద్దఎత్తున అంతరాలు ఉండటం వలన ఆర్థికాభివృద్ధి సూచికలు వాస్తవ అభివృద్ధిని ప్రతిబింబించలేకపోయినాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పా టైన తర్వాత మూడు పర్యాయాలు శాసనసభ ఎన్నికలు జరిగితే రెండు సామాజిక వర్గాలకే రాజకీయ అధికారం దక్కింది. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో కానీ ప్రత్యేక రాష్ట్రాలలో కానీ మెజార్టీ వర్గాలైన బలహీన వర్గాలు రాజ్యాధికారం దక్కించుకోలేకపోగా వారి రాజకీయ ప్రాతినిధ్యం కూడా తగ్గిపోవడంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలలో కానీ అధికారంలో కానీ గుణాత్మక మార్పులు రానట్లుగానే కనిపిస్తుంది. సామాజిక అంశాలలో విద్యా, ఆరోగ్యం,వైద్యం లాంటి కీలక రంగాలలో పేదరికం, నిరుద్యోగం లాంటి ప్రధాన సమస్యలను అదుపు చేయడంలో ఈ 11 సంవత్సరాలలో తెలంగాణ చెప్పుకోదగ్గ ఫలితాలనే సాధిస్తుందనే చెప్పాలి. రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణ రాష్ట్రంలోమూడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉంటే నేడు 32మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసుకొని పదివేల మెడికల్ సీట్లను తెలంగాణ కలిగి ఉంది. గురుకులాల సంఖ్యను 1023కి పెంచి రెసిడెన్షియల్ విద్యని కింది వర్గాలకు అందించే ప్రయత్నాలు జరిగినాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా 25 వేల కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ని నిర్మిస్తుంది కానీ ప్రభుత్వ హాస్పిటల్స్‌లోప్రభుత్వ పాఠశాలలో ఆశించినస్థాయిలో సౌకర్యాలు మెరుగుపడకపోవటం విద్యా,వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారటం అసంతృప్తిని కలిగిస్తుంది.వీటిపైన ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించే నిధులు పెంచి ఈ రెండు రంగాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందనే భావన వ్యక్తం అవుతుంది. తెలంగాణరాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి 13.18శాతంగా ఉన్న పేదరికం 3.76 శాతానికి తగ్గి పేదరికంతక్కువగా ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ 5 వ స్థానంలో నిలవడం 5.1 శాతం నిరుద్యోగితతో తెలంగాణ నిరుద్యోగం తక్కువగా ఉన్న రాష్ట్రాలలో ఎనిమిదో స్థానంలో ఉన్నది కానీ ఉద్యమ ఆకాంక్షలలో అత్యంత బలమైన ఆకాంక్ష నియామకాల విషయంలో గత ప్రభుత్వం, ఇప్పటి ప్రభుత్వాలు రెండు కలిసి కూడా రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కూడా భర్తీ చేయకపోవడం పెద్ద వైఫల్యంగానే చూడాలి. ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ భర్తీ చేస్తుంది కానీ కొత్త నోటిఫికేషన్స్ విడుదలలో మరింత వేగంగా పని చేయాలని యువత ఆకాంక్షిస్తుంది. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మూడు కోట్ల మందికి సన్న బియ్యం, 70 లక్షల మందికి రైతు భరోసా, 25 లక్షల మంది రైతులకు చేసిన రైతు రుణమాఫీ లాంటి పథకాలు దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయి.అలాగే ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేసినప్పుడే క్రిందివర్గాల ప్రజలకి సంక్షేమ ఫలాలు అందుతాయి.ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలోనూ పెట్టుబడుల ఆకర్షణలో దేశంలో నాలుగు స్థానంలోనూ ఐటీ లాంటి కీలక రంగంలో తెలంగాణ రాష్ట్రం అత్యంత వేగంగా వృద్ధినిసాధించి తనసత్తా చాటుతుంది. తెలంగాణలోమొదటిసారిగా అనారోగ్యకరమైన రాజకీయ వాతావరణం కనిపిస్తుంది కాబట్టి తెలంగాణ రాష్ట్రం నిబద్ధత, అంకితభావంతో కూడిన రాజకీయాలతో పారదర్శకమైన, సమర్థవం తమైన పాలనతో భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని తెలంగాణ దేశంలోనే ఒక అత్యున్నత రాష్ట్రంగా ఎదగాలని ఆశిద్దాం. ●

# ట్రంప్ వైఖరిపైనే జీ7 దేశాధినేతల ఫోకస్

## అమెరికాతో ద్వైపాక్షిక చర్చలవైపే అధికుల మొగ్గు




టొరంటో, జూన్ 15 : కెనడాలోని అల్బర్టా ప్రావిన్స్‌లో ఉన్న కననస్కిస్ వేదికగా జరిగే జీ7 కూటమి సమావేశాలకు అధినేతలు మెత్తం చేరుకున్నారు. ఈనెల 17 వరకు జరుగనున్న ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కేంద్ర బిందువుగా నిలువనున్నారు. ఈసారి సదస్సుకు హాజరుకానున్న ప్రపంచ దేశాల ప్రభుత్వాధినేతలు ట్రంప్‌తో ద్వైపాక్షిక సమావేశాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. అందుకే జీ7 సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. సదస్సు చివర్లో జీ7 దేశాలు సంయుక్త ప్రకటన చేసే సంప్రదాయాన్ని ఈసారి ఆపేయాలని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ డిసైడ్ చేశారు. ప్రపంచ దేశాలపై ట్రంప్ సుంకాలు, హెచ్చరికలతో విరుచుకుపడుతున్న ప్రస్తుత తరుణంలో ఐక్యతను ప్రదర్శించడం కంటే అమెరికాతో ద్వైపాక్షిక చర్చలకే పెద్దపీట వేయడం మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. జీ7 సదస్సు వేదిక కననస్కిస్‌కు ట్రంప్ వేరుకుంటారు. ఇప్పటికే చాలా దేశాల ప్రభుత్వాధినేతలు అక్కడికి చేరుకున్నారు. ఏకకాలంలో పెద్దసంఖ్యలో ప్రపంచ దేశాల నేతలతో రౌండ్ టేబుల్ తరహా భేటీకి అమెరికా అధ్యక్షుడు ఒప్పుకునే ఛాన్స్ లేదని తెలుస్తోంది. ఒక్కొక్క దేశాధినేతతో కాసేపు ద్వైపాక్షిక సమావేశానికే ట్రంప్ మొగ్గుచూపుతారని అంటు న్నారు. జీ7 కూటమిలో లేనప్పటికీ కెనడా నుంచి ఆహ్వానం అందుకున్న దేశాల జాబితాలో భారత్, ఉక్రెయిన్, యూఏఈ, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, మెక్సికో, బ్రెజిల్, దక్షిణాఫ్రికా ఉన్నాయి. ఈదేశాలతో పాటు జీ7 సభ్య దేశాలు తమపై వీలైనంత మేరకు సుంకాల భారాన్ని తగ్గించాలని ట్రంప్‌తో మొరపెట్టుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే ట్రంప్ ఎలా స్పందిస్తారనేది ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు, రష్యా ఉక్రెయిన్ యుద్ధం, కెనడాను అమెరికాలోని 51వ రాష్ట్రంగా చేస్తానన్న ట్రంప్ ప్రకటన, గ్రీన్ లాండ్‌ను స్వాధీనం చేసుకుంటానని అమెరికా చేసిన అనౌన్స్‌మెంట్లు ఈ సదస్సులో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. రష్యా ఉక్రెయిన్ యుద్ధం తీవ్రరూపు దాల్చిన ప్రస్తుత తరుణంలో ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ భేటీ కానున్నారు. చివరిసారిగా అమెరికాలోని వైట్ హౌస్‌లో ఉన్న ఓవల్ ఆఫీస్ వేదికగా వీరిద్దరూ సమావేశమయ్యారు. అప్పట్లో మీడియా ఎదుటే జెలెన్‌స్కీని కించపరిచేలా ట్రంప్ నానా మాటలు అన్నారు. ఉక్రెయిన్‌లోని సహజ వనరులను అమెరికాకు అప్పగిస్తేనే సైనికసాయం కొనసా గుతుందని తేల్చి చెప్పారు. ఈసారి జరిగే భేటీ లోనూ ఆ అంశాన్ని ట్రంప్‌లేవనెత్తే అవకాశం లేకపోలేదు. ఐరోపా దేశాల ఎజెండాలో ఉక్రెయిన్‌కు సైనిక భద్రత ప్రస్తుతం ఉక్రెయిన్‌కు యూకే, పలు ఐరోపా దేశాలు అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తున్నాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఈసారి రెండు ప్రధాన అంశాలపై ట్రంప్‌తో చర్చలు జరిపే అవకాశం ఉంది. యూరోపియన్ యూని యన్‌పై అమెరికా సుంకాల భారం, ఉక్రెయిన్ భవిష్యత్ భద్రత గురించి ఈ ఇద్దరూ డిస్కస్ చేసే ఛాన్స్ ఉంది. ఒకవేళ రష్యాతో ఉక్రెయిన్‌కు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరితే ఐరోపా దేశాలు, అమెరికా కలిసి ఉక్రెయిన్‌కు సైనిక భద్రత కల్పించాలనే ప్రతిపాదనను గతంలోనే మెక్రాన్ తెరపైకి తెచ్చారు. అయితే అప్పట్లో ట్రంప్ అందుకు నో చెప్పారు. ఈసారి చర్చల్లో దీనిపై ఎలాంటి ఫలితం వస్తుందో వేచిచూడాలి. జీ7 సదస్సుకు బయలుదేరిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ మార్గం మధ్యలో డెన్మార్క్‌లోని గ్రీన్ లాండ్ ప్రాంతంలో దిగారు. ఉద్దేశపూర్వకంగానే ఆయన అక్కడ ల్యాండ్ అయ్యారు. గ్రీన్‌లాండ్ ప్రాదేశిక నేతలు, డెన్మార్క్ ప్రధానితో మెక్రాన్ భేటీ అయ్యారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో కలుపుకుంటామని ఈసారి అమెరికా అధ్యక్షుడు కాగానే ట్రంప్ ప్రకటించారు. అది సాధ్యమయ్యే విషయం కాదని, ఐరోపాదేశాలు ఐక్యంగా ఉంటాయనే సందేశాన్ని ట్రంప్‌కు ఇచ్చేందుకే గ్రీన్‌లాండ్‌కు మెక్రాన్‌వెళ్లారని పరిశీలకులు అంటున్నారు.


# భారీగా పెరుగుతున్న కరోనా కేసులు

## ఢిల్లీలో ఒకే రోజు ముగ్గురి మృతి



న్యూఢిల్లీ,జూన్ 15: దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి మళ్లీ విస్తరిస్తున్నది. ఢిల్లీలోనూ కరోనా విధ్వంసం కొనసాగుతున్నది. తొలిసారిగా దేశ రాజధానిలో కరోనా వైరస్‌తో ఒకే రోజులో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటి వరకు ఢిల్లీలో కరోనా కారణంగా 11 మంది మరణించారు. ఢిల్లీలో మరణించిన ముగ్గురిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. 57 ఏళ్ల మహిళకు డయాబెటిస్, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నాయి. మరో వ్యక్తికి సైతం ఇవే సమస్యలున్నట్లుగా గుర్తించారు. అలాగే, 83 ఏళ్ల మహిళకు డయాబెటిస్, హై బీపీ, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నాయి. అయితే, యాక్టివ్ కరోనా రోజుల్లో తగ్గుదల కనిపించింది. యాక్టివ్ రోగుల సంఖ్య 672కి తగ్గింది. జనవరి నుంచి ఇప్పటి వరకు ఢిల్లీలో కొవిడ్‌తో 11మంది ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురి మరణానికి కొవిడ్ మాత్రమే కారణం కాదని.. వారికి ఉన్న దీర్ఘకాలిక వ్యాధులు సైతం కారణమని వైద్యులు తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వివరాల 24గంటల్లో 212 మందికి కొవిడ్ పాజిటివ్‌గా తేలింది. దేశంలో నమోదైన మొత్తం కేసుల్లో ఢిల్లీ రెండోస్థానంలో ఉన్నది. కొవిడ్ కేసులకు కొత్త వేరియంట్ కారణమని భావిస్తున్నారు. అయితే, వాటితో అంతగా ప్రమాదమేమీ లేదని.. గతంలో వేరియంట్ల తరహాలో ప్రాణాంతకం కావని పేర్కొన్నారు. అయితే, వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, ఇప్పటికే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. తేలికపాటి లక్షణాలు కనిపించినా.. ఆ తర్వాత తీవ్రమైన శ్వాసకోశ సమస్యల వరకు పెరగవచ్చని పేర్కొంటున్నారు. కరోనా సాధారణ లక్షణాలలో జలుబు ఉండడం, పొడిదగ్గు, గొంతునొప్పి, ఒంటినొప్పులు, అలసట, వాసన, రుచి చూసే సామర్థ్యం తగ్గిపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా అనిపిస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. అయితే, కొవిడ్ కేసులు పెరుగుతున్నాయని భయపడాల్సిన, ఆందోళన చెందాల్సిన పని లేదని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, జలుబుతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో బాధపడుతున్న రోగులు వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకొని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# మహాత్మాగాంధీ మునిమనుమరాలికి ఏడేళ్ల జైలు!



డర్బన్,జూన్ 15: మహాత్మాగాంధీ మునిమనువరాలు ఆశిష్ లతా రామ్‌గోబిన్(56)కు సౌతాఫ్రికా కోర్టు ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ఈ మేరకు డర్బన్‌లోని స్పెషలైజ్డ్ క్రైమ్ కోర్టు తీర్పు వెలువరించింది. ప్రముఖ మానవహక్కుల కార్యకర్త ఇలా గాంధీ, దివంగత మేవా రామ్‌గోబిన్ కుమార్తె అయిన లతా రామ్‌గోబిన్ అక్కడ ఎస్‌ఆర్ మహారాజ్ అనే వ్యాపారవేత్తను 6 మిలియన్ రాండ్స్ (రూ.3.22 కోట్లకు) మోసం చేసిన కేసులో ఈ శిక్ష పడింది. నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష ఖరారు చేస్తూ అప్పీలు చేసుకునే అవకాశాన్ని నిరాకరించింది. లతా రామ్‌గోబిన్ ఒక ఎన్‌జీఓ ద్వారా సామాజిక కార్యక్రమాలు చేస్తూ తన పలుకుబడిని ఉపయోగించి మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. లతా రామ్‌గోబిన్ 2015లో ఎస్‌ఆర్ మహారాజ్ అనే వ్యాపారిని మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. న్యూ ఆఫ్రికా అలయన్స్ ఫుట్‌వేర్ డిస్ట్రిబ్యూటర్స్ డైరెక్టర్‌గా ఉన్న మహారాజ్‌ను లత డబ్బులు అడిగారు. దీనికోసం లతా రామ్‌గోబిన్ తాను భారత్ నుంచి మూడు కంటైనర్ల లినెన్ దిగుమతి చేసుకుంటున్నానని వాటిని దక్షిణాఫ్రికాలోని ప్రైవేట్ హెల్త్‌కేర్ గ్రూప్ నెట్‌కేర్‌కు పంపుతానని నమ్మబలికారు. దిగుమతి సుంకాలు, కస్టమ్స్ క్లియరెన్స్ కోసం డబ్బు కావాలని అడిగారు. అయితే మహారాజ్‌ను నమ్మించడానికి లతా రామ్‌గోబిన్ కొన్ని నకిలీ పత్రాలను చూపించారు. వాటిలో సంతకం చేసిన పర్చేజ్ ఆర్డర్, ఇన్వాయిస్, నెట్‌కేర్ నుంచి డెలివరీ నోట్ ఉన్నాయి. అంతేకాకుండా నెట్‌కేర్ తనకు డబ్బులు కూడా చెల్లించినట్లుగా ఒక బ్యాంకు ధ్రువీకరణ పత్రాన్ని కూడా చూపించారు. వీటికి తోడు లతా రామ్‌గోబిన్ ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త ఎలా గాంధీ కుమార్తె కావడంతో మహారాజ్ సహాయం చేయడానికి అంగీకరించారు. తనకు లాభాలలో వాటా వస్తుందని ఆశించారు. అయితే, ఆ పత్రాలన్నీ నకిలీవని తర్వాత తేలింది. అసలు భారత్ నుంచి ఎలాంటి వస్తువులు దిగుమతి కాలేదని తెలిసింది. దీంతో మహారాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ సమయంలో నేషనల్ ప్రాసిక్యూటింగ్ అథారిటీ (ఎన్‌పిఎ) బ్రిగేడియర్ హంగ్వాని ములౌడ్జీ మాట్లాడుతూ లతారామ్ గోబిన్, తాను అల్లిన కథను నిజమని నమ్మించ డానికి నకిలీ పత్రాలను సృష్టించిందని చెప్పారు. లత నకిలీ ఇన్వాయిస్‌లు, ఇమెయిల్‌లను ఉపయోగించి మహారాజ్‌ను మోసం చేసిందని ధ్రువీకరించారు. దీంతో కోర్టు ఆమెను దోషిగా తేల్చి ఆమె అప్పీల్ చేయడానికి వీలున్న అభ్యర్థనను కూడా తిరస్కరించింది. 2015లో ఆమెకు 50,000 రాండ్ల పూచీకత్తుతో బెయిల్ లభించింది. ఆసమయంలో లతా రామ్‌గోబిన్ "పార్టిసిపేటివ్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్" అనే కార్యక్రమాన్ని నడిపేవారు. అప్పుడు తను సామాజిక, రాజకీయ, పర్యావరణ సమస్యలపై దృష్టిసారించే కార్యకర్తగా చెప్పుకున్నారు. మరోవైపు, లతా రామ్‌గోబిన్ తల్లి ఎలాగాంధీకి భారత దేశం, దక్షిణాఫ్రికానుంచి అనేక జాతీయ పురస్కారాలు లభించాయి. శాంతికోసం ఆమె చేసిన కృషికిగుర్తింపుగా ఈ అవార్డులు వచ్చాయి. ఆమె బంధువులు కీర్తి మీనన్, సతీష్ ధూపేలియా, ఉమా ధూపేలియామెస్త్రై కూడా సామాజిక సేవ, ఉద్యమాలతో పేరు తెచ్చుకున్నారు.

# ప్రాణాల మీదికి తెచ్చిన జిప్‌లైన్ అడ్వంచర్!

మనాలి,జూన్ 15: సెలవుల్లో సరదాగా గడుపుదాని వెళ్లిన విహారయాత్ర విషాదంగా మారింది. మనాలిలో ఓ 12ఏళ్ల బాలిక జిప్‌లైన్ అడ్వెంచర్ చేస్తుండగా 30 అడుగుల ఎత్తు నుంచి అమాంతం కింద పడిపోయింది. కింద పడిన నేలతో మొత్తం బండరాళ్లు ఉండటంతో బాధితురాలికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే జిప్ లైన్ నిర్వాహకుల నిర్లక్ష్యమే ఇందుకు కారణం అని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వేసవి సెలవులు కావడంతో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ప్రఫుల్ల బిజ్వే, అతని భార్య, కుమార్తె త్రిషతో విహారయాత్రకు వెళ్లారు. టూర్‌లో భాగంగా మనాలిని సందర్శించారు. ఈ క్రమంలో జిప్‌లైన్ అడ్వెంచర్‌పై త్రిష ఆసక్తి కనబర్చింది. కుమార్తె కోరిక మేరకు బిజ్వే.. ఆమెను జిప్‌లైన్ ఎక్కించారు. అయితే కొంత దూరం వెళ్లగానే.. ఒక్కసారిగా కేబుల్ తెగిపోయింది. దీంతో త్రిష దాదాపు 30 అడుగుల ఎత్తు నుండి కింద నదిలో పడిపోయింది. అందరూ చూస్తుండగానే ఈ ప్రమాదం జరిగింది. నదిలో బండరాళ్లు ఉండటంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన త్రిష వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ప్రమాదంలో త్రిష కాలు విరిగింది. మొదట మనాలిలోని ఆమెకు ఒక ఆసుపత్రిలో చికిత్స అందించారు. తరువాత మెరుగైన వైద్యం కోసం చండీగఢ్‌లోని ఒక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం త్రిష నాగ్‌పూర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యులు ఆమె పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారు. అయితే ప్రమాదం జరిగిన ప్రదేశంలో తగిన భద్రతా చర్యలు లేవని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో సహాయం చేయడానికి ఎవరూ ముందుకు రాలేదని వారు వాపోయారు. అధికారులు తక్షణమే స్పందించి, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పర్యాటకుల భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడుతున్నారు.

# ఫాల్కన్ రాకెట్ లోపాన్ని గుర్తించిన ఇస్రో

## ఎట్టకేలకు 19న రోదసిలోకి శుభాంశు శుక్లా



న్యూఢిల్లీ,జూన్ 15: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సహా నలుగురు అంతరిక్ష యాత్రికులను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ఐఎస్ఎస్ తీసుకెళ్లనున్న స్పేస్ఎక్స్ ఫాల్కన్9 రాకెట్‌లో తలెత్తిన తీవ్ర సాంకేతిక లోపాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో సమయస్ఫూర్తితో గుర్తించి, పెను ప్రమాదాన్ని నివారించింది. యాక్సియమ్4 మిషన్ ప్రయోగం తొలుత వాయిదా పడింది. లోపాలను సరిదిద్దిన అనంతరం, జూన్ 19న ప్రయోగాన్ని చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. యాక్సియమ్4 మిషన్ ప్రయోగానికి సిద్ధమవుతున్న ఫాల్కన్9 రాకెట్ మొదటి దశలోని ఆక్సిడైజర్ లైన్‌లో పగుళ్లు ఉన్నట్లు వెల్లడైంది. స్పేస్ఎక్స్ సంస్థ మొదట దీనిని ఒక చిన్న లీక్‌గా పరిగణించి, తాత్కాలిక పర్జ్ పరిష్కారంతో ప్రయోగానికి ముందుకు వెళ్లాలని భావించింది. అయితే, ద్రవ ఆక్సిజన్ అత్యంత వేగంగా మండే స్వభావం కలిగినందున, ఈ లోపం ప్రయోగ సమయంలో రాకెట్ గాల్లోకి లేచే సమయంలోనే భారీ వైఫల్యానికి దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్లిష్టపరిస్థితుల్లో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ వ్యోమగాముల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. రాకెట్‌లో పూర్తిస్థాయి తనిఖీలు చేసి, లోపాన్ని సమూలంగా సరిదిద్దాలని, తక్కువ ఉష్ణోగ్రతల వద్ద లీకేజ్ పరీక్షలతో సహా అన్ని భద్రతా పరీక్షల ద్వారా ధృవీకరించాలని ఆయన స్పేస్ఎక్స్‌ను డిమాండ్ చేశారు. ఇస్రో చూపిన ఈ దృఢ వైఖరితో స్పేస్ఎక్స్ వెనక్కి తగ్గి, క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టగా, ఆక్సిడైజర్ లైన్‌లో వైల్డ్ క్రాక్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. భారత వ్యోమగామి శుభాంశు శుక్లా భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అవసరమైతే మిషన్ నుంచి వైదొలగడానికి కూడా భారత్ సిద్ధపడింది. ఇస్రో పట్టుదల, సమన్వయంతో స్పేస్ఎక్స్ బృందాలు పగిలిన భాగాన్ని మార్చి, అవసరమైన అన్ని మరమ్మతులు, పరీక్షలు పూర్తిచేశాయి. ఫాల్కన్9 వాహనంలోని లోపాన్ని విజయవంతంగా పరిష్కరించినట్లు ఇస్రో, యాక్సియమ్ స్పేస్, స్పేస్ఎక్స్ సంయుక్తంగా ధృవీకరించాయి. వ్యోమగాముల భద్రతకు పెద్దపీట వేస్తూ, యాక్సియమ్4 మిషన్‌ను జూన్ 19న ఫ్లోరిడాలోని కెన్నెడీ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించేందుకు ప్రస్తుతం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇస్రో తీసుకున్న నిర్ణయాత్మక చర్యలు, భద్రతా నిబద్ధత అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.

# ప్రధానికి విదేశ పర్యటనలపైనే మోజు

## మణిపూర్ వెళ్లడానికి మాత్రం విముఖం: జైరామ్ రమేష్ ధ్వజం



న్యూఢిల్లీ,జూన్ 15: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. విదేశీ పర్యటనలకు వెళ్లేందుకు ప్రధానికి ఎనర్జీ(శక్తి), ఎగ్జైట్‌మెంట్(ఉత్సుకత), ఉత్సాహం అనే 3ఈలు మాత్రమే ఉన్నాయని విమర్శించింది. తల్లడిల్లుతున్న మణిపూర్‌కు వెళ్లేందుకు ఎంపథీ (సానుభూతి) అనే నాలుగో 'ఈ' లేదని . ఆదివారం సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాల పర్యటనకు మోదీ వెళ్లిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ విమర్శించారు.

2023 మే నుంచి ప్రధానమంత్రి విదేశీ పర్యటనలకు వెళ్లడం ఇది 35వ సారి అని, ఇంత సుదీర్ఘ వ్యవధిలో ఒక్కసారి కూడా మణిపూర్‌కు వెళ్లే తీరిక మోదీకి దొరకకపోవడం దారుణం. మణిపూర్ రాష్ట్రాన్ని అత్యంత దారుణ రీతిలో ప్రధాని మోదీ విస్మరిస్తున్నారు. అక్కడి ప్రజల గోడును వినాలనే ఆసక్తే ఆయన లేదు. 2023 మే 3 నుంచి మణిపూర్‌కు చెందిన ఏ ఒక్కరినీ మోదీ కలవలేదు. సానుభూతి భావన నాలుగో 'ఇ' ఉన్నవాళ్లు ఎవరైనా సరే మణిపూర్ ప్రజల బాధను తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. కానీ, ప్రధాని మోదీకి నాలుగో ఈ లేదని జైరాం రమేశ్ పేర్కొన్నారు. కెనడా, భారత్‌లు ఎల్లప్పుడూ కలిసిమెలిసి ఉంటాయని 2015లో ప్రధాని చెప్పారు. మోదీ చెప్పింది అక్షరాలా తప్పు అని కాలక్రమంలో తేలిపోయింది. మారిన పరిస్థితులే అందుకు నిదర్శనమని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ అంశంపై 2015లో మోదీ చేసిన వ్యాఖ్యలతో కూడిన ఒక వీడియో క్లిప్‌ను ఆయన తన ట్వీట్‌లో షేర్ చేశారు. భారత్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కాబట్టే జీ7 సదస్సుకు ఆహ్వానించామని ఇటీవలే కెనడా ప్రధానమంత్రి చెప్పారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించిందని 2025 మే 24న నీతి ఆయోగ్ సీఈఓ ప్రకటన చేశారు. ఈ రెండు వ్యాఖ్యల మధ్య ఉన్న తేడాను ప్రధాని మోదీ గుర్తించాలి. జీ7 సదస్సుకు భారత్‌ను కెనడా ఆహ్వానించదేమో అనే చర్చ జరుగుతున్న తరుణంలో మోదీ అభిమానులు గట్టిగా బల్లగుద్ది ఒక విషయాన్ని చెప్పారు. కెనడా పిలిచినా మోదీ అక్కడికి వెళ్లరని భీషణ ప్రతిజ్ఞలు చేశారు. అయితే ఎప్పటిలాగే వాళ్లందరి మాటలను మోదీ వమ్ము చేశారు. ఆయన నిజస్వరూపం బయటపడిందని జైరాం రమేశ్ విమర్శించారు.


# ఇజ్రాయెల్ పిఎం నెతన్యాహు కుమారుడి పెళ్లి వాయిదా



టెల్‌అవీవ్, జూన్ 15: ఇజ్రాయెల్-ఇరాన్ దేశాల మధ్య పరస్పర దాడులతో పశ్చిమాసియా రగిలిపోతోంది. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ ప్రధాని జెంజమిన్ నెతన్యాహు తన కుమారుడి వివాహం విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయన వివాహ వేడుకను వాయిదా వేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. నెతన్యాహు కుమారుడు అవ్‌నర్, అమిత్ యార్డేనీల వివాహం సోమవారం జరగాల్సి ఉంది. ఈ వేడుకను వైభవంగా నిర్వహించేందుకు ఆయన కుటుంబం సిద్ధమైంది. కానీ ఇరాన్‌లో సైనిక స్థావరాలు, అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దళాలు దాడులు చేస్తున్నాయి. వీటికి ప్రతీకారంగా ఇరాన్ కూడా తిరిగి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తోంది. దాంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ స్థితిలో ఇంట్లో వేడుకలు చేసుకోవడం కరెక్టు కాదని నెతన్యాహు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న నాటి నుంచే నెతన్యాహు కుమారుడి వివాహం అంశం వివాదాస్పదంగా మారింది. ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే ప్రధాని ఇంట వేడుకలు నిర్వహిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ఇంతలో ఇరాన్‌తో ఘర్షణలు మొదలయ్యాయి. అందుకే ఆయన కుమారుడి వివాహాన్ని వాయిదా వేశారు.

# ఎయిరిండియా ప్రమాద మృతుల్లో 31 మందికి డిఎన్ఎ పరీక్షలు

## మృతదేహాలు కుటుంబ సభ్యులకు అప్పగింత



అహ్మదాబాద్,జూన్ 15: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మరణించిన 31 మృతదేహాలను డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించామని బీజే వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రజనీశ్ పటేల్ పేర్కొన్నారు. 12 మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ డీఎన్ఏ సరిపోలిక ప్రక్రియ కూడా జరిగిందని, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. బాధితుల కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి 230 బృందాలను ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. మూడ్రోజుల క్రితం అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన ఎయిరిండియా బోయింగ్ విమానం కొన్ని నిమిషాలకే సమీపంలోని బీజే వైద్యకళాశాలపై కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు పైలెట్లు, 10 మంది సిబ్బంది సహా 241 మంది మృతి చెందారు. ప్రమాదం నుంచి ఒకే ఒక ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డారు. డీఎన్ఏను సరిపోల్చే ప్రక్రియ చాలా జాగ్రత్తగా చేయాలని రజనీశ్ పటేల్ పేర్కొన్నారు. ఇందులో చట్టపరమైన, వైద్యపరమైన చిక్కులున్నా యన్నారు. కాబట్టి, తొందరపాటు పనికిరాదని అభిప్రాయపడ్డారు. ప్రమాదం నుంచి బయటపడిన ఒకే ఒక్క వ్యక్తి అయిన విశ్వాస్‌కుమార్ రమేశ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన 11 మంది విదేశీయుల కుటుంబాలను సంప్రదించినట్లు గుజరాత్ రెవెన్యూ కార్యదర్శి అలోక్‌పాండే స్పష్టం చేశారు. కాగా, 274 మంది దుర్మరణానికి కారణమైన ఈ ప్రమాదంలో చాలా మృతదేహాలు గుర్తు పట్టలేని విధంగా తయారయ్యాయి. డీఎన్ఏ పరీక్షతో పనిలేకుండా బంధువులు గుర్తుపట్టిన ఎనిమిది మంది మృతదేహాలను ఇప్పటికే వారి కుటుంబీకులకు అప్పగించారు. వీలైనంత వరకు ఇతర మృతుల డీఎన్ఏను గుర్తించేందుకు అధికారులు ప్రయత్ని స్తున్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి నివాళిగా అహ్మదాబాద్‌లండన్ మార్గంలో నడిచే విమాన నంబర్లు ఎఐ171 ను ఎయిర్ ఇండియా రద్దు చేసింది. బదులుగా కొత్త విమాన నంబర్లు ఎఐ159/ఎఐ 160గా మార్చింది. ఈ కొత్త నెంబర్లు జూన్ 17 నుంచి అహ్మదాబాద్‌లండన్ మార్గంలో నడిచే విమానాలకు అమలులోకి వస్తాయని ఎయిర్ ఇండియా పేర్కొంది.

# మాజీ సిఎం రూపానీ మృతదేహం గుర్తింపు

## డిఎన్ఎ పరీక్షల తర్వాత కుటుంబీకులకు అప్పగింత

అహ్మదాబాద్,జూన్ 15: అహ్మదాబాద్‌లో మూడు రోజుల క్రితం జరిగిన విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృతదేహాన్ని గుర్తించారు. రూపానీ రక్తసంబంధీకుల డీఎన్ఏతో ఘటనా స్థలంలో సేకరించిన శరీర భాగాల డీఎన్ఏ మ్యాచ్ అయ్యింది. ఆదివారం మధ్యాహ్నం 11.10 గంటలకు డీఎన్ఏ టెస్టుకు సంబంధించిన ఫలితాలు వచ్చాయి. రూపానీ మృతదేహం గుర్తించిన అధికారులు ఆదివారం మధ్యాహ్నం ఆయన కుటుంబసభ్యులకు అప్పగించారు. రాజ్‌కోట్‌లో ఆయన అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో రూపానీ అంత్యక్రియలు జరగనున్నాయి.

# ఇరాన్‌పై యుద్ధంలో ఇజ్రాయెల్‌కు బ్రిటన్ మద్దతు



లండన్, జూన్ 15: ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇరాన్ ఒంటరి పోరాటం చేస్తోంది. అగ్ర దేశాలు మొత్తం ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలుస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ఇజ్రాయెల్‌కు తన మద్దతు ప్రకటించారు. ఇరాన్‌కు హెచ్చరికలు సైతం జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే ఇరాన్ ఓ కీలక ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సైనిక స్థావరాలు, వారి యుద్ధ నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేసింది. ఇరాన్ బెదరింపులను బ్రిటన్ లెక్కచేయలేదు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచేందుకు రంగంలోకి దిగింది. మిలటరీ బలగాలను మిడిల్ ఈస్ట్‌కు తరలిస్తున్నట్లు యుకె ప్రకటించింది. ఈ విషయాన్ని బ్రిటన్ ప్రధానమంత్రి కైర్ స్టార్మర్ స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'నేను యుకెకు ఏది మంచో అదే చేస్తాను. మిడిల్ ఈస్ట్‌కు మిలటరీ బలగాలను తరలిస్తున్నాం. ఏదైనా అత్యవసర పరిస్థితి రావచ్చొని ఈ నిర్ణయం తీసుకున్నాను' అని అన్నారు.

# కూలిన ఎయిరిండియా బోయింగ్‌కు మేం సర్వీస్ చేయలేదు

## టర్కీ సంస్థ టర్కిష్ టెక్నిక్ వెల్లడి



అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జూన్ 12న కూలిన ఎయిర్ ఇండియా డ్రీమ్ లైనర్ విమానం నిర్వహణలో తమ సంస్థకు సంబంధం లేదని టర్కీ తెలిపింది. ఈ ప్రమాదంపై వస్తున్న ఆరోపణలను ఆ దేశం ఖండించింది. టేకాఫ్ సమయంలో కూలిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 7878 విమానం నిర్వహణను టర్కిష్ టెక్నికల్‌సంస్థ చేపట్టినట్లుగా వస్తున్న ఆరోపణలు అబద్ధమని తెలిపింది. టర్కీ, భారత్ మధ్య సంబంధాలపై ప్రజల్లో దురాభిప్రాయం కలిగించే తప్పుడు సమాచారమని ఆరోపించింది. కాగా, ఎయిర్ ఇండియా, టర్కిష్ టెక్నిక్ మధ్య 2024-2025లో జరిగిన ఒప్పందాల ప్రకారం బీ777 వైడ్ బాడీ విమానాలకు ప్రత్యేకంగా నిర్వహణ సేవలు అందిస్తున్నట్లు టర్కీ ప్రభుత్వం తెలిపింది. అయితే ప్రమాదానికి గురైన బోయింగ్ 7878 డ్రీమ్‌లైనర్ ఈ ఒప్పందం పరిధిలోకి రాదని స్పష్టం చేసింది. ఈ రోజు వరకు టర్కిష్ టెక్నిక్ ఈ రకమైన ఏ ఎయిర్ ఇండియా విమానానికి నిర్వహణ బాధ్యత నిర్వహించలేదని పేర్కొంది. మరో వైపు కూలిన ఎయిర్ ఇండియా విమానానికి ఏ కంపెనీ చివరిగా సర్వీస్ చేసిందో అన్నది తమకు తెలుసని టర్కీ తెలిపింది. అయితే విమాన ప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతున్న తరుణంలో మరిన్ని ఊహాగానాలను నివారించ డానికి ఆ సంస్థ పేరును వెల్లడించడంలేదని టర్కీ చెప్పింది. విషాదకరమైన విమాన ప్రమాదంపై భారత ప్రజల దుఃఖాన్ని టర్కీ ప్రజలు హృదయపూర్వకంగా పంచుకుంటున్నారని పేర్కొంది.

# బోకోహారాం మిలిటెంట్ల భారీ దాడులు

## ఈశాన్యనైజీరియాలో 100 మందికి పైగా పౌరులు మృతి

అబూజా(నైజీరియా),జూన్ 15: ఆఫ్రికా దేశం నైజీరియాలోని ఈశాన్యప్రాంతంలో బోకోహారాం మిలిటెంట్లు ఒక మార్కెట్‌పై జరిపిన విచ్చలవిడి కాల్పుల్లో సుమారు వందమందికిపైగా చనిపోయారు. మార్కెట్‌తోపాటు, ఇళ్లలో ప్రార్థనలు చేసుకుంటున్నవారిని మరీ కాల్చిచంపారు. 2009 నుంచి కూడా బోకోహారాం మిలిటెంట్లు నైజీరియాలోనే కాకుండా ఇతర ఆఫ్రికాదేశాల్లో విచ్చలవిడి ఉగ్రవాదాన్ని అమలుచేస్తున్నారు. తాజా దాడిలో సుమారు 50 మంది ఉగ్రవాదులు మోటారు సైకిళ్లపై వచ్చి తర్మువా కౌన్సిల్‌ప్రాంతంలోకి వచ్చీరాగానే కాల్పులు ప్రారంభించారు. కొన్ని ఇళ్లను దగ్ధంచేసినట్లు యోబే పోలీస్ ప్రతినిధి డంగస్ అబ్దుల్‌కరీమ్ తెలిపారు. 2009నుంచి కూడా బోకోహారాం ఇలాంటి కల్లోలాన్ని సృష్టిస్తోందని, ఇస్లామిక్ షరియా రాజ్య స్థాపన లక్ష్యంగా ఈ దాడులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సుమారు 35 వేలమందికిపైగా ఇప్పటివరకూ చనిపోయారు. 20 లక్షలమందికిపైగా నిరాశ్రయులయినట్లు అధికారులు చెపుతున్నారు. విదేశీ సాయంకోసం ఈ దేశ ప్రజలు తహతహలాడుతున్నారు. మానవతా సంక్షోభం కూడా పెరిగిందని ఆందోళనగా ఉంది. ఈ ఒక్క ఏడాదిలోనే 1500 మందిని బోకో హారాం మిలిటెంట్లు చంపివేసారు. సాయుధులుగా వచ్చిన దుండగులు ఈ ఘాతుకాలకు పాల్పడుతున్నారు. ఆదివారం జరిగిన దాడిలో కేవలం 34 మంది మాత్రమేచనిపోయారని యోబే డిప్యూటి గవర్నర్ ఇడి బరేడ్ గుబానా తక్కువచేసి చెప్పినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. వాస్తవానికి వంద మందికిపైగా చనిపోయినట్లు స్థానికులు చెపుతున్నారు. ప్రభుత్వ సెక్యూరిటీ దళాలకు తమ సమాచారాన్ని చేరవేస్తున్నందుకే ఈ గ్రామస్తులను కాల్చివేసినట్లు బోకోహారామ్ సభ్యులు చెపుతున్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం వల్లనే మా సభ్యులు అనేకమంది చనిపోయారని అందువల్లనే వారిని మందలించాలని నిర్ణయించి ఈచర్యకు పాల్పడినట్లు బోకోహారామ్ వెల్లడించింది. నైజీరియా ప్రభుత్వ దళాలు మాత్రమే అక్కడకువెళ్లగలుగుతున్నారు. అయినా ప్రజల్లో భయాలు కొనసాగుతూనే ఉన్నాయి. నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు మాట్లాడుతూ తన హయాంలోనే బోకోహారాంతో ఉన్న వివాదానికి ముగింపు చెపుతామని చెప్పినతర్వాత నుంచే ఉగ్రసంస్థ దాడులు మరింతపెంచింది.

# కృష్ణా రిజర్వాయర్లకు జలకళ

## జూరాల, సుంకేసుల జలాశయాలకు వరద ప్రవాహం

## నిలకడగా సాగుతున్న గోదావరి

## మధ్యతరహా ప్రాజెక్టుల్లో అధికంగా నీటి నిల్వలు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలకు ప్రాణదాయినైన కృష్ణానదిలో జలప్రవాహం పెరిగింది. గోదావరి నది మందగమనంతో ప్రవహిస్తున్నది. సంగమేశ్వర దేవాలయం ముంపుకు గురైంది. కృష్ణాగోదావరి నదులపై ఉన్న జలాశయాల్లో 289.52టిఎంసిల నీరు అందుబాటులో ఉంది. గత ఏడాది కంటే 81.46టిఎంసిల అధికమైన నీరు జలాశయాల్లో ఉంది.పోయిన ఏడాది జూన్ 15న 207.06టిఎంసిల నీరు మాత్రమే జలాశయాల్లో ఉంది. తెలంగాణతో పాటు ఎగువన ఇతర రాష్ట్రాల్లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ, ముసురు వర్షాలకు జూరాల జలాశయానికి వరద వస్తోంది. కృష్ణానదికి రోజురోజుకూ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. జూరాల, సుంకేసుల జలాశయం నుంచి వస్తున్న వరదజలాల ప్రవాహంతో మండలంలోని మంచాలకట్ట, జటప్రోల్, మల్లేశ్వరం, కొల్లాపూర్ మండలంలోని సోమశిల, అమరగిరి తదితర గ్రామాల్లో కృష్ణానది నీటి మట్టం పెరిగింది. కృష్ణానదికి వరద పెరగడంతో నదిలో చేపలు పట్టడానికి మత్స్యకారులు ఎవరూ వెళ్ల రాదని కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ఉండే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాసులను అధికారులు హెచ్చరిస్తున్నారు. గోదావరి కృష్ణనదులపై ఉన్న జలాశయాల్లో గత ఏడాదితో పోల్చితే నీరు సంతృప్తికరంగానే ఉంది. వ్యవసాయ పనులు ప్రారంభించడానికి వీలుగా నీరు ఉంది. లాల్‌బహుదూర్ శాస్త్రి ఆలమట్టి ప్రాజెక్టులో గత ఏడాది 26.96 టిఎంసిల నీరు ఉంటే ఈ ఏడాది65.95టిఎంసిల నీరు ఆదివారం సాయంత్రం వరకు ప్రాజెక్టు జలాశయంలో ఉంది. నారాయణపూర్‌లో 31.47 టిఎంసిలు ప్రస్తుతం నీరు ఉండగా గత ఏడాది ఇదే రోజు 24.92 టిఎంసిలు ఉంది.ఉజ్జయినిలో 87.4టిఎంసిలు ప్రస్తుతం ఉండగా గత ఏడాది 36.98 టిఎంసిలు ఉంది. జూరాలలో గత ఏడాది కంటే 1.73 టిఎంసిలు తక్కువ నీరు ఉంది. గత ఏడాది 7.89టిఎంసిలు ఉంటే ఈ ఏడాది 6.16 టిఎంసిలు మాత్రమే ఉంది. ఐతే పై నుంచి నీటి వరద వస్తున్నది. తుంగభద్రలో 26.87టిఎంసిలు ఉంటే గత ఏడాది 6.02టిఎంసిలు నీరు ఉంది.శ్రీశైలంలో గత ఏడాదితో పోల్చితే 25టిఎంసిలు నీరు అధికంగా జలాశయంలో ఉంది.పోయిన ఏడాది 34.79 టిఎంసిలు ఉంటే ఈయేడాది 60.46టిఎంసిలు అందులో ఉంది. నాగార్జునసాగర్‌లో కూడా 14.48టిఎంసిలు అధికంగా నీరు ఉంది గత ఏడాది 122.69 టిఎంసిల నీరు ఎన్‌ఎస్‌పిలో ఉండగా ప్రస్తుతం అందులో 137.17టిఎంసిల నీరు అందులో ఉంది. పులిచింతలలో 24.63 టిఎంసిలు ఉండి గతజూన్ 15న ఇక్కడ 0.75టిఎంసిల నీరుమాత్రమే నిల్వ ఉండేది. కృష్ణా డెల్టాలో కూడా పోయిన ఏడాదితో పోల్చితే ఒక టిఎంసి అదనంగా అధికంగా ఉండి 3.07 టిఎంసిలు ప్రస్తుత నీటినిల్వ అని అధికారులు తెలిపారు.గోదావరిలో కూడా నీరు గత ఏడాదితో పోల్చితే ఎక్కువగానే ఉంది.గైక్వార్డ్ ప్రాజెక్టులో 48.9 టిఎంసిలునీరు ఉంది. గత ఏడాది ఇదే రోజు ఇక్కడ 30.4 టిఎంసిల నీరు ఉంది. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరామసాగర్‌లో గత ఏడాది కంటే 6టిఎంసిలు అధికంగా నీరు ఉంది. శ్రీరామసాగర్‌లో 13.83టిఎంసిలు ఉంది. సింగూరులో 19.31 టిఎంసిలు, నిజామ్‌సాగర్‌లో 6.06 మిడ్‌మానేరులో 6.92 టిఎంసిలు, లోయర్‌మానేరులో 6.47, కడెంలో, 065టిఎంసిలు,శ్రీపాద ఎల్లంపల్లిలో 8.7గోదావరి డెల్టా3.01 టిఎంసిలు నీరు ఉంది. తెలంగాణలోని గోదావరి బేసిన్‌లోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో గరిష్టనిల్వ 46658 ఎంసిఎఫ్‌టి కాగా ప్రస్తుతం 17989 ఎంసిఎఫ్‌టి నీరు ఉంది. కృష్ణాబెసిన్‌లోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో 7674 ఎంసిఎఫ్‌టి నీరు నిల్వఉంది. మొత్తంగా మధ్యతరహాప్రాజెక్టుల్లో గత యేడాది కంటే నీరు అధికంగానే ఉంది.తెలంగాణాలో మధ్యతరహా ప్రాజెక్టులు మొత్తం గరిష్టంగా 62126 ఎంసిఎఫ్‌టి నిల్వ సామర్థ్యం కలిగి ఉంటే ప్రస్తుతం అందులో 25660 టిఎంసిల నీరు నిలిచి ఉంది. గోదావరి బెసిన్‌లోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో 1059 క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో ఉండగా కృష్ణా బేసిన్‌లో 720 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉంది. మొత్తంగా రెండు బేసిన్‌లలో 1779 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఉంది.

# రైతు సంక్షేమానికి రూ.78 వేల కోట్లు ఖర్చు

## నేడు రైతులతో సిఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర లోనే రైతు సంక్షేమానికి 78 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ నెల 16న సాయంత్రం 4 గంటలకు తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగే రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొనున్న ముఖ్యమంత్రి రేవంతరెడ్డి రైతులతో ముఖాముఖీలో పాల్గొంటారన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం రైతు నేస్తం ఏర్పాట్లపై జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సీఎం చేతుల మీదుగా రాష్ట్రంలోని 1,034 రైతు వేదికల్లో కొత్తగా రైతునేస్తం కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,600 రైతువేదికలలో ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేయడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 566 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించి ప్రతీ మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు 6.35 లక్షల మంది రైతుల ప్రతీ మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవడమే కాకుండా, వివిధ రైతుల అనుభవాలను తెలుసుకొన్నారని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డైరక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

# 20న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల బంద్‌కు మావోయిస్టుల పిలుపు

### మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్

**జమ్మికుంట (హుజురాబాద్ ఆర్సీ), ప్రభాతవార్త:** దేశంలో భారతీయ జనాతా పార్టీ హిందూత్వ, ఫాసిస్టు కగార్ ఆపరేషన్ దాడులను ఖండిస్తూ ఈ నెల 20వ తేదిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలు బంద్ పాటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ ఆదివారం పత్రికలకు విడుదల చేసిన ఒక సుదీర్ఘ ప్రకటనలో పిలుపునిచ్చారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మావోయిస్టు పార్టీలో 45ఏళ్ల పాటు సుదీర్ఘ విప్లవోద్యమం అనుభవం కల్గిన రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రెడ్ టిఎల్ఎన్ఎస్ చలం అలియాస్ ఆనంద్, సుధాకర్, గౌతం 30ఏళ్లపాటు విప్లవోద్యమంలో అనుభవం కల్గిన నేత అతనితో పాటు మైలారపు ఆడేల్లు అలియాస్ భాస్కర్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు ఏడుగురిని పాలకప్రభుత్వాలు క్రూరంగా హత్య చేసిన దమనకాండను నిరసిస్తూ బంద్ పిలుపునిచ్చినట్లు జగన్ తన లేఖలో పేర్కొన్నారు.

కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ హిందూత్వ, ఫాసిస్టు ప్రభుత్వం 2026 మార్చి 31నాటికి మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామని ఇప్పటికి పలుమార్లు ప్రకటించడం జరిగింది. 2024 జనవరి నుండి అపరేషన్ కగార్ పేరుతో దేశంలోను మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలన్నింటిలోను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తూ, ఎదురుకాల్పుల పేరుతో నరసంహారం కావిస్తుందని, ఆదివాసీలకు చెందిన అటవి సంపదన, ఖనిజ సంపదన కార్పోరేట్ శక్తులకు అందించే ఏకైక లక్ష్యంతో అటవి ప్రాంతాల్లోని ఆదివాసీలపై దమనకాండ కొనసాగిస్తూ, వారికి అండగా ఉండే మావోయిస్టు పార్టీపై వరుసగా దాడులు చేస్తూ ఇప్పటికే 550మందికి పైగా మావోయిస్టులను హత్య చేసిందని జగన్ తన లేఖలో పేర్కొన్నారు. మే నెల 21న మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరి కామ్రెడ్ నంబాల కేశవరావు అలియాస్ బస్వారాజ్‌లతో పాటు 27మంది మావోయిస్టులను పొట్టన పెట్టుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జూన్ 3 నుండి నేషనల్ అటవి ప్రాంతాన్ని చుట్టుముట్టి దాడిచేసి ఏడుగురు కామ్రెడ్స్‌ను హత్యచేసిందని మావోయిస్టు నేత జగన్ తన లేఖలో తీవ్రంగా దుయ్యబట్టారు.




హైకోర్టు జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు సన్మానిస్తున్న ఫెడ్ అధ్యక్షుడు గంగారం తదితరులు

# కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### హైకోర్టు జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు

**హైదరాబాద్ (మలక్‌పేట), జూన్ 15, ప్రభాతవార్త:** కమ్యూనిటీ మీడియషన్ సెంటర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు పేర్కొన్నారు. ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ డిసేబుల్డ్ సంస్థ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర న్యాయ సేవాసంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన యూనివర్సల్ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను పరిష్కరించడానికి కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు కృషి చేస్తాయని తెలిపారు. కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్స్‌లో శిక్షణ పొందిన మీడియేటర్లను నియమించడం జరిగిందని పేర్కొన్నారు. హైకోర్టు తాత్కాలిక చీఫ్‌జస్టిస్ సుజయ్‌పాల్ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్స్‌ను రాష్ట్రంలో ప్రారంభించారని వివరించారు. కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్స్‌లో ఉచితంగా సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ కార్యదర్శి పంచాక్షరి మాట్లాడుతూ రాష్ట్రంలో 30 కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పద్ధతి ప్రకారం మధ్యవర్తిత్వం చేసి వివాదాలను పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్య క్రమంలో జిల్లా న్యాయ సేవా కార్యదర్శి కిరణ్మయి, న్యాయ సేవ పరిపాలన అధిక రాజు, శిక్షణ పొందిన మీడియేటర్ అబ్దుల్ లతీఫ్ అహ్మద్, ఫెడ్ అధ్యక్షులు గంగారం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం, ఆసిఫ్, రాకేష్, సురేష్, గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉపముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

## గాంధీభవన్‌లో కేక్ కట్‌చేసి రక్తదానం చేసిన కాంగ్రెస్ శ్రేణులు

## డిప్యూటీ సిఎంకు శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్, మంత్రులు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినాన్ని ఆదివారం గాంధీభన్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఘనం గా జరుపు కున్నారు. డిప్యూటీ సిఎం భట్టి విక్ర మార్కకు సిఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మంత్రులు కూడా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ట్విట్టర్ లో భట్టికి జన్మదిన శుభాకాంక్షలు



తెలియజేస్తూ సామాజిక న్యాయం కోసం పాటుపడే ఉపముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో నిరంతరం ప్రజాసేవలో యువ రాజకీయవేత్తలకు మార్గదర్శిగా ఉండాలని ఆకాంక్షించారు. స్వశక్తివంతుడైన దేవుడు మీకు నిరంతరం విజయం, సేవగుణంతో ముందుకు నడిచే శక్తి ఇవ్వాలని మహేష్ కోరుకున్నారు. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేసి ఉప ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'భట్టి విక్రమార్క గారి నాయకత్వం వర్ధిల్లాలి,కాంగ్రెస్ పార్టీ జిందాబాద్' అంటూ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా నినాదాలు చేశారు. ఈ కార్య క్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు వేణు గౌడ్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, సీనియర్ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. కార్పొరేషన్ చైర్మన్‌చల్లా నర్సింహారెడ్డి మాట్లా డుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి కాంగ్రెస్‌పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చారని కొనియాడారు. యావత్ తెలంగాణ ప్రజానీకం తరఫున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రజల కోసం నిరంతరం శ్రమించే నేత భట్టి విక్రమార్క అని ఆయన కొనియాడారు. ఆయన ప్రజాసేవకు అంకితభావం అందరికీ ఆదర్శమని అందుకే ఆయన జన్మదిన రోజు అన్నీ దానాల్లోకెల్లా రక్తదానం గొప్పది చేస్తున్నామని అన్నారు. భట్టి జన్మదినం ఎందరికో ఇది ప్రాణదానం కావాలని ఆశిస్తున్నామని తెలిపారు.. సీఎం రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రివర్గ సభ్యులు రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేస్తున్నారని అన్నారు.

# దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకే ఆపరేషన్ కగార్

## 23న చలో రాజ్‌భవన్ కార్యక్రమం

## ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** దేశంలోని సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకే ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి మండి పడింది. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేసిందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లాఖాద్రీ, రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. ఛత్తీస్‌గడ్‌లోని మావోయిస్టులు, అమాయక గిరిజనులపై క్రూర దాడులు జరిపి భయానక నరమేధాన్ని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుంది. ఈ నరమేధ చర్యలు వెంటనే ఆపాలని ఏఐవైఎఫ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఆదివారం హిమాయత్ నగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయం(సత్య నారాయణరెడ్డిభవన్)లో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ మావో యిస్టులతో కేంద్రం చర్చలు జరపాలన్నారు.

అటవీ సంపద, ఖనిజాలు, వనరులు, భూమిని.. అంబానీ, అదానీ వంటి బడా కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగమే ఆపరేషన్ కగార్ అని విమర్శించారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం జరిపిన మావోయిస్టుల హత్యలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతల సమస్యగా సృష్టించి కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లను చేస్తుందని మండిపడ్డారు. మావోయిస్టులను అంతం చేయడానికి డెడ్‌లైన్ విధించి, ఆ సంస్థలను అంతం చేస్తామంటూ కేంద్రం ప్రకటించడం వెనుక ఆర్ఎస్ఎస్ రహస్య అజెండాను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుందని మండిపడ్డారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమస్యగా పరిగణించి చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు.

మావోయిస్టులపై దాడుల పేరుతో ఆదివాసీలను చంపుతున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మావోయిస్టులతో చర్చలెందుకు జరపడం లేదని ప్రశ్నించారు. ఉగ్రవాదుల సమస్య పరిష్కారానికి పాకిస్తాన్‌తో సంప్రదింపులు జరుపుతున్న మోడీ ప్రభుత్వం.. రాజకీయ సమస్య పరిష్కారానికి మావోయిస్టులతో చర్చలెందుకు జరపడం లేదని ప్రశ్నించారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 23న అడవుల్లోని ఖనిజ సంపదను, వనరు లను కార్పొరేట్లకు దోచిపెట్టే ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ చలో రాజ్‌భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


# నీట్‌లో తెలుగోడి సత్తా!

## తెలుగు రాష్ట్రాల నుండి ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఒకేఒక్కడు

**హైదరాబాద్ జూన్ 15 ప్రభాతవార్త:** నీట్ (యూజీ) 2025 ఫలితాలు విడుదలైయ్యాయి. తెలుగు రాష్ట్రాల నుండి కాకర్ల జీవన్ సాయి కుమార్ అలిండియా ఓపెన్ కేటగిరీలో 18 వ ర్యాంకు సాధించి తెలుగోడి సత్తా చాటాడు. అలాగే సౌతిండియాలో ఫస్ట్ మార్క్ సాధించి సంచలనం సృష్టించాడు. ఇతర పోటీ పరీక్షలాగా కాకుండా నీటి ఎంతో కఠోర శ్రమ అవసరం.అలాగే సాధించాలన్న సంకల్పం,విషయ నైపుణ్యం అన్నింటినీ మించి ప్రతి విషయంపై స్పష్టత అవసరం.అప్పుడే అనుకున్న లక్ష్యానికి చేరువ అవుతారు.అలా అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి నారాయణ మార్గదర్శిగా నిలిచిందని జీవన్ సాయికుమార్ పేర్కొన్నాడు.

**విశ్లేషిస్తూ చదివితే విజయం..**

ఈ ఏడాది నీట్ పరీక్ష ఎంతో సంక్లిష్టంగా ఉంది. అందులో 720 మార్కులకు గాను 670 మార్కులు దాటారంటే మామూలు విషయం కాదు. మూడు సబ్జెక్టులనూ ఆపోశన పడితేకానీ అది సాధ్యం కాదు.ఎంతో కష్టపడి చదివి 670 మార్కుల మార్కుని అందుకున్న హైదరాబాద్ కుర్రాడు కాకర్ల జీవన్ సాయి కుమార్ నీట్‌లో ప్రతి ప్రశ్ననూ ఎదోర్కొ నేంత విషయపరిజ్ఞానం రావాలంటున్నాడు.అదే తనకు ఆలిండియా 18వ ర్యాంకు తెచ్చిపెట్టిందంటూ తను సన్నద్ధమైన తీరుని ఇలా చెప్పుకొచ్చాడు.మేము ఉండేది హైదరాబాద్‌మా స్వగ్రామం దేవరపల్లి మండలం, దుద్దుకూరు. నాన్న ప్రొఫెసర్ గంగాధర నాగకుమార్,మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్,అమ్మ నళినీదేవి గృహిణి. నా చదువంతా హైదరాబాద్‌లోనే సాగింది. 6వ తరగతి నుండి నారాయణ సిఓ స్కూల్లో సిబిఎస్ఈ ఎల్ టెన్త్‌లో90 శాతం,ప్లస్‌టూ మాదాపూర్ నారాయణ కాలేజీలో 98శాతం మార్కులొచ్చాయి. అక్కడే నీట్ శిక్షణ కూడా తీసుకున్నాను. చిన్నతనం నుంచే



వైద్యరంగమంటే ఇష్టం. దానికి నా తల్లిదండ్రులే ప్రేరణ. చిన్ననాటి నుండే ఈ రంగానికి రావాలనే ఆలోచనకు బీజం పడింది.ఆ వైపు అడుగులేసేందుకే బైపిసి తీసుకున్నాను. ఆ తర్వాత నీటికి సన్నద్ధమయ్యాను. ఆలిండియా ర్యాంకు కోసం అహర్నిశలు కష్టపడ్డాను. అందుకు తగ్గట్టే ఆలిండియా 18 వ ర్యాంకు సాధించాను. సాధారణంగా స్టడీస్ నేను సగటు విద్యార్థినే. కానీ వైద్యరంగంపై మక్కువతో చదివాను, ఆఖరికి సాధించాను.

**నారాయణ గైడెన్స్‌తో సాధించాను..**

నీట్ కు సన్నద్ధమవ్వాలంటే ఏ విషయమైనా పరీక్షలు,ప్రశ్నలు అనే కోణంలో కాకుండా దానిపై పూర్తి అవగాహన వచ్చేలా విశ్లేషిస్తూ చదవాలి.ప్రతి అంశాన్నీ విశ్లేషించి అవగాహనతో ముందుకు తీసుకుపోయే ప్రణాళిక ఉండాలి ప్రతి అంశంపై పూర్తి అవగాహనతో ముందుకు వెళితేనే ఆత్మవిశ్వాసం బలపడుతుంది.దీనికి నారాయణ పరీక్షా విధానం, మార్కుల విశ్లేషణ, సందేహాల నివృత్తి, మైక్రోషెడ్యూల్,ఎర్రర్ లిస్ట్, రివిజన్ ప్రోగ్రామ్ ఎంతగానో సహాయపడింది.

# కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి రాష్ట్రపతి, పిఎం జన్మదిన శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదివారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కిషన్‌రెడ్డి కింది స్థాయి నుంచి ఎదిగిన నాయకుడని కొనియాడారు. బొగ్గు, గనుల రంగాన్ని ఆయన బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. భారతదేశ స్వయం సమృద్ధికి ఇది ఎంతో ముఖ్యమని వివరించారు. కిషన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఎక్స్ వేదికగా ప్రధాని పోస్ట్ చేయగా, దీనిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రధానికి కేంద్రమంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మీ దార్శనిక నాయకత్వంలో పనిచేసే అవకాశం వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. వికసిత భారత్ నిర్మాణంలో మీ ప్రోత్సాహం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రధాని మంత్రి నరేంద్రమోడీతోపాటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫోన్ చేసిన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు కిషన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# గోదావరిలో ఐదుగురు మృతికి మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి

### కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నదిలో స్నానం చేస్తూ ఐదుగురు యువకుల మృతి చెందడం పట్ల బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కి చెందిన కుటుంబం బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చి ఆదివారం ఉదయం గోదావరిలో స్నానానికి వెళ్లగా ఐదుగురు యువకులు గల్లంతై మృతి చెందిన ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల వద్దకు, నదుల వద్దకు వెళ్ళినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని అందరికీ సూచించారు. ఈ ఏడాది జనవరిలో కొండపోచమ్మ సాగర్‌లో ఐదుగురు యువకులు, వారం రోజుల క్రితం మేడిగడ్డ ప్రాజెక్ట్‌లో పడి ఆరుగురు యువకులు మృతి చెందదారని.. ఇలాంటి ఘటనలు జరగకుండా తల్లిదండ్రులు వారి పిల్లలను నదులు, కాలువలు ప్రాజెక్టుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రాజెక్టులు, కాలువల వద్ద లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రేపటి మంచి భవిష్యత్ కలిగిన యువకులు ఇలా చనిపోవడం బాధాకరమని.. వారి కుటుంబానికి ధైర్యం ప్రసాదించాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. బాసర గోదావరి నదిలో మృతి చెందిన ఐదుగురు యువకులకు సంతాపాన్ని వ్యక్తం చేస్తూ.. వారి కుటుంబానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## బాసర ఘటనతో హైదరాబాద్‌లోని మూసారాంబాగ్, చింతల్‌లో విషాద ఛాయలు

**హైదరాబాద్(మలక్‌పేట, జూన్ 15, ప్రభాతవార్త :** ప్రభాతవార్తబాసర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించింది కానీ వెళ్లిన ఐదుగురు యువకులు నీటమునిగి మరణించడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. రాజస్థాన్ రాష్ట్రం నుంచి జీవనోపాధికై నగరానికి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన బంధువులు, నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్లిన వారి పిల్లలు ఐదుగురు గోదావరిలో నీట మునిగి చనిపోవడంతో శోకసంద్రంలో మునిగిపోయాయి. వివరాల్లోకి వెళ్తే రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కిరాణా వ్యాపారి ప్రవీణ్, వారి బంధువుల కుటుంబాలు కొన్నేళ్ల క్రితం జీవనోపాధికై నగరానికి వచ్చి వేర్వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. ప్రవీణ్, అతని బంధువు మోహన్ కుటుంబం మూసారాంబాగ్ డివిజన్ శాలివాహనగర్లో నివాసం ఉంటుండగా, రాకేష్ (20),మదన్ (18), భరత్ (16)ల కుటుంబాలు చింతల్ డివిజన్ చంద్రా నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రవీణ్ ప్రతాప్ నగర్ భాష్యం స్కూల్ చౌరస్తా వద్ద కిరాణా షాప్ నిర్వహిస్తుండగా, అతని తమ్ముడు రితిక్ (22) కూడా అందులోనే పనిచేస్తున్నాడు. కాగా అతని బంధువు వరుసకు తమ్ముడైన మోహన్ (19), చింతల్ డివిజన్ చంద్రానగర్ కాలనీకు చెందిన వారి బంధువులు రాకేష్(20), మదన్(18), భరత్ (16) లు కలిసి బాసర వద్ద గోదావరి నది లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్లారు. అయితే గోదావరి నదిలో వీరు దిగినచోట లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి గల్లంతయ్యారు. గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చేపట్టగా, వారి మృత దేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పిల్లల మరణ వార్తను మృతుల కుటుంబాలకు సమాచారం అందించడంతో శోకసంద్రంలో మునిగిపోయారు. గుండె లవిసేలా రోదిస్తూ వెంటనే బాసరకు బయలుదేరి వెళ్లారు. దాంతో శాలివాహనగర్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.




## లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానానికి బాంబు బెదిరింపు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** జర్మనీ దేశం నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చేందుకు టేకాఫ్ అయిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ ఎల్‌హెచ్752 విమానంలో బాంబు అమర్చినట్లు ఆదివారం రాత్రి దుండగులు బెదిరింపు కాల్ చేశారు. దీంతో విమాన సిబ్బంది అప్రమత్తమై అక్కడే తిరిగి ప్రయాణమై ఫ్రాంక్‌ఫోర్టు ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేసినట్లు విమానయాన సిబ్బంది తెలిపారు. అనంతరం భద్రతసిబ్బంది విమానాన్ని అణువణువు తనిఖీ చేశారు.

# విద్యుత్ తీగలు తెగిపడి ఇద్దరు వ్యక్తులు సజీవదహనం

### వీధిశునకం కూడా మృతి

**హైదరాబాద్ (మన్సూరాబాద్), జూన్ 15, ప్రభాతవార్త:** 11 కెవి విద్యుత్ తీగలు తెగిపడి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారిపై పడిపోవడంతో పాటు ఓ శునకంపై పడడంతో సజీవ దహనమైన సంఘటన ఎల్‌బినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఎల్‌బినగర్‌లోని సాగర్ రింగ్‌రోడ్డు చౌరస్తా వద్ద ఉన్న బాబాయి హోటల్ పక్కనే రేణుకా దేవాలయం ఉంది. దేవాలయం ఫుట్ పాత్‌పై ఇద్దరు గుర్తుతెలియని యాచకులు నిద్రిస్తున్నారు. వారితో పాటు ఓ వీధి శునకం కూడా ఉంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో అక్కడి నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లే 11 కెవి హైటెన్షన్ వైరు తెగి అక్కడ నిద్రిస్తున్న వారిపై పడిపోవడంతో పాటు శునకంపై పడింది. దీంతో ఆ వ్యక్తులతో పాటు శునకం సజీవ దహనం అయ్యింది. దీనిని గమనించిన స్థానికులు ఎల్‌బినగర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు అక్కడి పరి స్థితిని పరిశీలించి 11 కెవి విద్యుత్ తీగలు బాధితులపై పడ్డట్లు నిర్ధారించారు. మృతి చెందిన వారిలో ఒక ఆడ, ఒక మగ వ్యక్తి ఉన్నట్లు గుర్తించారు. అయితే వారి వివరాలు తెలియలేదు. మృతి చెందిన వారు ఉదయం పూట చెత్త ఏరుకుని జీవనం సాగిస్తున్నట్లుగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసును నమోదు చేశారు. పోలీసులతోపాటు చేరుకున్న విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ వైర్ల మరమ్మతు పనులు చేపట్టారు. కేసును ఎల్‌బినగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# నేటి నుంచే 'రైతు భరోసా'

## రైతును రాజును చేయడమే లక్ష్యం

## ఏరువాక ప్రారంభించిన మంత్రి పొంగులేటి

**కూసుమంచి, జూన్ 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలో యావత్తు రైతుగానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుభవార్త ప్రకటించారు. సోమవారం నుంచి రైతు భరోసా మూడవ విడత నిధులను రైతుల ఖాతాలో జమ చేస్తున్నట్లు మంత్రి స్పష్టమైన ప్రకటన చేశారు. వ్యవసాయ సాగు భూమి జీరో నుంచి ఎకరం వరకు సోమవారం, ఎకరం నుంచి రెండు ఎకరాలకు బుధవారం చొప్పున విడతల వారిగా రైతు భరోసా నిధులను జమ చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామి నిచ్చారు. కూసుమంచి మండలంలోని లోక్యతండా రోడ్డులో కందుల వెంకన్న వ్యవసాయ క్షేత్రంలో ఏరువాక కార్యక్రమంను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్న తరువాత అన్ని సంక్షేమ కార్యక్రమాలు తో పాటు రైతు ను రాజు చేయాలనే ఉద్దేశ్యం తో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయిన ఈనాడు ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం ఇస్తుంది రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధి తో పని చేస్తోందన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇబ్బంది లేకుండా సప్లై చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఆనాటి ప్రభుత్వ పెద్దలు వారి స్వార్థం కోసం ప్రాజెక్టులు మొదలు పెట్టి వదిలేస్తే వాటిని పూర్తి చేస్తూ సాగు నీటిని అందిస్తామని తెలిపారు. నేను అమితంగా ప్రేమించే పాలేరు నియోజకవర్గ రైతన్నలు ఏర్పాటు చేసుకున్న ఏరువాక సాగు కార్యక్రమంలో అరక పట్టి, దుక్కిదున్ని, రైతులతో కలిసి విత్తనాలు నాటడం సంతోషాన్నిచ్చిందన్నారు. వ్యవసాయానికి యోగ్యమైన ప్రతి ఎకరానికి పెట్టుబడి కోసం 12 వేలు ఇస్తున్నామని, రైతు భరోసా ఇప్పటికే రెండు సార్లు ఇచ్చామని తెలిపారు. నేటి నుంచి రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నామని ప్రకటించారు. కాళేశ్వరం కూలినా కూడా దేశంలో అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రంగా మనం మొదటి స్థానంలో ఉన్నామన్నారు. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తోంది. రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యం.. ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ రైతు ను రాజు చేయాలనేదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయిన ప్రభుత్వం రైతులను ప్రోత్సాహిస్తోందని తెలిపారు. ఆనాటి ప్రభుత్వం 10 సంవత్సరాల్లో రైతులకు రూ.17000 కోట్ల రూపాయలు రుణమాఫీ చేస్తే, మన ప్రభుత్వం 18 నెలల్లో నే రూ రూ.21000 కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని హామి ఇచ్చారు. నాణ్యమైన విత్తనాలు,ఎరువులు ఇబ్బంది లేకుండా పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. గత ప్రభుత్వం వారి స్వార్థం కోసం ప్రాజెక్టులు మొదలు పెట్టి అర్ధాంతరంగా వదిలేస్తే వాటిని పూర్తి చేస్తూ సాగు నీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సరిత, ఏఓ వాణి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 42శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు?

### మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 15:** స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటనపై బిఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పందించారు. ఎన్నికలు వస్తున్నాయని ప్రకటించడం బీసీలకు చేస్తున్న అన్యాయం,బీసీ బిల్లు కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. ప్రధాని నరేంద్రమోడీతో ఎందుకు మాట్లాడలేదు? రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రిజర్వేషన్లపై బీసీలను ప్రభుత్వం దగా చేస్తుందని అన్నారు. 42శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా స్థానిక ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు అని ప్రశ్నించారు.

## విద్యుత్ సంస్థల్లో త్వరలో 5,368 ఉద్యోగాల భర్తీ

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో ఖాళీగా ఉన్న 5,368 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు దీనికి సంబంధించి విద్యుత్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో 2,005 పోస్టులు, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో 2,170 పోస్టులు, ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్‌లో 703 పోస్టులు, జెనరేటింగ్ కంపెనీలో 490 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా బీటెక్, బీఈ, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులతో ఈ ఉద్యోగాల నియామకాలు చేపట్టనున్నారు.

# పటిష్టంగా కరకట్టలు

## గరిష్ట వరదను తట్టుకునేలా నిర్మాణం

## ప్రకాశం బ్యారేజి గేట్ల ఎత్తు పెంపు

## రూ. 8,740 కోట్లతో ప్రతిపాదనలు

## ఎపి మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,జూన్15,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా నదికి గరిష్ట వరదను తట్టుకునే దిశలో కరకట్టలను నిర్మించేందుకు కార్యా చరణ చేపట్టినట్లు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన ఒక సమాచార పత్రాన్ని విడుదల చేసారు. కృష్ణా నదికి చరిత్రలో ఎన్నడూ రానంత వరద గతేడాది ప్రకాశం బ్యారేజీ వద్ద పోటెత్తింది. ఈ అనుభవంతో అత్యధిక వరద వచ్చినా, తట్టుకునేలా నదీ వ్యవస్థను మెరుగు పర్చాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.



15లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని కూడా తట్టుకు నేలా ప్రకాశం బ్యారేజీని ఆధునీకరిస్తామని గతంలోనే ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రకటించారు. తదనుగుణంగా జలవన రుల శాఖ దీర్ఘకాలిక కార్యాచరణతో పాటు తాత్కాలిక పనులు చేపట్టింది. రూ.8470కోట్ల అంచనా వ్యయంతో పూర్తి స్థాయి ప్రతిపాదనలు రూపొందించి గత జనవరిలోనే నివేదించింది. ఇవి ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్నాయి. మరో వైపు ప్రస్తుత వరద కాలంలో అత్యధికవరద వచ్చినా తట్టుకునేందుకు చేయా ల్సిన ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్దం చేస్తున్నారు. బ్యారేజీ వద్ద తుప్పు పట్టిన హాయిస్ట్ ఫ్లాట్‌ఫాం మరమ్మత్తులతో పాటు ఇతర పనులకు ప్రభుత్వం తాజాగా రూ.2 కోట్లు మంజూరు చేసింది. నది పొడవునా కరకట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి,అక్కడ ప్రమాద నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. కిందటేడాది సెప్టెంబరు 2న ప్రకాశం బ్యారేజీకి గతంలో ఎన్నడూ రానంత వరద పోటెత్తింది. నదిలో ఎగువ నుంచి వచ్చిన ప్రవాహానికి బుడమేరు వరద తోడై బ్యారేజీ వద్ద సముద్రాన్ని తలపించింది. మొత్తంగా 11.40 లక్షల క్యూసె క్కుల ఔట్‌ఫ్లో నమోదైంది. 2009 అక్టోబరు 5న 11.10 లక్షల క్యూసెక్కుల వరదే...అప్పటి దాకా ఉన్న గరిష్ట రికార్డు.1954లో కొత్త బ్యారేజీ కట్టాక ఇంతటి ప్రవాహం రెండు సందర్భాల్లోనే వచ్చింది.

# స్కిల్ వర్సిటీకి చేయూత ఇవ్వండి

## కేంద్రమంత్రి జయంత్‌చౌదరిని కోరిని సిఎం రేవంత్

## రాష్ట్రంలో 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'

## ప్రారంభించాలని కేంద్రమంత్రి సూచన



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 15:** రాష్ట్రంలో వీఎఫ్ఎక్స్, గేమింగ్, ఆడియో విజువల్స్ రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన నివాసంలో కేంద్ర మంత్రి జయంత్ చౌదరి ఆదివారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చ జరిగింది. ఐటీఐ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. తాము ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేసి. దానిని ఐటీఐలను అనుసంధానిస్తామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి తెలియజేశారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై సిఎం రేవంత్‌రెడ్డిని కేంద్ర మంత్రి అభినందించారు. జాతీయ నైపుణ్య శిక్షణ కింద యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుదని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. ఐటీఐలన్నింటికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని కేంద్ర మంత్రి సీఎంను కోరారు. ఐటీఐల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం వెంటనే అధికారులను ఆదేశించారు. ఆధునిక పరిశ్రమ అవసరాలకు తగినట్లు కాలానుగుణంగా ఐటీఐల్లో సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని.. ఇందుకోసం ప్రత్యేక కమిటీ నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమా వేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సీఎంవో పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం సీఈవో జయేశ్ రంజన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు. సోమవారం కౌశల్ మదన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కేంద్ర మంత్రి జయంత్ చౌదరి హైదరాబాద్‌కు వచ్చారు.

# నిర్దేశించిన గడువులోగా భూసమస్యల పరిష్కారం

## 7,578 రెవెన్యూ సదస్సుల్లో 4.61 లక్షల దరఖాస్తులు స్వీకరణ

## ఐదు నక్షా గ్రామాల్లో శరవేగంగా భూసర్వే

## సమీక్షా సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై రైతులు చేసుకున్న దరఖాస్తులను నిర్ధేశించిన గడువులోగా పరిష్కరించాలని రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 3వ తేదీ నుంచి హైదరాబాద్ జిల్లా మినహా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని. ఇప్పటి వరకు 561 మండలాల్లో 7,578 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. ఈ సదస్సుల్లో 4.61 లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈసదస్సులు ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తామని,వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మానవతా దృక్పథంతో వీలైనంత త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై అధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రిగా మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్టు 15వ తేదీనాటికి అన్ని భూ సమస్యలను పరిష్కరించాలని ఈ ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. గత పదేళ్ల కాలంలో భూ సమస్యలకు సంబంధించి రైతులు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. ధరణి చట్టం వచ్చాక తమ ప్రమేయం లేకుండానే రైతులు భూ సమస్యల్లో చిక్కుకున్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన రెవెన్యూ యంత్రాంగం ధరణి కారణంగా ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారు. ప్రతిదానికి కోర్టు మెట్లు ఎక్కడమేతప్ప రైతుకు మరోదారి లేకుండా పోయిందన్నారు. దాదాపు గత రెండు నెలలుగా భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో దాదాపు 50 ప్రాంతాల్లో తాను స్వయంగా పాల్గొనడం జరిగిందని, ఆసదస్సుల్లో రైతులు తమ గోసను ఆవేదనతో చెప్పుకోవడం తనను ఎంతో బాధకు గురిచేసిందన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చాం. ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా రైతులకు మేలు చేసేలా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తరతరాలుగా సర్వే చేయని లేదా సర్వే రికార్డులు లేని ఐదు నక్షా గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన భూసర్వే శరవేగంగా సాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో నక్షా గ్రామాలను గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సర్వే చేపట్టనట్లు తెలిపారు. జరిగిందన్నారు. రాష్ట్రంలో 413 నక్షా గ్రామాలకు గాను ఐదు గ్రామాలలో ప్రయోగాత్మకంగా గత నెల మూడవ వారం నుంచి సర్వేను ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పైలెట్ గ్రామాలుగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్‌లో 422 ఎకరాలకు 337 ఎకరాల్లో సర్వే పూర్తయిందన్నారు. జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి ( కొత్తది) గ్రామంలో 626 ఎకరాలకు 269 ఎకరాలు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ లోని 845 ఎకరాలకు 445 ఎకరాలు ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురులో 502 ఎకరాలకు 232 ఎకరాలు సంగారెడ్డి జిల్లా వట్ పల్లి మండలం షాహిద్‌నగర్ లో 593 ఎకరాలకు 308 ఎకరాలలో సర్వే పూర్తయిందని తెలిపారు. మొత్తం ఐదు గ్రామాల్లో 2988 ఎకరాలకు గాను ఇప్పటివరకు 1591 ఎకరాల్లో సర్వే పూర్తిచేయడం జరిగిందన్నారు. మరో వారం పదిరోజుల్లో సర్వే ప్రక్రియను మొత్తం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో భౌతికంగా ఈ సర్వే జరుగుతోందన్నారు. ఈ నూతన విధానాల వల్ల భూమి సమాచారం, పారదర్శకత, వివాద పరిష్కారం, భూ యాజమాన్యంలో స్పష్టత వస్తుందని, ఫలితంగా రైతులు, గ్రామీణ భూ యజమానులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు.

# 'తెలంగాణ జాగృతి లీడర్' కార్యక్రమాన్ని ప్రారంభించిన కవిత




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 15:** తెలంగాణ యువత, మహిళలకు రాజకీయ శిక్షణ అందించేందుకు తెలంగాణ జాగృతి లీడర్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. యువతను రాజకీయాల్లోకి రప్పించి, సమాజంలో మార్పు తీసుకురావడానికి అవసరమైన నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమ లక్ష్యం. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత, మహిళలకు తెలంగాణ జాగృతి ఒక రాజకీయ శిక్షణ వేదికగా మారబోతుందని తెలిపారు. రాజకీయాల్లోకి యువత రావడం ద్వారా స్వచ్ఛమైన రాజకీయాలకు నాంది పడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. తెలంగాణ గడ్డ అంటే ప్రశ్నించే తత్వం అని కవిత పేర్కొన్నారు. ప్రశ్నించే తత్వం మనతో ఆగవద్దని, ముందు తరాలకూ ప్రశ్నించే తత్వాన్ని నేర్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో ప్రశ్నించే ఆలోచనలను ప్రోత్సహించడం ముఖ్యమని స్పష్టం చేశారు. దీని కోసం తెలంగాణ వ్యాప్తంగా ప్రతీ నెల మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. జులైలో హైదరాబాద్‌లో ప్రారంభించి, ఆగస్టు నుంచి జిల్లాల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంపై ఆసక్తి ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొనాలని కవిత కోరారు. ఇది ఒక నిరంతర కార్యక్రమంగా కొనసాగుతుందని ఆమె వెల్లడించారు. సర్పంచ్ నుంచి మొదలుకుని ఎమ్మెల్యే, ఎంపీ వంటి ప్రజాప్రతినిధుల విధులు, పరిధి, పరిమితులు అందరికీ తెలియాల్సిన అవసరం ఉందని కవిత ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజాసమస్యలను గుర్తించడం, వాటిని పరిష్కరించడం, అభివృద్ధికి నిధులు సాధించడం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజాసేవ చేయాలన్న సంకల్పం ఉంటే అన్ని దారులు ప్రజాసంక్షేమం వైపు వెళ్తాయని ఆమె అన్నారు. యువత, మహిళలు, తెలంగాణ వాదాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రతీ ఒక్క నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ వస్తున్నామని కవిత పేర్కొన్నారు. చేసే పోరాటాలకు కూడా ఫలితం వచ్చే రోజు వస్తుందని ఆమె చెప్పారు. మహిళా రిజర్వేషన్ల చట్టం వచ్చినందున రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో 33 శాతం మహిళా అభ్యర్థుల నాయకులు కావాల్సిన అవసరం ఉంటుందని గుర్తు చేశారు. డీలిమిటేషన్ తర్వాత తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 153కు పెరుగుతాయని, లోక్ సభ సీట్లు కూడా పెరుగుతాయని అన్నారు. కాబట్టి, మనం నాయకులను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకూ ఉద్యమిస్తామని వెల్లడించారు.

# రాష్ట్రంలో ఐదు రోజులు భారీ వర్షాలు

## 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 19 వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. దక్షి ణ బంగ్లాదేశ్‌ను ఆనుకొని ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంపైనున్న ఆవర్తనం ప్రస్తుతం పరిసర ప్రాంతాలు, సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని వెల్లడింది. ఇది ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి దిశగా వంగి ఉందని తెలిపింది. ఉత్తర కోస్తాంధ్ర, పశ్చిమ బంగాళాఖాతంపై సముద్రమట్టానికి 5.8 కిలోమీట్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, ఇది ఉత్తర బంగాళాఖాతంపై ఏర్పడిన మరొక ఆవర్తనంలో కలిసిపోయిందని వివరించింది. అలాగే తూర్పు మధ్యప్రదేశ్ నుంచి బంగ్లాదేశ్ వరకు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, గంగానది మీదుగా ఓ ద్రోణి సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. మరాఠ్వాడ, పరిసర ప్రాంతాల మీదుగానున్న ఉపరితల ఆవర్తనం నుంచి తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో మరో ద్రోణి ఉందని తెలిపింది.

ఈ క్రమంలో ఈ నెల 16న రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నాయని చెప్పింది. 17న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 18న ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, హన్మకొండ జిల్లాల్లో వర్షాలు కొనసాగుతాయని వివరించింది. ఇక 19న ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్‌తో పాటు నల్గొండ, సిద్దిపేట, భువనగిరిలో వర్షాలు కొనసాగుతాయని వివరించింది. కాగా గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురిశాయి. అత్యధికంగా ములుగు జిల్లా వెంకటాపూర్ 7 సెంటీమీటర్లు, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో 6.8 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

# ఎపి ప్రభుత్వ బడుల్లో 'విలువల విద్య' పుస్తక పంపిణి

**విజయవాడ, జూన్15,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 6-10 తరగతుల విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి 'విలువలతో విద్య(మోరల్ ఎడ్యుకేషన్)' పుస్తకా లను అందించనున్నారు. విద్యారంగ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణామండలి (ఎస్‌సిఇఆర్టీ) ఈ పాఠ్య పుస్తకాలను రూపొందించింది. ఆరో తరగతికి 'తోరణాలు', ఏడోతరగతికి 'మనోవికాసం' ఎనిమిది, తొమ్మిది తరగతులకు 'సూక్తి సుధ',పదో తరగతికి 'అమృతధార' పేరుతో ఈ పుస్తకాలను తీసుకొచ్చారు. ఇవి దాదాపు 39 పేజీల వరకు ఉన్నాయి. పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ పెట్టారు. ఆయా పాఠ్యాంశాల వీడియోలు కావాలనుకునేవారు వాటిని స్కాన్ చేయొచ్చు. సుప్రసిద్ధ కాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడు,ప్రసిద్ధ చిత్రకారులు బాపు గురించి క్లుప్తంగా ఇచ్చారు. పదోతరగతిలో విద్య విలువ, సజ్జన సహవాసం,కీర్తి శరీరం,సహజ గుణాలు, నింద చెందకు, మాటతూలకు అనే పాఠ్యాంశాలు న్నాయి. తొమ్మిదిలో కోపం-శాంతం, వాగూ ్భషణం, పథం, తస్మాత్ జాగ్రత్త పాఠాలున్నాయి. ఎనిమిదో తరగతి పుస్తకంలో ఓర్పుతో విజయం,అందమైన అలవాటు,సాయానికి సిద్ధం, శిక్షణ, దుర్గు ణాలు, గౌరవం పాఠాలు తీసుకొచ్చారు.

# బిఆర్‌ఎస్ నాయకుల మెడకు చుట్టుకుంటున్న ఫోన్ ట్యాపింగ్ కేసు

## మాజీ డిజిపిలు, పూర్వనిఘా విభాగం బాస్‌లు సిట్

## విచారణలో ఏం చెబుతారోనని ఉత్కంఠ

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ పోలీసు అధికారుల నుంచి బిఆర్‌ఎస్ నేతల మెడకు ఉచ్చులా బిగుసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించి ఏడాదికి పైగా సాగిన విచారణ ఒక ఎత్తుకాగా ఎస్ఐబి మాజీ బాస్ భారత్‌కు వచ్చిన తరువాత వారం రో జులుగా సాగుతున్న దర్యాప్తు మరో ఎత్తులా వుంది. ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన ముగ్గురు పోలీసు అధికారులు, మరో మాజీ అధికారి వెల్లడించిన వివ రాలు ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావును దోషిగా చూపడం తెలిసిందే. దీనిపై ప్రభాకర్ రావును విచారించగా నాటి డిజిపిలు, నిఘా విభాగం బాస్‌ల పేర్లు వెలుగు చూశాయి. అప్పట్లో తనపై అధికారులుగా వున్న ఇద్దరు డిజిపిలు, ఇద్దరు నిఘా విభాగం బాస్‌ల ఆదేశాల మేరకే తాను ఫోన్ ట్యాపింగ్ యూనిట్‌ను న డిపానని ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని ప్రభాకర్ రావు కుండబద్దలు కొట్టడంతో ఈ కేసుకు సంబంధించి అప్పట్లో డిజిపిలుగా పనిచేసిన మహేందర్ రెడ్డి , అంజనీ కుమార్, నిఘా విభాగం బాస్‌లుగా పనిచేసిన నవీన్ చంద్, అనిల్ కుమార్‌లను విచారించేందుకు సిట్ అధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు జరి గిన విచారణలో పోలీసు అధికారుల పేర్లు మాత్రమే వెలుగులోకి కాగా మహేందర్ రెడ్డి, అంజనీ కుమార్, నవీన్ చంద్, అనిల్ కుమార్‌లను విచారిస్తే కచ్చితంగా అప్పట్లో అధికారంలో వున్న బిఆర్‌ఎస్ నేతల పేర్లు బయటకు వచ్చే వీలుందని సిట్ అధికారులు భావిస్తున్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో వున్న సమయంలో ఫో న్ ట్యాపింగ్ చేయించే ధైర్యం ఇద్దరు ముగ్గురు కీలక నేతలకు మాత్రమే వుందని సిట్ అధికారులు భావిస్తున్నారు.

రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపి, పోలీసు శాఖను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ తుది దశకు చేరింది. 15 నెలలుగా సాగుతున్న ఈ కేసు విచా రణ అమెరికాలో తలదాచుకున్న ప్రభాకర్ రావు భారత్‌కు వచ్చాక ఒక్కసారిగా వేగం పుంజుకుంది. ఈ కేసులో ప్రభాకర్ రావును వారం రోజుల వ్యవధిలో మూ డుసార్లు 26 గంటల పాటు విచారించి ఫోన్ ట్యాపింగ్‌లో కీలక విషయాలను వెలులోకి తెచ్చారు. మొదట కేసుకు సంబంధించి తనకు ఏమీ తెలియదని మౌనం వహించిన ప్రభాకర్ రావు ఆ తరువాత ఇదే కేసులో అరెస్టయిన నలుగురు నిందితుల వాంగ్మూలాన్ని ముందు వుంచి విచారించం, ఎఫ్ఎస్ఎల్ నివేదిక ఆధారం గా విచారణ సాగించాక తన నేరాన్ని చాలా వరకు అంగీకరించారని తెలిసింది. గ్రూప్ వన్ అధికారిగా డిఎస్‌పిగా పోలీసు శాఖలో 1991లో చేరిన ప్రభాకర్ రా వు మొదటి నుంచి వామపక్ష తీవ్రవాద కార్యకలాపాల నిరోధక విభాగంలో కీలకంగా వ్యవహరించేవారు. ఈ క్రమంలోనే ఆయన ఎస్ఐబిలోనే డిఐజిగా వుండి ఐ జిగా పదోన్నతి పొంది అక్కడే పదవీ విరమణ చేసి ఓఎస్‌డిగా కూడా కొంతకాలం పనిచేసి, చివరకు నిఘా విభాగం బాస్‌గానూ వ్యవహరించారు. ఇదంతా బిఆ ర్ఎస్ హయాంలో జరిగింది. అయితే ప్రభాకర్ రావు వ్యవహారశైలిని నాటి పిసిసి అధ్యక్షుడు ప్రస్తుత ముఖ్యమంత్రి, నాటి ఎంపి ప్రస్తుత కేంద్ర మంత్రి బండి సంజయ్, బిజెపి ఎంపి అర్వింద్ సహా అనేన మంది మొదటి నుంచి తీవ్రంగా తప్పుపడుతున్నారు. రేవంత్ రెడ్డి అయితే ప్రభాకర్ రావు ఆధ్వర్యంలోనే తన ఫో న్లతో పాటు ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ జరుగుతుందని అప్పట్లోనే ఆరోపణలు చేశారు. ఇదంతా నాటి సిఎం కెసిఆర్‌తో పాటు కెటిఆర్, హరీష్ రావు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే దీనిపై విచారణ చేయిస్తానని అప్పట్లో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

ఆయన చెప్పినట్లుగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ మొదలయి 15 నెలలుగా కొనసాగుతోంది. ఈ కేసులో నలుగురు అరెస్టవగా మొ దటి ముద్దాయిగా వున్న ప్రభాకర్ రావు, ఏడవ ముద్దాయిగా వున్న మీడియా అధినేత శ్రవణ్ రావులు అరెస్టు నుంచి సుప్రీం కోర్టు ద్వారా మధ్యంతర ఉత్తర్వు లు పొంది విచారణకు హాజరవుతున్నారు. ఇందులో శ్రవణ్ రావు మొదటి దఫా విచారణ పూర్తవగా ఆయన విచారణకు సహకరించలేదని పోలీసులు కోర్టుకు తె లిపారు. ప్రభాకర్ రావు విచారణ సాగుతోంది. ఆయన కూడా పూర్తిగా సహకరించడం లేదని, పొడిపొడిగా సమాధానం ఇస్తూ తెలియదు..,గుర్తు లేదు...మరచి పోయా...అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. అయినప్పటికీ ప్రభాకర్ రావు నుంచి ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు కీలక సమా చారం సేకరించారు. ఈ సమాచారం ఫోన్ ట్యాపింగ్ విచారణ మరింత ముందుకు వేగంగా సాగేందుకు ఉపకరించనుంది.

ప్రభాకర్ రావు వెల్లడించిన సమాచా రం ఆధారంగా నాటి డిజిపిలు మహేందర్ రెడ్డి, అంజనీ కుమార్, నిఘా విభాగం బాస్‌లు నవీన్ చంద్, అనిల్ కుమార్‌లను విచారించేందుకు సిట్ నిర్ణయించిం ది. వీరి విచారణ వారం రోజుల్లో మొదలు కానుంది. అంతకు ముందు ఈ కేసులో మొదటగా అరెస్టయిన ఎస్ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్ రావును మరోసారి వి చారించి మరింత సమాచారం సేకరించిన సిట్ అధికారులు దీని ఆధారంగా ప్రభాకర్ రావును మూడవసారి విచారించారు. ఆయనను ఈ నెల 17వ తేదీన మరో సారి విచారించిన తరువాత మాజీ డిజిపిలు, పూర్వ నిఘా విభాగం బాస్‌లను విచారించే వీలుంది.

### మాజీ డిజిపిలు, పూర్వ నిఘా విభాగం బాస్‌లు ఏం చెబుతారనే దానిపై ఉత్కంఠ

ఇదిలావుండగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు సాగిన విచారణ ఒక ఎత్తుకాగా దీనిపై మాజీ డిజిపిలు, పూర్వ నిఘా విభాగం బాస్‌ల విచారణ మరో ఎత్తుగా చెప్పాలి. ప్రభాకర్ రావు తన వాంగ్మూలంలో వీరి పేర్లు వెల్లడించారు. తన పై అధికారులుగా వున్న వీరి ఆదేశాల మేరకే తాను ఫోన్ ట్యాపింగ్ చేశాన ని చెప్పగా ఇప్పుడు దీనిపై మాజీ డిజిపిలు, పూర్వ నిఘా విభాగం బాస్‌లు సిట్ విచారణలో ఏ సమాచారం వెల్లడిస్తారో...? చూడాల్సి వుంది. వీరికి బాస్‌లు గా పై అధికారులెవరు లేనందున కచ్చితంగా బిఆర్‌ఎస్ హయాంలో కీలకంగా వున్న నేతల పేర్లు వెల్లడించే వీలుందని తెలిసింది. అప్పుడు ఈ నేతలకు ఉచ్చు బిగుసుకునే వీలుంది.

# ‘8 వసంతాలు’ ప్యూర్ లవ్ స్టోరీ

## హీరోయిన్ అనంతిక సనీల్‌కుమార్



**పాన్ ఇండియా** నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ‘8 వసంతాలు’ ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన కాన్సెప్ట్ సెంట్రిక్ మూవీ. అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్ పోషించారు. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన 8 వసంతాలు సోల్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం జూన్ 20న వరల్డ్ వైడ్ విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనంతిక సనీల్‌కుమార్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ సినిమా ప్రమోషన్స్ మెటీరియల్ చూస్తుంటే ఈ కథంతా మీ చుట్టూనే ఉంటుందనిపిస్తుంది?**

ఇది విమెన్‌కి సంబంధించిన కథ. కథలో అమ్మాయి పాత్ర కీలకం అయినప్పటికీ మిగతా పాత్రలన్నిటికీ సమానంగా ప్రాముఖ్యత వుంది. ప్రతి క్యారెక్టర్ ఇంపార్టెంట్. ప్రతి క్యారెక్టర్ కి లేయర్స్ ఉంటాయి.

**మ్యాడ్ తర్వాత ఈ సినిమాని ఎంచుకోవడానికి కారణం?**

మంచి కథ కోసం వెయిట్ చేశాను. ఈ కథలో నేను కోరుకున్న ప్రతిదీ ఉంది. నాకు యాక్షన్, బ్యూటిఫుల్ లవ్ స్టోరీ చేయాలని ఉండేది. అవన్నీ కూడా ఈ కథలోనే కుదిరాయి. ఫర్ఫార్మెన్స్ చేయడానికి చాలా మంచి స్కోప్ ఉండే క్యారెక్టర్. కథ చదివినప్పుడు చాలా కనెక్ట్ అయ్యాను. నేను శుద్ధి యోగ్య పాత్రలో కనిపిస్తాను. తను ఒక రచయిత అలాగే తనకి మార్షల్ ఆర్ట్స్ నేపథ్యం కూడా ఉంటుంది.

**ఈ ప్రేమ కథలో ప్రత్యేకత ఏమిటి ?**

చాలా ప్యూర్ లవ్ స్టోరీ ఇది. రియల్ ఒక జీవితాన్ని చూస్తున్న అనుభూతి కలుగుతుంది. అన్ని ఏజ్ గ్రూప్స్ కి రిలేట్ అవుతుంది.

**ఈ సినిమా కోసం ఎలా ప్రిపేర్ అయ్యారు?**

నాకు బ్లాక్ బెల్ట్ వచ్చు. ఈ సినిమా కోసం కళరి ఫైట్ నేర్చుకున్నాను. అలాగే వింగ్ చున్ అనే చైనీస్ ఆర్ట్ ఫామ్‌ని కూడా నేర్చుకున్నాను. దాని కోసం మూడు నెలలు అంజి మాస్టర్ దగ్గర ట్రైనింగ్ తీసుకున్నాను.

**మిగతా నటీనటుల గురించి?**

హను రెడ్డి వెరీ గుడ్ యాక్టర్. చాలా ఫాస్ట్‌గా నేర్చుకుంటారు. రవి కూడా చాలామంచి యాక్టర్. ఎంత పెద్ద డైలాగ్ అయినా సులువుగా చెప్పగలరు.

**డైరెక్టర్ ఫణీంద్ర గురించి**

ఫణీంద్ర గారు నాకు గురువు లాంటి వారు. ఈ జర్నీలో ఎన్నో విషయాలు ఆయన నుంచి నేర్చుకున్నాను. ఆయన క్లియర్ విజన్‌తో ఉంటారు. చాలా పాషనేట్ ఫిలిం మేకర్. ఆయనతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్.

**శుద్ధి అయోగ్య అనేది చాలా ఎమోషనల్ క్యారెక్టర్ కదా.. షూట్ తర్వాత ఎలా అనిపించింది?**

ఇంటికి వచ్చిన తర్వాత అద్దం చూసుకుంటే చాలా మిస్సింగ్ ఫీలింగ్ అనిపిస్తుంది. ఆ క్యారెక్టర్, బిహేవియర్ అవన్నీ నాకు గుర్తుచ్చేవి. వెరీ మెమరబుల్ క్యారెక్టర్.

**మైత్రి మూవీ మేకర్స్ గురించి ?**

మైత్రి మూవీ మేకర్స్‌తో వర్క్ చేయడం అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్. నన్ను బిలీవ్ చేసి ఈ ప్రాజెక్టులో తీసుకున్నందుకు నిర్మాతలకు థాంక్స్ చెప్తున్నాను. ఈ జర్నీలో చాలా సపోర్ట్ చేశారు. ఇలాంటి సినిమాని తీయ డానికి చాలా గట్స్ కావాలి.

**మ్యూజిక్ గురించి?**

హేషమ్ రెండు బ్యూటీ ఫుల్ సాంగ్స్ ఇచ్చారు. రెండు పాటలు ఆడియన్స్‌కి చాలా నచ్చాయి. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా అద్భుతంగా ఉంటుంది.

**మీరు యాక్టర్ కాకపో యినా ఇంకేం అయ్యేవారు?**

పొలిటీషియన్ అవ్వాలని ఉంది నా కోరిక. అందుకే లా చదువుతున్నాను. అయితే అది ఇప్పుడు కాదు నాకు ఒక 40 ఏళ్లు వచ్చిన తర్వాత(నవ్వుతూ)

**మీకు డ్రీమ్ రోల్స్ ఉన్నాయా?**

పవర్ఫుల్ అండ్ స్ట్రాంగ్ రోల్స్ చేయడానికి ఇష్టపడతాను

# ‘హిట్ 3’ బ్యూటీకి క్రేజీ ఛాన్స్

**దక్షిణాదిలో** మోస్ట్ పాపులర్ హీరోయిన్లలో ఆమె ఒకరు. మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు వరుస హిట్స్ ఖాతాలో వేసుకుంటుంది. అంతేకాకుండా ఇప్పుడిప్పుడే తెలుగు, తమిళం, కన్నడ భాషలలో అవకాశాలు సొంతం చేసుకుంటుంది. తనే హీరోయిన్ శ్రీనిధి శెట్టి. కేజీఎఫ్ సినిమాతో కన్నడ సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు.. తొలి చిత్రమే పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ అయ్యింది. ఆ తర్వాత కోబ్రా సినిమాతో మరోసారి అడియన్స్ ముందుకు వచ్చింది. ఇక ఇటీవలే హిట్ 3 సినిమాతో మరో విజయాన్ని అందుకుంది. న్యాచురల్ స్టార్ నాని నటించిన ఈ సినిమాతో తెలుగు సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ.. మరోసారి అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. దీంతో ఇప్పుడు తెలుగులో ఈ బ్యూటీకి మరిన్ని ఆఫర్స్ రానున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ అమ్మడుకు మరో క్రేజీ ఛాన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. లేటెస్ట్ టాక్ ప్రకారం ఇప్పుడు కోలీవుడ్ స్టార్ హీరో సినిమాలో ఈ అమ్మడు నటించనున్నట్లు సమాచారం.

తాజాగా కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టికి తమిళంలో భారీ ఛాన్స్ వచ్చింది. అదేంటంటే.. తమిళ్ స్టార్ హీరో అజిత్ త్వరలో నటించనున్న తన 64వ సినిమాలో శ్రీనిధిని ఎంపిక చేశారని టాక్. ప్రస్తుతం ఈ న్యూస్ సోషల్ మీడియాలో తెగ వైరలవుతుంది. ఇటీవలే గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాతో హిట్ అందుకున్న అజిత్.. ఇప్పుడు తన నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసం రెడీ అవుతున్నారు. విడాముయార్చి, గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాల తర్వాత ఇప్పుడు అజిత్ చేయబోయే సినిమాపై మరింత హైప్ నెలకొంది. అజిత్ 64వ చిత్రానికి కూడా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తారని నివేదికలు తెలుపుతున్నాయి.

ప్రస్తుతం ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వచ్చే నవంబర్ నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమా విడుదల చేయనున్నారు. ఇక ఇప్పుడు ఈ సినిమాలో కేజీఎఫ్ బ్యూటీ శ్రీనిధి శెట్టి నటించనున్నట్లు టాక్. ఈ సినిమాను పాన్ ఇండియా లెవల్లో రూపొందించనున్నారు



**ప్రముఖ నిర్మాణ సంస్థ** శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ ‘తమ్ముడు’. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న ‘తమ్ముడు’ సినిమా వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ‘భూ అంటే భూతం..’ రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు. ఈ నెల 17న సాయంత్రం 5గంటలకు ఈ పాటను విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తన మేనకోడలిని ఆడిస్తూ కథానాయకుడు పాడే సందర్భంలో ‘భూ అంటే భూతం..’ పాటను చిత్రీకరించారు. ఈ పాటను అజనీష్ లోకనాథ్ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి ఆకట్టుకునేలా పాడారు.

నటీనటులు నితిన్, లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, బేబీ శ్రీరామ్ దిత్య, తదితరులు

టెక్నికల్ టీమ్ సినిమాటోగ్రఫీ కేవీ గుహన్, ఎడిటింగ్ ప్రవీణ్ పూడి మ్యూజిక్ అజనీష్ లోకనాథ్, పీఆర్వో వంశీ కాకా, జీఎస్ కే మీడియా, బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, నిర్మాత దిల్ రాజు, శిరీష్, రచన దర్శకత్వం శ్రీరామ్ వేణు

# ‘తమ్ముడు’ నుంచి ఫస్ట్ లిరికల్ సాంగ్ 17న రిలీజ్..




# ‘మేఘాలు చెప్పిన ప్రేమ కథ’ నుంచి సాంగ్ రిలీజ్



**యంగ్ హీరో** నరేష్ అగస్త్య, దర్శకుడు విపిన్ దర్శకత్వంలో, సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై ఉమా దేవి కోట నిర్మించిన మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా ‘మేఘాలు చెప్పిన ప్రేమ కథ’లో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు టీజర్లు సినిమాపై అంచనాలను పెంచాయి. చిత్రంలో రబియా ఖతూన్ కథానాయిక. ఫస్ట్ సింగిల్ ‘సౌండ్ ఆఫ్ లవ్’ విడుద లతో మేకర్స్ మ్యూజిక్ జర్నీ ప్రారంభిం చారు. జస్టిన్ ప్రభాకరన్ ‘సౌండ్ ఆఫ్ లవ్’ని మనసుని కదిలించే సాంగ్‌గా కంపోజ్ చేశారు. అన్నీ సహజమైన శబ్దాలతో ఈ సాంగ్ ని కంపోజ్ చేయడం విశేషం. గొప్ప ఆర్కెస్ట్రేషన్‌తో ఈ పాట క్లాసిక్ రొమాంటిక్ మ్యూజిక్ ఎసెన్స్ ని అందించింది, ‘సౌండ్ ఆఫ్ లవ్’కు రెహ్మాన్ పొయిటిక్ సాహిత్యం ఆకట్టుకుంది. ఎస్పీబీ చరణ్, షాషా తిరుపతి వాయిస్‌లు మ్యూజికల్‌గా వున్నాయి. విజువల్‌గా పాట అద్భు తంగా వుంది. నరేష్ అగస్త్య, రబియా ఖటూన్ కెమిస్ట్రీ హార్ట్ ఫుల్‌గా వుంది. ‘మేఘాలు చెప్పిన ప్రేమ కథ’ మేకర్స్ ఈ చిత్రాన్ని త్వరలో థియేటర్లలో విడు దల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

**కొన్ని సినిమాలు** చిన్నగా స్టార్ట్ అయ్యి, పబ్లిసిటీ పరంగా క్యూరియాసిటి పెంచుతూ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తాయి. అటు మాస్ ఇటు క్లాస్ ప్రేక్షకులను ఆకట్టుకుని సక్సెస్ దిశగా పయనిస్తాయి. ఆ కోవలోని చిత్రమే ‘లోపలికి రా చెప్తా’. మాస్ బంక్ మూవీస్ పతాకంపై కొండా వెంకట రాజేంద్ర, మనిషా జష్నాని, సుస్మిత అనాలా, సాంచిరాయ్ హీరో హీరోయిన్లుగా లక్ష్మీ గణేష్, వెంకట రాజేంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్న హర్రర్ బేస్డ్ కామెడీ ఎంటర్ టైనర్ చిత్రం‘లోపలికి రా చెప్తా’. కొండా వెంకట రాజేంద్ర హీరోగా నటించడమే కాకుండా ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు విడుదలైన పాటలు, పోస్టర్స్ అన్నింటినీ ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారని తెలుపుతూ.. చిత్ర విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ‘లోపలికి రా చెప్తా’ చిత్రం జూలై 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వెంకట రాజేంద్ర మాట్లాడుతూ.. మా చిత్రంలో హీరో క్యారెక్టర్ డెలివరీ బాయ్. అందుకే చిత్రంలోని మొదటి సాంగ్‌ను ఓ డెలివరీ బాయ్‌తో విడుదల చేయించాం. ఆ పాటకు చాలా మంచి స్పందన వచ్చింది. త్వరలోనే ట్రైలర్ రిలీజ్ చేయబోతున్నాం. సెన్సార్ కార్యక్రమాలను పూర్తయ్యాయి. జూలై 5న గ్రాండ్‌గా థియేటర్లలోకి సినిమాను తీసుకు రానున్నాం. ప్రతిష్టాత్మకమైన సరిగమ ఆడియో కంపెనీ ఈ చిత్ర ఆడియో హక్కులు దక్కించుకుంది. అవుట్ ఫుట్ చూసి టీమంతా ఎంతో హ్యాపీగా ఉన్నాం. కచ్చితంగా ప్రేక్షకులను మెప్పించే సినిమాగా ‘లోపలికి రా చెప్తా’ నిలుస్తుంది. సహకరించిన అందరికీ ధన్యవాదాలు. త్వరలోనే గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కలుసుకుందాం అని అన్నారు. కొండా వెంకట రాజేంద్ర, మనీషా జష్నాని, సుస్మిత ఆనాల, సాంచిరాయ్, అజయ్ కార్తీక్, ప్రవీణ్ కటారి, రమేష్ కైగూరి, వాణి ఐడా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్: దేవ్ జాండ్.

# జూలై 5న రానున్న ‘లోపలికి రా చెప్తా’



**టాలెంటెడ్ హీరో** వైభవ్ ప్రధాన పాత్రలో నటించిన మిస్టరీ థ్రిల్లర్ ‘హంటర్ చాప్టర్ 1’ థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది. నందిత శ్వేతా, తాన్య హోప్ హీరోయిన్స్‌గా నటించిన ఈ సినిమాకు షెరీఫ్ గౌస్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని ఎ. రాజశేఖర్ సాయి కిరణ్ బత్తుల నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌లు ప్రేక్షకుల్లో మంచి ఉత్సాహాన్ని నెలకొల్పి, సినిమాపై బజ్‌ను పెంచాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని అర్రోల్ కొరెల్లి అందించగా, సినిమాటోగ్రఫీని బాలాజీ కె రాజా చేపట్టారు. సస్పెన్స్, థ్రిల్, హై టెక్నికల్ వాల్యూస్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు వినూత్న అనుభూతిని అందిస్తోంది. హంటర్ చాప్టర్ 1 దేశవ్యాప్తంగా థియేటర్లలో ప్రదర్శించబడుతోంది.



# వినూత్న అనుభూతి అందిస్తున్న ‘హంటర్ చాప్టర్ 1’





# రాజబాబు స్మృతికి పురస్కారాలతో నివాళి

**బొడ్డు రాజబాబు** రంగస్థలం, టీవీ, సినిమా రంగంలో సుప్రసిద్ధ కళాకారుడు. ఆయనతో ఒకసారి పరిచయం ఏర్పడితే అది జీవితాంతం మర్చిపోలేం, ఆయన స్మృతికి నివాళిగా మిత్ర బృందం పురస్కారాల కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ చెప్పారు . బొడ్డు రాజబాబు 68వ జయంతి , స్మారక పురస్కారాల కార్యక్రమం ఫిలిం నగర్ కల్చరల్ సెంటర్లో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిధిగా వచ్చిన గోపాల కృష్ణ మాట్లాడుతూ ... రాజబాబు పేరుతో వివిధ రంగాల్లో నిష్టాతులైన వారిని సత్కరించి పురస్కారాలు అందజేయడం ఎంతో సముచితంగా ఉందని, రాజబాబు మాఅందరికీ ఎంతో స్నేహపాత్రుడని అన్నారు. ఈ కార్యక్రంలో పురస్కారాలు అందుకున్న డి.ఎస్.ఎన్.మూర్తి మా గురువుగారు, భగీరథ ఆత్మీయ మిత్రుడు. ఉగాది రోజు ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు భగీరథకి కళా రత్న అవార్డు బహుకరించారు. మేమిద్దరం ఎన్‌టిఆర్ సెంటినరీ కమిటీలో సభ్యులం అని చెప్పారు .భగీరథ శ్రీకృష్ణదేవరాయల ప్రేమ కథను ‘నాగలాదేవి’ పేరుతో ఒక అద్భుతమైన పుస్తకం వ్రాశారు . ఆ పుస్తకాన్ని ఆందరూ చదివితీరాలి అని గోపాలకృష్ణ చెప్పారు .సీనియర్ నిర్మాత కె.ఎస్. రామారావు మాట్లాడుతూ ప్రభుత్వాలే ప్రతి సంవత్సరం అవార్డులను ప్రదానం చేయలేకపోతున్నాయి. అలాంటిది రాజబాబు పేరుతో ప్రతి సంవత్సరం అవార్డులను అందిస్తున్నందుకు మిత్ర బృందాన్ని అభినందిస్తున్నా. వచ్చే సంవత్సరం నుంచి ఈ కార్యక్రమంలో మరింత మంది సినిమావారు పాల్గొనేలా చూడాలని కోరారు దర్శకుడు వీర శంకర్ మాట్లాడుతూ .. రాజబాబు చనిపోయినా ఇంకా ఆయన మిత్ర బృందం మనస్సులో పదిలంగా వున్నదని, రాజబాబు జన్మదినం సందర్భంగా పురస్కారాలు ప్రదానం చేసి ఒక వేడుకలా జరపడం, అందులో నన్ను భాగస్వామిని చేయడం సంతోషంగా ఉందని చెప్పారు . సీనియర్ జర్నలిస్ట్ భగీరథ మాట్లాడుతూ .. రాజబాబు మా అందరికీ అత్యంత ఆప్త మిత్రుడు , నాకు కళారత్న అవార్డు వచ్చిన సందర్భగా సత్కరిస్తున్న మిత్రులందరికీ కృతజ్ఞతలు . నాకోసం గుమ్మడి గోపాలకృష్ణ గారు విజయవాడ నుంచి రావడం నాకెంతో ఆనదాన్నిచ్చిందన్నారు.

నిర్వాహకులలో ఒకరైన కాకాని బ్రహ్మాం మాట్లాడుతూ .. రాజబాబుకు మిత్రులంటే ప్రాణం, ఆయన పేరుతో ఇచ్చే ఈ పురస్కారాలకు ఆయన కుమారులు రమేష్, వీరన్న చౌదరిల తోడ్పాటు వుంది. ఈ సంవత్సరం తొమ్మిది మంది ప్రతిభా వంతులకు పురస్కారాలను అందిస్తున్నామని చెప్పారు.



# ‘ఉస్తాద్ భగత్ సింగ్’ నుంచి శ్రీలీల స్పెషల్ పోస్టర్?

**పవర్ స్టార్** పవన్ కళ్యాణ్ హీరోగా యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ శ్రీలీల హీరోయిన్‌గా దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో తెరకెక్కిస్తున్న సాలిడ్ పోలీస్ డ్రామా ‘ఉస్తాద్ భగత్ సింగ్’ కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ సినిమా షూటింగ్ రీసెంట్ గానే మొదలై జెట్ స్పీడ్‌లో కొనసాగుతుంది. ఇక పవన్ సరసన శ్రీలీల మొదటిసారి నటిస్తుండగా తన పుట్టినరోజు కానుకగా మేకర్స్ ఓ స్పెషల్ బర్త్ డే పోస్టర్ ఇప్పుడు విడుదల చేశారు.

మరి ఇందులో శ్రీలీల కూల్ లుక్స్‌లో చేతిలో కాఫీ కప్‌తో ఓరగా చూస్తూ కనిపిస్తుంది. ఇలా మేకర్స్ తమ బర్త్ విషెస్‌ని ఆమెకి అందించారు. ఇక రీసెంట్ షూటింగ్‌లో పవన్‌తో పాటుగా శ్రీలీల కూడా జాయిన్ అయ్యింది. ప్రస్తుతం వీరి సంబంధిత సన్నివేశాలే తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.



# సైబర్ బాధితుల కోసం..



లాభాల ఆశ చూపించి లక్షలు కాజేశారు... రూ.11 కోట్లు పోగొట్టుకున్న టెకీ... ఆన్‌లైన్ గేమ్ ఆడి అప్పులపాలైన యువకుడు... ఉదయం లేస్తే ఇలాంటి వార్తలు చాలానే వింటున్నాం. డబ్బు పోతే పోయింది. ఆ బాధతో ఆత్మహత్యలు చేసుకునే వారు ఎక్కువవుతున్నారు. అలాంటి వాళ్లందరికీ సాంత్వన కలిగించాలను కుంది **32 ఏళ్ల స్వాతి దాస్.**

'కొవిడ్ తరవాత సోషల్ మీడియాకు బానిసలైన వారి సంఖ్య బాగా పెరిగిపోయింది. ఇలాంటి వారందరినీ లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరాలు లెక్కలేనన్ని జరుగుతున్నాయి. ఇవి నాణేనికి ఒకవైపు మాత్రమే... ఇంకోవైపు గృహిణులు, వృద్ధులను కూడా టార్గెట్ చేస్తున్నారు సైబర్ నేరగాళ్లు. దీనివల్ల జరిగే ఆర్థిక, సామాజిక నష్టం నుంచి బయటపడటానికి బాధితులకు చాలా సమయం పడుతుంది. ఈ సమయంలో ఒంటరితనం ఒత్తిడి, ఆందోళన, పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిసార్డర్(పీటీఎస్‌డి) సమస్యలతో సతమతమవుతారు. అలాంటి వాళ్లని గుర్తించి, తగిన అవగాహన కల్పించి, చికిత్స అందించకపోతే ఆత్మహత్యలకు ప్రయత్నించారు. ఇలా జరగకూడదనే నా ప్రయత్నం అంటారు స్వాతి. ఈమెది ఒడిశాలోని కటక్. యాక్సెంచర్‌లో సీనియర్ అనలిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగంలో భాగంగా 'సపోర్టింగ్ మెంటల్' కార్యక్రమంలో చేరాను. మానసిక ఒత్తిడిని జయించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అక్కడే విన్నాను.

ఆ సబ్జెక్టు మీద మక్కువతో మరింత లోతుగా అధ్యయనం చేశా. శిక్షకురాలిగానూ మారా అనే స్వాతి మొదట్లో ఒత్తిడికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలు మాత్రమే చేసేవారు.

యాదృచ్ఛికంగా.... ఏ మీడియా చూసినా సైబర్ క్రైమ్ మీద చర్చలు పెరిగిన సంవత్సరం 2022. మోసాలు నమోదు అవ్వడం ఒక ఎత్తయితే... బాధితులు ఆత్మహత్యలు మరో ఎత్తు. అందుకే వారికి మైండుఫుల్‌నెస్ టెక్నిక్‌లతో... ధ్యాస మళ్లించి, మానసిక ఒత్తిడి నుంచి బయటపడేలా చేయాలనుకున్నా, భువనేశ్వర్, కటక్, ఒడిశా గ్రామీణ ప్రాంతాల్లోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను సంప్రదించి విషయం చెప్పాను. వాళ్ల ప్రోత్సాహం కూడా తోడైంది. కంపెనీ వాళ్లు కూడా అంగీకరించారు. అంటే స్వాతి కమిషనరేట్లలో ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న మొదటి మహిళా వాలంటీర్. ఇప్పటిదాకా 1000 మందికి పైనే ఈ సమస్య నుంచి బయట పడేలా చేసింది.




రాష్ట్రవ్యాప్తంగా 50కి పైగా పాఠశాలలు, కళాశాలల్లో యువతకు డిజిటల్ నేరాలపై అవగాహా కల్పించింది.

# అందరి కోసం పోర్టబుల్ జెనెటిక్ ల్యాబ్



**25ఏళ్ల అమ్మాయిలు అప్పుడప్పుడే కెరియర్‌లో స్థిరపడుతూ ఉంటారు. అయితే, పావులూరి నాగ పావని అత్యంత కీలకమైన హ్యూమన్ జెనెటిక్స్ మీద పరిశోధనలు చేస్తూ హ్యాండ్ గ్రిప్ పోర్టబుల్ జెనెటిక్ ల్యాబ్‌ను నెలకొల్పింది. రూ.కోట్లలో టర్నోవరూ అందుకుంటోంది. ఆ విశేషాలు తెలుసుకుందాం..**

మాది ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల దగ్గర పావులూరివారిగూడెం. అమ్మ లలితా దేవి గృహిణి. నాన్న లక్ష్మణరావు రైతు. ఇద్దరూ చదువుకోలేదు. అందుకే, నన్నూ, తమ్ముడినీ బాగా చదివించాలనుకున్నారు. 2020లో గుంటూరులో బయోటెక్నాలజీలో బీటెక్ పూర్తిచేశా. రెండో ఏడాదిలో ఉండగానే స్టార్టప్ ఆలోచన వచ్చింది. మా ప్రొఫెసర్ సహకారంతో 'హ్యూమన్ రిసెర్చ్'




పరిశోధనాంశంపై చిన్న చిన్న ప్రాజెక్ట్ వర్కులు చేస్తున్నాయి. అలా 2019లో మా ప్రొఫెసర్, మరో స్నేహితుడితో కలిసి '30ఎమ్ జీనోమిక్స్'. కీలకమైన డీఎన్ఏ మాలిక్యులర్ టెస్టింగ్‌పై మా పరిశోధన ప్రారంభించింది. దీనివల్ల అనేక రకాల వ్యాధులు రాకముందే కనిపెట్టొచ్చు. సరిగ్గా సరిపోతాయో కూడా ఈ సాంకేతికత మనదేశంలో ఉన్నా పెద్ద నగరాలకే పరిమితమైంది.

కంపెనీ ప్రారంభించిన కొద్ది రోజులకే లాక్‌డౌన్. అప్పుడే ఇంక్యుబేషన్ సెంటర్ల గురించి తెలిసి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో రూ.5500 చెల్లించి ఓ బెంచ్‌ను అద్దెకు తీసుకున్నాం. దీని ద్వారా అక్కడ ఉన్న ల్యాబ్ పరికరాలను ఉపయోగించుకునే వెసులుబాటు దొరికింది. కోవిడ్ సమయమంతా హ్యూమన్ జెనెటిక్స్ మీద పనిచేసి, మా మొదటి ఉత్పత్తి 'యాంప్‌రెడీ' డీఎన్ఏ ఎక్స్‌ట్రాక్షన్ కిట్‌ను తీసుకొచ్చాం. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుంచి మొదటి గ్రాంట్ రూ.7లక్షలు అందుకోవడం... మాకు మరింత ప్రోత్సాహాన్నిచ్చింది. క్రమంగా బెంచ్ నుంచి ఓ చిన్న ల్యాబ్‌కి మారాం. టెస్టింగ్‌కి కావాల్సిన పరికరాలు, రసాయనాలు మేమే తయారుచేసుకోగలిగాం. తాజాగా పోర్టబుల్ జెనెటిక్ ల్యాబ్ తయారుచేశాం. ఇప్పటికే ఐఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీ ల్యాబొరేటరీలు, ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లలో మా ల్యాబ్‌ను ఇన్‌స్టాల్ చేశాం. ఇప్పుడు కూకట్‌పల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో ఓ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ని సొంతంగా నిర్మించుకున్నాం. ఐవీడీ సర్టిఫికేషన్ కోసం ప్రయత్నిస్తున్నా. వస్తే డయాగ్నస్టిక్స్ సేవల్లోకి అడుగు పెడతాం. ఇప్పుడు మన విజయ ఆలోచన విలువ సుమారు రూ.20కోట్లు, రూ.5కోట్ల వరకు టర్నోవర్ అందుతోంది. సంస్థ ప్రారంభించిన తొలినాళ్లు కష్టంగానే గడిచిపోయాయి. నా స్నేహితులందరికీ ఉద్యోగాలు వచ్చాయి. నాకేమో ఎలాంటి ఆదాయం రాలేదు. కారణమేమో! కానీ అమ్మానాన్నలు నచ్చింది చేయమని ప్రోత్సహించారు. ఒకటి రెండు నెలల కంటేఎక్కువ రోజులు కంపెనీని నడపలేం. అనుకునే పరిస్థితులూ వచ్చాయి. కానీ అవన్నీ ఇంకోసారి ప్రయత్నించాలనే కసిని పెంచాయే తప్ప ఆగిపోవాలనుకోలేదు. ఆ ఆలోచననే ఈ విజయానికి కారణమేమో!

# తేనీటితో బరువు తగ్గొచ్చా?



సాధారణంగా బరువు తగ్గడానికి భోజనాన్ని తగ్గించడమో, వ్యాయామం చేయడమో చేస్తుంటాం. కానీ, ఈ మధ్య కొన్నిరకాల టీలు తాగితే కూడా వెయిట్ తగ్గొచ్చనే ప్రచారం పెరిగింది. అయితే ఇది పూర్తిగా నిజం కాదంటారు నిపుణులు. సాధారణంగా భోజనానికి ముందో, తరవాతో ద్రవ పదార్థాలను తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల మనం తినాలనుకున్న ఆహార పరిమానం తగ్గుతుంది. ఇలా కొన్ని రోజులు చేస్తే కొంత బరువు తగ్గినట్లే కనిపిస్తుంది. కానీ, శరీరంలోని కొవ్వు నిల్వలు కలిగినట్లు కాదట. అలానే, కౌచ్ గ్రాస్, బుచు, డాండలైన్, ఉవార్సి, బ్రూమ్ వంటి కొన్ని రకాల టీలలోని పోషకాలు.. ఒంట్లోని అదనపు నీటిని మూత్రం రూపంలో బయటకుపంపిస్తాయి. దీనివల్ల సన్నబడ్డామేమో అనిపిస్తుంది. అయితే, గ్రీన్, బ్లాక్, ఉలాంగ్ టీలలో ఉండేకొన్నిరకాల సమ్మేళనాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు సాయపడతాయి. అయితే, తక్కువ కాలంలో బరువు తగ్గడానికి మాత్రం పనికిరావు. సమతులాహారాన్ని తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, కనీసం రోజూ ఓ గంటైనా వ్యాయామం చేయడం వంటివి చేస్తూనే ఈ టీలు తాగితే ఆరోగ్యకరంగా బరువుని తగ్గించుకోవచ్చట.

# సౌకర్యంగా ఉన్నాయా?

ఈ దుస్తుల మీదకు నప్పుతాయి. ఇది కొత్త ట్రెండ్ అంటూ కోరి కోరి షూ, చెప్పులను ఎంచుకుంటాం. తీరా వేసుకున్నాక ఇబ్బందిపడే సందర్భాలెన్నో. ఒక్కోసారి పాదాల నొప్పులూ మొదలవుతాయి. అలాగని పట్టించుకోకపోతే ఆర్థరైటిస్ సహా ఎన్నో సమస్యలు ఇబ్బంది పెడతాయి కాబట్టి... చెప్పుల విషయంలో ఆకర్షణీయంగా ఉండటం ఒక్కటే ప్రామాణికం కాకూడదు.



డిజైన్ బాగుంటే చాలని ఎప్పుడూ తీసుకోకూడదు. వాటి నాణ్యత కూడా గమనించు కోవాలి. కాలికి సరిపోయిందా లేదా అనేకాదు. నడిచేప్పుడు సౌకర్యంగా ఉన్నాయా అన్నదీ గమనించు కోవాలి. ఏమాత్రం అసౌకర్యం కలిగించినా, ఇబ్బంది పెట్టినా 'తర్వాత సర్దుకుంటాయి' అని కూర్చోక దూరం పెట్టడమే మేలు. ఎక్కువసేపు నిలబడడం, వాకింగ్, షాపింగ్.. ఇలా బోలెడు అవసరాలు ఉంటాయి. వాటికీ సౌకర్యంగా ఉండాలి. కాబట్టి, ఫ్యాషన్‌ని మాత్రమే కాకుండా సౌకర్యంగా ఉందా అనేదీ చూసుకోండి. నాలుగు అడుగులు అలా వేసి కాక, కొద్దిసేపు గమనించి చూడండి. అప్పుడే అవెంతవరకూ మీకు సరిపోతాయో తెలుస్తుంది. ఒక్కో డ్రెస్ మీదకి ఒక్కో పాదరక్షలు కొంటూ పోతే ఎలా? మ్యాచింగ్ కావాలి కానీ ఇలా అన్నీ కొనుక్కుంటూ పోయినా వృథానే. కాబట్టి కాస్త క్లాస్‌గా ఉండే రంగులను ఎంచుకునే ప్రయత్నం చేయండి. ఇవి ఎటువంటి డ్రెస్సులు, చీరలు, కుర్తీల మీదకు అయినా ఇట్టే నప్పుతాయి. ఇక వెస్ట్రన్ మేర్‌కు షూస్ అయితే మేలు. ఈ రోజుల్లో చీరల మీదకీ షూ వాడుతున్న వారూ ఉన్నారు. మీదీ అదే కోవ అయితే వైట్, బ్లాక్, క్రీమ్ వంటి రంగు తీసుకుంటేకొంచెం టెండీగా ఉంటాయి.

# పిల్లల కోసం..



ఇంట్లో పసిపిల్లలు న్నారా? అయితే మీకు బాగా అర్థమవుతుంది. వాళ్లకోసం పెట్టే కొద్దిపాటి ఆహారాన్ని మళ్లీ మళ్లీ వేడి చేయడం ఎంత కష్టమో! ఆ చిన్న పొట్టకి కావాల్సిన ఆహారాన్ని పెద్ద గిన్నెల్లో వేడిచేయలేం. వేడిచేసినా అందులోని పోషకాలు తరిగిపోయే ప్రమాదమే ఎక్కువ. ఇలా కాకుండా ఉండటానికే మార్కెట్లో 'లిల్లీపాట్స్' పేరుతో ప్రత్యేకమైన పాత్రలు దొరుకుతున్నాయి. చూడ్డానికి ఇడ్లీ పాత్రలా ఉండే వీటిల్లో ఫ్రిజ్‌లోంచి తీసిన క్యారెట్ గుజ్జు, బంగాళా దుంప గుజ్జు వంటివాటిని వేడిచేసుకోవడం తేలిక. ఇవి ఆవిరిమీద ఉడుకుతాయి. కాబట్టి పోషకాలు పోయే ప్రమాదం తక్కువ.

# బడికెళ్లేటప్పుడు క్లిప్పులు..









బడులు తెరిచారు. బుజ్జాయిలు బడికెళ్లడం మొదలుపెట్టారు. స్కూల్ అంటే చక్కగా ఆడుకునే చోటు అనే భావన నుంచి తరవాతి తరగతిలోకి అడుగుపెట్టే చిన్నారుల కోసం ప్రత్యేకంగా మార్కెట్‌లోకి వచ్చాయి. ఈ 'బ్యాక్ టు స్కూల్ హెయిర్ క్లిప్స్' అవేంటో చూద్దామా!

అక్షరాలు, అంకెలతో... బొమ్మలతో ఆడటంతోపాటు అక్షరాలు దిద్దే వయసులోకి అడుగుపెడుతున్న వారికి ఈ హెయిర్ క్లిప్పులు ప్రత్యేకం. అక్షరాల డిజైన్‌తో రంగురంగుల రిబ్బన్, మధ్యలో పలకా బలపం, దానిపై ఎబిసిలుండటంతో వీటిని అలంకరించుకోవడానికి చిన్నారులు ముచ్చటపడటం ఖాయం. క్లిప్పులు మధ్యలో వారి మనసుకు నచ్చే కార్టూన్ బొమ్మ, చివరలో అలకరణగా వారి పేరు, అలాగే క్లిప్ మధ్యలో పెన్సిళ్లు, స్కూల్ బస్సు వంటి బొమ్మల డిజైన్లు చిన్నారుల మనసును దోచేస్తాయి.

**బొమ్మలతో...** ఈ క్లిప్పులకు రిబ్బన్‌తో తయారుచేసిన అందమైన బొమ్మలు ఒద్దికగా అంటుకుని ఉంటాయి. రాకుమారి, ఫైటర్, నర్సు సహా కార్టూన్ బొమ్మలవంటి పలురకాల డిజైన్లతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కొనినినంటికైతే బార్బీడాల్స్‌లాంటి ముద్దుగా చిన్నచిన్న బొమ్మలు అటాచ్ చేసి ఉండటంతో చిన్నారులు తెగ ముచ్చటపడతారు. వాటిని అలంకరించుకుని మరీ స్కూల్‌కు బయలుదేరతారు. చూడటానికి భలేగున్న ఈ క్లిప్పులు మీ బుజ్జాయిలకూ కావాలి కదూ..











# శివుని ఆజ్ఞ

సీతాపహరణం తర్వాత రామలక్ష్మణులు దండకారణ్యంలో సంచరిస్తుంటే.. వాళ్లకో మనోహరమైన ప్రాంతం కనిపించింది. సీతమ్మ వారి జాడ తెలిసేవరకూ అక్కడే నివసించాలనుకున్నాడు శ్రీరాముడు. అతడి సంకల్పాన్ని బలపరిచాడు లక్ష్మణుడు. సోదరా! నాతో ఏకీభవించినందుకు సంతోషం. అయితే ఇదెవరిదో తెలుసుకోవాలి. వారి అనుమతి లేకండా ఉండటం భావ్యం కాదు కదా! కనుక చుట్టుపక్కల ఎవరైన ఉన్నారేమో చూడు, వారితో మాట్లాడుదాం అన్నాడు రాముడు. వెంటనే లక్ష్మణుడు పరిసరాలను పరిశీలిస్తూ కొంత దూరం వెళ్లగా.. ఉసిరి మారేడు చెట్ల మధ్యన శివాలయం కనిపించింది. కాని అక్కడెవరు లేరు. తిరిగొచ్చి సంగతి తెలియజేశాడు. అయితే ఈ ప్రాంతానికి పరమ శివుడే అధిపతి అయ్యాండు. అనుమతి తీసుకో లక్షణా అన్నాడు రాముడు. లక్ష్మణుడు శివాలయం వద్దకు వెళ్లి, శివుడి ఆజ్ఞకై అర్థించాడు. వెంటనే శివలింగం నుంచి ఉజ్వలంగా ఉన్న మూర్తి వెలువడి, అద్భుతంగా నృత్యం చేసి అదృశ్యమైంది. అలా ఎందుకు జరిగిందో దాని భావం ఏమిటో లక్ష్మణుడికి అర్థం కాలేదు. సోదరుడి వద్దకు వచ్చి విషయం చెప్పాడు. రాముడు చిన్నగా నవ్వి. సోదరా శివుడి ఆజ్ఞ లభించింది. కుటీరం నిర్మించు అన్నారు. ఆజ్ఞ ఎప్పుడు లభించింది ఆశ్చర్యంగా అడిగాడు లక్ష్మణుడు. లక్ష్మణా మితిమీరిన స్వార్థం, జివ్హా చాపల్యం, కామ వికారాలే కష్టాలకు మూలం. వీటిని గనుక నియంత్రించుకోగలిగితే.. ఇక్కడే కాదు ఎక్కడైనా సుఖంగా జీవించవచ్చు. ఈ మూడింటినీ మనం నిగ్రహించు కోగలమని పరమశివుడు గ్రహించాడు. కనుకనే నృత్యభంగిమలో దర్శనమిచ్చి తన అంగీకారాన్ని తెలియజేశాడు అంటూ వివరించాడు శ్రీరాముడు.

ఆధ్యాత్మికం

# స్నేహం దూరమైందా?

**ప్రాణానికి ప్రాణంగా కలిసి బతికిన,** మన అనుకున్న వాళ్లే ఒక్కోసారి దూరమైపోతుంటారు.. ఇలాంటి పరిస్థితిని తట్టుకోవడం కష్టమే! బ్రేకప్.. ప్రేమికుల మధ్యే కాదు.. ఒక్కోసారి ప్రాణ స్నేహితుల మధ్య సహజమే..! మరి ఇలాంటి పరిస్థితులలో ఆ బాధ నుంచి ఎలా బయటపడాలి?

**రియలైజ్ అవ్వాలి!....** అనుమతి ఎంతసేపూ బాధపడుతూ కూర్చుంటే స్నేహబంధం విడిపోవడానికి అసలు కారణమేంటో గుర్తించలేం. కాబట్టి ఇద్దరూ విడిపోవడానికి తప్పు మీదా? లేదంటే మీ స్నేహితురాలా? అన్న విషయం ముందుగా తెలుసుకోవాలి. ఈ క్రమంలో ఒకవేళ తప్పు మీవైపు ఉంటే.. క్షమాపణ కోరి.. బంధాన్ని తిరిగి నిలబెట్టుకోవడం ఓ పద్ధతి! లేదు.. తప్పు తన వైపు ఉంది.. అయినా మీ నుంచి విడిపోదామనే కోరుకుంటే మాత్రం మీరు బతిమాలాల్సిన పని లేదంటున్నారు నిపుణులు. ఈ పరిశీలన గ్రహించి.. తప్పు తన వైపు పెట్టుకొని నన్నే దోషిని చేస్తున్నప్పుడు నేనెందుకు తన గురించి ఆలోచించాలి..? అని మీ మనసుకు చెప్పుకోండి. ఇలా అసలు విషయం గ్రహించిన మరుక్షణం నుంచి మీలో మార్పు మొదలవడం మీరు గుర్తించవచ్చు. ఈ మార్పు మీ బాధను దూరం చేసి సంతోషాన్ని దగ్గరకు చేస్తుంది.

వాటిని డిలీట్ చేయండి! .. ఎంత వద్దనుకున్నా ఒక్కోసారి చేదు జ్ఞాపకాలన్నీ గుర్తుకు రావడం సహజం. ఇలాంటప్పుడు చాలామంది చేసే పని.. ఆ జ్ఞాపకాల తాలూకు ఫొటోలు, వీడియోలు చూడడం, సందేశాలు చదవడం..! నిజానికి దీనివల్ల బాధ రెట్టింపవడం తప్ప మరే ప్రయోజనం లేదు. అందుకే వాటిని ఇంకా అట్టే పెట్టు కోకుండా తొలగించడం వల్ల కొంత ప్రయోజనం ఉంటుంది.



అలాగే మనసుకు బాధ కలిగినప్పుడు ఒంటరిగా ఉండకుండా మీ ఇంట్లో వాళ్లతో మీ బాధను పంచుకోవడం, వాళ్లతో కాస్త సమయం గడపడం వల్ల.. మరింత కుంగిపోకుండా జాగ్రత్తపడచ్చు.

**ఇలా చేయ చ్చు!....** స్వీయ ప్రేమ ఎలాంటి బాధ నుంచైనా మనల్ని బయటపడేయ గలదని చెబుతున్నారు. నిపుణులు. అందుకే ఒంటరిగా ఫీలవ కుండా మనకంటూ కాస్త సమయం కేటాయించుకోవడం, నచ్చిన పనులపై దృష్టి పెట్టడం వల్ల కొంతవరకు ప్రయోజనం ఉంటుంది. మనసు బాగోలేనప్పుడు మనపై మనకే కోపమొస్తుంటుంది. అలాంటప్పుడు వ్యాయామం చేయడం వల్ల శరీరంలో ఫీల్ హార్మోన్లు విడుదలై మానసిక ప్రశాంతతను అందిస్తాయని ఓ అధ్యయనంలో రుజువైంది. బ్రేకప్ బాధ నుంచి విముక్తి పొందాలంటే వ్యాయామం అందుకే చక్కటి ఔషధం అంటున్నారు నిపుణులు. ఫ్రెండ్షిప్‌లో ఒక్కసారి విడిపోయినంత మాత్రాన ఇంకొకరితో స్నేహం చేయకూడదనుకోవడం పొరపాటు అంటున్నారు నిపుణులు.

# తరిగేద్దాం.. తేలిగ్గా !

కాయగూరలు ఒక పద్ధతిలో కోస్తే కూర చూడ్డానికి బాగుంటుంది. అలా చేయాలంటే మన కటింగ్ స్కిల్స్ బాగుండాలి. అంత తీరిక కూడా ఉండాలి. మనలో చాలా మందికి ఆఫీసు టైం అవుతోంది అనే తొందరలోనే పని చేస్తాం. అందుకే తక్కువ సమయంలో పని తేలిగ్గా అయ్యేందుకు ఉపకరించే పరికరమే ఈ రొటేటింగ్ వెజిటబుల్ కట్టర్. క్యారట్, బీట్‌రూట్ వంటి ఎక్కువ సమయం పట్టే కాయగూరల్ని కూడా ఇందులో తేలిగ్గా తరిగేయొచ్చు. నాలుగు రకాల బ్లేడులు మార్చుకొనే అవకాశం ఉంది. దీన్నికున్న ప్రత్యేకమైన ఆకృతివల్ల చేతివేళ్లకి గాయం అవుతుందన్న భయం లేకుండా వేగంగా పని పూర్తిచేసుకోవచ్చు.



ఆట

# రెండు విడతలుగా రంజీ ట్రోఫీ

## షెడ్యూల్ వెల్లడించిన భారత్ క్రికెట్ బోర్డు

**న్యూఢిల్లీ:** దేశవాళీ క్రికెట్ కొత్త సీజన్‌కు షెడ్యూల్ ఖరారైంది. దీనికి సంబంధించిన వివరాలను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) విడుదల చేసింది. విరామం లేకుండా మ్యాచ్‌ల నిర్వహణపై క్రికెటర్లు ఫిర్యాదు నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. లీగ్‌ను రెండు దశలుగా నిర్వహించాలని బీసీసీఐ తీర్మానించింది. అక్టోబర్ 15 నుంచి ఫిబ్రవరి 28 మధ్యలో రంజీ ట్రోఫీ నిర్వహిస్తామని భారత బోర్డు తెలిపింది. దులీప్ ట్రోఫీతో దేశవాళీ సీజన్ 2025-26 ప్రారంభం కానుంది. ఆగస్టు 28 ను మొదలయ్యే ఈ టోర్నీ సెప్టెంబర్ 15న ముగుస్తుంది. ఆ తర్వాత ఇరానీ కప్ అక్టోబర్ 1 నుంచి 5వ తేదీ వరకూ జరగనుంది. ఇందులోరంజీ విజేత డిఫెండింగ్ ఛాంపియన్ రెస్ట్ ఆఫ్ ఇండియా ట్రోఫీ కోసం పోటీ పడనుంది. తదనంతరం రంజీ ట్రోఫీ షురూ అవుతుంది. అంతేకాదు ఈసారి రంజీ ట్రోఫీ సరికొత్తగా ఉండనుంది. జూనియర్, సీనియర్ విభాగాల్లో ఒక జట్టు ప్రమోట్ అవుతుంది. మరొక జట్టు 2026-27 సీజన్‌కు అర్హత సాధిస్తుంది. ఫిబ్రవరి 6 నుంచి 28 వరకూ నాకౌట్ మ్యాచ్‌లు ఉంటాయి.






## ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో..

# నిశాంత్ రెండో విజయం

### జోసు సిల్వాపై 60-54 తేడా

**న్యూఢిల్లీ:** భారత్ బాక్సర్ నిశాంత్ దేవ్ తన రెండవ ప్రొఫెషనల్ విజయాన్ని నమోదు చేశాడు. ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో తన అజేయ పరంపరను కొనసాగిస్తూ నిశాంత్ దేవ్ 60-54తో జోసుయే సిల్వాను ఓడించి ఏకగ్రీవ విజయాన్ని నమోదు చేశాడు. ఆదివారం మాడిసన్ స్క్వేర్ గార్డెన్ థియేటర్‌లో జరిగిన రిచర్డ్‌సన్ హిచిన్స్ వర్సెస్ జార్జ్ కాంబోసోస్ పోరాటంలో అండర్ కార్డ్ బౌట్‌లో పోటీ పడుతున్న 24 ఏళ్ల నిశాంత్, ఆరు రౌండ్ల లైట్ మిడిల్ వెయిట్ బౌట్‌లో 60-54 తేడాతో విజయాన్ని నమోదు చేయడంతో ప్రారంభం నుండి ముగింపు వరకు పూర్తి నియంత్రణలో ఉన్నాడు. 2024 పారిస్ ఒలింపియన్ నిశాంత్ వేగం, చురుకుదనంతో పాటు అతని ఖచ్చితత్వం ప్రత్యేకంగా నిలిచాయి. మరింత అనుభవజ్ఞుడైన నిశాంత్ భారతీయుడితో పోటీ పడటానికి ఇబ్బంది పడ్డాడు. గత సంవత్సరం 2024 పారిస్ ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్‌లో ఓడిపోయిన తర్వాత నిషాంత్ ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రొఫెషనల్‌గా మారాడు. జనవరిలో ఆల్టన్ విగ్గిన్స్‌తో జరిగిన తన ప్రొఫెషనల్ అరంగేట్రంలోనే అతను మొదటి రౌండ్‌లోనే నాకౌట్ విజయాన్ని నమోదు చేశాడు. అని నిషాంత్ అన్నాడు. నిశాంత్ తదుపరి జూలై 19న డల్లాస్‌లో జరిగే అండర్ కార్డ్ ఫైట్‌లో పాల్గొంటాడు.



## క్వీన్స్ క్లబ్ టోర్నీలో..

# మారియా సంచలనం

### ఓడిన మాడిసన్ కీస్, క్విన్వెన్

**న్యూఢిల్లీ:** క్వీన్స్ క్లబ్-2025 టోర్నమెంట్ సెమీ ఫైనల్లో సంచలన విజయాలు చోట చేసుకున్నాయి. ఆదివారం జరిగిన ఈ టోర్నీలో మాజీ వింబుల్డన్ సెమీఫైనలిస్ట్ అయిన 86వ ర్యాంక్ క్రీడాకారిణి మరియా, 8వ ర్యాంక్ క్రీడాకారిణి కీస్‌ను ఓడించింది. ఆమె 10 ఏస్‌లు కొట్టినప్పటికీ ఫలితం పొందలేకపోయింది. అలాగే 2వ ర్యాంక్ క్రీడాకారిణి కీస్, 1వ ర్యాంక్ క్రీడాకారిణి జెంగ్ క్విన్వెన్‌తో నిష్క్రమించింది. ఆమె యుఎస్‌కు చెందిన 8వ ర్యాంక్ క్రీడాకారిణి అమండా అనిసిమోవా చేతిలో 6-2, 4-6, 6-4 తేడాతో ఓడిపోయింది. క్వీన్ క్లబ్ టోర్నీ సెమీ ఫైనల్లో 37 ఏళ్ల క్వాలిఫయర్ టాట్జానా మారియా చేతిలో మాడిసన్ కిస్ వరుస సెట్లలో ఓడిపోయింది. కాగా ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్‌తో జరిగిన నాలుగు రౌండ్లలో మారియా 6-3,7-6 (3) తేడాతో ఓడించి తన కెరీర్‌లో తొలి విజయం సాధించింది.

# క్రికెట్ నుండి ఆరుగురు ఔట్

## పలు ఫార్మాట్లకు గుడ్ బై.. ఒకే నెలలో స్టార్ ప్లేయర్ల నిర్ణయం

**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ రిటైర్మెంట్‌తో మొదలైన స్టార్ ఆటగాళ్ల వీడ్కోలు ఒకే నెలలో ఆగురురికి చేరింది. మే నుంచి జూన్ నెల మధ్యలో మొత్తం ఆరుగురు స్టార్ క్రికెటర్లు అంతర్జాతీయ క్రికెట్‌లోని పలు ఫార్మాట్ లకు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. మే 7న టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించాడు. ఇప్పటికే టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అతడు ఇకపై వన్డేలో మాత్రమే టీమిండియాకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించిన వారం వ్యవధిలోనే మరో భారత స్టార్ విరాట్ కోహ్లి టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తాను టెస్ట్ క్రికెట్ గుడ్ బై చెప్పాడు. అయితే, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతానని చెప్పాడు. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ హెన్రిక్ క్లాసెన్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేశాడు. తన కుటుంబంతో సమయం గడపాలని నిర్ణయం తీసుకున్న అతడు క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్‌లకు వీడ్కోలు పలికాడు. రాబోయే రోజుల్లో టీ20లో మాత్రమే



వారిలో కొందరు కొన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికగా, మరికొందరు అన్ని రకాల ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పి వెళ్లిపోయారు. ఈ విధంగా, గత నెలలో రిటైర్మెంట్ ప్రకటించిన ఆటగాళ్ల జాబితాలో టీమిండియా నుంచి ఇద్దరు క్రికెటర్లు ఉండగా, నలుగు విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. మొట్టమెదటగా అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన ఆటగాడు భారత స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ. రోహిత్ గత నుంచి తప్పుకుంటున్నట్టు మే 12న తెలిపాడు. అయితే టీ20 వరల్డ్ కప్ తర్వాత షార్ట్‌ఫామ్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన కోహ్లి ఇకపై వన్డేలో మాత్రమే ఆడనున్నాడు. తదుపరి మరో విదేశీ ఆటగాడు శ్రీలంక స్టార్ ఆల్ రౌండర్ ఏంజెలో మాథ్యూస్ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్, జట్టులో కీలక ఆటగాడు గ్లెన్ మాక్స్వెల్ కూడా తాజాగా వన్డే క్రికెట్‌కు ఆడనున్నారు. వెస్టిండీస్ వికెట్ కీపర్‌బ్యాట్స్ మాన్ నికోలస్ పూరన్ కూడా అన్ని రకాల అంతర్జాతీయ క్రికెట్ నుండి రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే, ఇందరులో ఆశ్చర్యపడాల్సిన విషయం ఏమిటంటే కేవలం 29 ఏళ్ల వయస్సులోనే పూరన్ అన్ని అన్ని రకాల అంతర్జాతీయ క్రికెట్ నుండి రిటైర్మెంట్ ప్రకటించడం. అయితే, పూరన్ ఇకపై టి20 మ్యాచ్‌లు మాత్రమే ఆడనున్నాడు.

# భారత్ జూ.మహిళల విక్టరీ

## యూరప్ పర్యటనలో వరుసగా నాల్గవ విజయం

## 2-1 తేడాతో ఆస్ట్రేలియా పరాజయం



**న్యూఢిల్లీ:** యూరప్ పర్యటనలో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు తమ అజేయ పరుగును కొనసాగించింది, ఈ పర్యటనలో ఆదివారం తమ నాల్గవ మరియు చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 2-1 తేడాతో ఉత్కంఠభరితమైన విజయం సాధించింది. ఆతిథ్య బెల్జియంపై ఇప్పటికే వరుసగా మూడు విజయాలు సాధించిన భారత జట్టు, బలమైన ఆస్ట్రేలియా జట్టును ఓడించడానికి తమ దృఢత్వం మరియు పోరాట పటిమను ప్రదర్శించింది. జోసీ లాటన్ (5వ నిముషంలో) పెనాల్టీ కార్నర్‌ను కచ్చితత్వంతో గోల్‌గా మలిచి భారత్‌ను వెనుకబడిపోయేలా చేయడంతో ఆస్ట్రేలియా ఆరంభంలో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే, భారత జట్టు దాదాపు వెంటనే స్పందించింది. కేవలం మూడు నిమిషాల తర్వాత, నందిని (8వ నిముషంలో) పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేసింది. మొదటి క్వార్టర్ ముగిసే సమయానికి జట్టు వైస్ కెప్టెన్ హీనా బానో (14వ నిముషంలో) మరో పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తన జట్టును 2-1తో ఆధిక్యంలోకి తీసుకెళ్లడంతో, ఆట వేగం భారత్ వైపు పూర్తిగా మారిపోయింది. మిగిలిన మూడు క్వార్టర్లలో ఇరు జట్లు అనేక అవకాశాలు సృష్టించినప్పటికీ, ఏ జట్టూ స్కోరును పెంచలేకపోయింది. భారత జట్టు తమ రక్షణాత్మక నిర్మాణాన్ని బాగా నిలబెట్టుకుని, ఆస్ట్రేలియన్ దాడిని ఎదుర్కొని పోరాడి విజయాన్ని సాధించింది. ఈ విజయం ఈ పర్యటనలో భారత్ వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది, మొదటి మూడు ఆటలలో బెల్జియంపై క్లీన్ స్వీప్ చేసిన తర్వాత. జూన్ 17న నెదర్లాండ్స్‌తో యూరప్‌లో జరిగే చివరి మ్యాచ్‌కు సిద్ధమవుతున్నందున, జట్టు ఇప్పుడు పర్యటనను ఘనంగా ముగించాలని చూస్తోంది.

# డ్రైఫ్రూట్స్ మార్కెట్లపై వార్ ఎఫెక్ట్

**ముంబై, జూన్ 15:** ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధ ప్రభావరం మరింతగా ఉండనుంది. ఇజ్రాయెల్ ఇరాన్‌పై వైమానిక దాడి చేసింది. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ ఇజ్రాయెల్ వైపు 150కి పైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తుంది. ముఖ్యంగా డ్రైఫ్రూట్స్ విషయంలో భారతదేశంతో సహా ప్రపంచంలోని అనేక దేశాలలో డ్రై ఫ్రూట్స్, గింజల ధరలు మరింత పెరగవచ్చు. పాకిస్తాన్ ద్వారా దిగుమతులపై నిషేధం విధించనుంది. ఆఫ్ఘనిస్తాన్‌ఇరాన్ నుండి సరఫరా ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తత పరిశ్రమకు కొత్త సవాలును తెచ్చిపెట్టింది. ప్రపంచంలోనే అతిపెద్ద డ్రై ఫ్రూట్స్ ఉత్పత్తి చేసే దేశాలలో ఇరాన్ ఒకటి. దీనితో పాటు ఇరాన్ పిస్తాపప్పు ఉత్పత్తి చేసే దేశం. దీనిని భారత దేశం కూడా పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటుంది. అలాగే మజాఫతి, పియారోమ్ వంటి ఇరానియన్ ఖర్జూర రకాలు భారతదేశంలో చాలా ప్రసిద్ధి చెందాయి. ప్రతి సంవత్సరం దాదాపు 2,700 టన్నుల ఇరానియన్ ఖర్జూరాలు భారతదేశానికి దిగుమతి అవు

వెబ్‌సైట్ ప్రకారం.. భారతదేశం ప్రతి సంవత్సరం దాదాపు 1.47 బిలియన్ల విలువైన డ్రై ఫ్రూట్స్, గింజలను దిగుమతి చేసుకుంటుంది. ఇరాన్, అమెరికా, ఆస్ట్రేలియా దీనికి ప్రధాన ఎగుమతి దారులు. భారతదేశం ఎక్కువగా దిగుమతి చేసుకునే ఉత్పత్తులలో పిస్తాపప్పులు, ఖర్జూరాలు, ఎండుద్రాక్ష, బాదం. వాల్‌నట్‌లున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ వివాదం ఇరాన్ నుండి సరఫరా నెట్‌వర్క్‌ను ప్రభావితం చేయవచ్చు.



అంతరాయం కారణంగా ఈ ఉత్పత్తుల ధరలు ఇప్పటికే 15 శాతం నుండి 100 శాతానికి పెరిగాయి. ఇప్పుడు ఈ వివాదం కారణంగా వ్యాపారులు మరింత సంక్షోభాన్ని ఎదుర్కోవలసి రావచ్చు. భారతదేశంలో డ్రై ఫ్రూట్స్‌ను ఎక్కువగా దిగుమతి చేసుకునే దేశాలు ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్. ఈ దేశాల నుండి వచ్చే పిస్తా, ఖర్జూరం, ఎండు ద్రాక్షలకు ప్రతి సంవత్సరం డిమాండ్ చాలా ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా రంజాన్, ఇతర పండుగల సమయంలో వాటి డిమాండ్ గరిష్టంగా ఉంటుంది. ఇరాన్ ద్వారా ఆఫ్ఘన్ మూలానికి చెందిన డ్రై ఫ్రూట్స్ దిగుమతిపై విధించే సుంకంపై స్పష్టత ఇవ్వాలని వ్యాపారులు ఇటీవల కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కానీ ఇప్పుడు తాయి. ఇరానియన్ ఎండుద్రాక్షలు, ముఖ్యంగా కాశ్మీరీ రకానికి చెందిన బంగారు, ఆకుపచ్చ ఎండు ద్రాక్షలు భారతీయ వినియోగ దారులలో బాగా ప్రాచుర్యం పొందాయి. 2023 సంవత్సరంలో దాదాపు 1,000 టన్నుల ఎండుద్రాక్షలు ఇరాన్ నుండి దిగుమతి అయ్యాయి. ట్రేడ్ ఎకానమీ

# బోయింగ్ క్రాష్‌తో బీమాకు రూ.1200 కోట్ల భారం..

**న్యూఢిల్లీ, జూన్ 15:** ఒక్క ప్రమాదం 12వందల కోట్ల రూపాయల బీమా క్లెయిమ్‌లకు దారీ తీయనుంది. నిన్న అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా బోయింగ్ 787డ్రీమ్ లైనర్ విమానం టేకాఫ్ అయిన కొన్ని సెకన్లకే కూలిపోయిన ఘటనలో 241 మంది మృత్యువాత పడ్డారు. మృతులకు సంబంధించి బీమా క్లెయిమ్స్ చెల్లింపులు ఇన్సూరెన్స్ కంపెనీలపై భారంగా పరిణమించనున్నాయి. ఈ భారం భారతీయ ఇన్సూరెన్స్ కంపెనీలపై పరిమితంగా ఉండవచ్చు.. యూకే రీఇన్సూరెన్స్ కంపెనీలపై అధిక భారం పడనుంది. ఇన్సూరెన్స్ కంపెనీలు, గ్లోబల్ ఇన్సూరెన్స్ కంపెనీలు 120 మిలియన్ డాలర్ల 150 మిలియన్ డాలర్ల వరకు మన కరెన్సీలో వెయ్యి నుంచి 12వందల కోట్ల రూపాయాలు క్లెయిమ్‌లు ఎదుర్కొననున్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రమాదంలో ధ్వంసమైన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం విలువ 75 మిలియన్ డాలర్ల నుంచి 85 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఏవియేషన్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి విమానం మొత్తం నష్టం విలువకు క్లెయిమ్ చేస్తే, అంతే మొత్తం ఇవ్వాల్సి ఉంటుంది. ఇక 1999లో జరిగిన మాంట్రియల్ కన్వెన్షన్ ప్రకారం, విమాన ప్రయాణీకుల మరణం లేదా గాయం వల్ల కలిగే నష్టానికి అన్ని విమానయాన సంస్థలు ఖచ్చితంగా బాధ్యత వహిస్తాయి. ఫ్లైట్ నష్టం, ప్యాసింజర్, థర్డ్‌పార్టీ చెల్లింపులు గ్లోబల్ ఏవియేషన్ ఇన్సూరెన్స్ సెక్టర్‌పై తీవ్రమైన ప్రభావం చూపనుంది. ఎయిర్ ఇండియా ఫ్లైట్ ప్రమాదంలో భారతీయ



ప్రమాదంలో చనిపోయిన ప్రతీ ఒక్క ప్రయాణికుడి కుటుంబానికి చెల్లించాల్సిన కోటి రూపాయలు అదనం. ఈ విధంగా ప్రయాణికుల కుటుంబాలకు చెల్లించాల్సిన మొత్తం రూ.240 కోట్లు అదనంగా ఉంటుంది. విమాన నష్టం, ప్రయాణికులు ఇన్సూరెన్స్ అన్నీ కలిపితే 12వందల కోట్ల భారం తప్పిందంటున్నారు నిపుణులు.

## వాణిజ్యం

# ఫండ్స్ ఇన్వెస్టర్లకు అలర్ట్..

**ముంబై, జూన్ 15:** ఏయూఎం లేదా నిర్వహణలో ఉన్న ఆస్తులు అంటే మ్యూచువల్ ఫండ్ నిర్వహించే మొత్తం డబ్బు విలువ. ఇందులో ప్రజలు పెట్టుబడి పెట్టిన మొత్తం డబ్బు, వడ్డీ, డివిడెండ్‌లు లేదా ఫండ్ పెట్టుబడులలో పెరుగుదల ద్వారా వచ్చే లాభాలు ఉంటాయి. ఉదాహరణకు చాలా మంది వ్యక్తులు ఒక ఫండ్‌లో పెట్టుబడి పెడితే అది కాలక్రమేణా పెరిగితే ఏయూఎం పెరుగుతుంది. ఎంత మంది వ్యక్తులు పెట్టుబడి పెడతారు లేదా ఉపసంహరించుకుంటారు, అలాగే మార్కెట్ ఎలా పనిచేస్తుందనే దానిపై ఆధారపడి ఏయూఎం ప్రతిరోజూ పెరగవచ్చు లేదా తగ్గవచ్చు. సాధారణంగా పెద్ద ఏయూఎం అంటే ఆ ఫండ్ చాలా మంది పెట్టుబడి దారులతో ప్రజాదరణ పొందిందని విశ్వసిస్తారు. అయితే ఆ ఫండ్ ఎల్లప్పుడూ మంచి రాబడిని ఇవ్వదు. కొన్నిసార్లు చిన్న ఫండ్లు పెద్ద వాటి కంటే మెరుగ్గా పని చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి మ్యూచువల్ ఫండ్ పరిమాణాన్ని చూడటానికి ఏయూఎం చాలా మంచి మార్గమని సూచిస్తున్నారు. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులు ఏయూఎంను అర్థం చేసుకోవడం చాలా అవసరం ఎందుకంటే ఇది మ్యూచువల్ ఫండ్‌కు సంబంధించిన అనేక అంశాలను ప్రభావితం చేస్తుంది. మొదట అధిక ఏయూఎం సాధారణంగా పెట్టుబడిదారుల విశ్వాసం, నిధుల స్థిరత్వాన్ని సూచిస్తుంది. పెట్టుబడిదారులు తమ డబ్బును ఇప్పటికే గణనీయమైన మొత్తంలో ఆస్తులను నిర్వహిస్తున్న నిధుల్లో పెట్టుబడి పెట్టడానికి మరింత నమ్మకంగా ఉంటారు. పెద్ద ఏయూఎం ఉన్న నిధులు తరచుగా స్కేల్‌కు సంబంధించిన ఆర్థిక వ్యవస్థల నుంచి ప్రయోజనం పొందుతాయి. అలాగే కాలక్రమేణా ఖర్చు నిష్పత్తిని తగ్గిస్తాయి. మూడోది ఒక పెద్ద ఏయూఎం మెరుగైన వైవిధ్యాన్ని అందిస్తుంది. అలాగే మరిన్నిఆస్తుల్లో ప్రమాదాన్ని వ్యాపింపజేస్తుంది. అయితే ఇది ఎల్లప్పుడూ మెరుగైన పనితీరుకు సంకేతం కాదు.




కొన్ని సందర్భాల్లో ముఖ్యంగా స్మాల్‌క్యాప్ లేదా సెక్టోరల్ ఫండ్లలో చాలా పెద్ద ఏయూఎం స్టాక్ ధరలను ప్రభావితం చేయకుండా ఫండ్ మేనేజర్లు డబ్బును సమర్థవంతంగా ఉపయోగించడం కష్టతరం చేస్తుంది. అందువల్ల ఫండ్ మూల్యాంకనంలో ఏయూఎం అనేక అంశాలలో ఒకటిగా ఉండాలి. ఇది ఫండ్‌కు సంబంధించిన స్కేల్, ప్రజాదరణ గురించి మీకు తెలియజేస్తుంది. కానీ తప్పనిసరిగా దాని భవిష్యత్తు పనితీరు గురించి కాదని గుర్తుంచుకోవాలి. పెట్టుబడి నిర్ణయం తీసుకునేటప్పుడు ఎల్లప్పుడూ దానిని ఇతర డేటాతో జత చేయాలి. నగదుతో పాటు నగదు సమానంగా ఉన్న వాటితో ఏయూఎం లెక్కిస్తారు.

# ఏడాదిలోనే ఇన్వెస్టర్లను ధనవంతులను చేసిన పతంజలి..

**ముంబై, జూన్ 15:** బాబా రామ్‌దేవ్ పతంజలి ఫుడ్స్ షేర్లు గత ఒక సంవత్సరంలో విపరీతమైన వృద్ధిని సాధించాయి. ఆ తర్వాత కంపెనీ పెట్టుబడిదారులు ధనవంతులుగా మారారు. బిఎస్ఇ డేటా ప్రకారం.. కంపెనీ షేర్లు దాదాపు 29 శాతం పెరిగాయి. పతంజలి ఫుడ్స్ షేర్లు ఇప్పటివరకు చూసినంత వృద్ధిని అనేక పెద్ద కంపెనీల షేర్లు చూడలేదు. దాదాపు ఒక సంవత్సరం క్రితం కంపెనీ షేర్లు 52 వారాల కనిష్ట స్థాయి రూ. 1300కి చేరుకున్నాయి. ప్రస్తుతం ఇది దాదాపు రూ. 1700కి చేరుకుంది. గత ఒక సంవత్సరంలో స్టాక్ మార్కెట్లో పతంజలి షేర్ల గణాంకాలు ఎలా ఉన్నాయో చూద్దాం. గత ఏడాది కాలంలో పతంజలి షేర్లు దాదాపు 29 శాతం పెరిగాయి. జూన్ 24, 2024న, పతంజలి షేర్లు 52 వారాల కనిష్ట స్థాయి రూ.1,302.2కి చేరుకున్నాయి. అప్పటి నుండి కంపెనీ స్టాక్ రూ.373.3 పెరిగింది. డేటాను పరిశీలిస్తే.. జూన్ 11న బిఎస్ఇలో కంపెనీ స్టాక్ రూ.1,675.50 వద్ద ముగిసింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, రాబోయే రోజుల్లో కంపెనీ షేర్లు మంచి పెరుగుదలను చూసే అవకాశం ఉంది. స్టాక్ మార్కెట్లో పతంజలి షేర్లు పెరగడం వల్ల కంపెనీ షేర్లలో పెట్టుబడి పెట్టిన పెట్టుబడిదారులు చాలా సంపాదించారు. ఎవరైనా ఏడాది క్రితం కంపెనీ షేర్లలో రూ.1,302.2 విలువైన రూ.1 లక్ష పెట్టుబడి పెట్టి ఉంటే ఆ సమయంలో ఆ పెట్టుబడిదారుడికి దాదాపు 77 షేర్లు వచ్చేవి. ప్రస్తుతం దీని విలువ రూ.1.29 లక్షలు ఉండేది. అంటే పెట్టుబడిదారులు లక్ష రూపాయల పెట్టుబడిపై దాదాపు 29 వేల రూపాయల లాభం పొంది ఉండేవారు.

# ఐటి రిటర్న్ జాప్యానికి జరిమానాల ఝలక్

**న్యూఢిల్లీ, జూన్ 15:** ఆదాయపు పన్ను రిటర్న్ లేదా ఐటీఆర్ అనేది ఒక నిర్దిష్ట ఆర్థిక సంవత్సరానికి మీ స్థూల పన్ను విధించదగిన ఆదాయాన్ని చూపించే ఫారమ్. పన్ను చెల్లింపుదారులు తమ ఆదాయం, తగ్గింపులు, మినహాయింపులు చెల్లించిన పన్నులను అధికారికంగా వెల్లడించడానికి ఈ ఫారమ్‌ను ఉపయోగిస్తారు. ఫలితంగా ఇది ఇచ్చిన ఆర్థిక సంవత్సరానికి మీ నికర ఆదాయ పన్ను బాధ్యతను నిర్ణయిస్తుంది. పన్ను ఆడిట్‌కు బాధ్యత వహించని వ్యక్తుల కోసం ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయడానికి గడువు తేదీ తదుపరి ఆర్థిక సంవత్సరం జూలై 31గా ఉంటుంది. అయితే ఈ గడువు తేదీలోపు మీ ఐటీఆర్‌ను దాఖలు చేయకపోతే, సెక్షన్ 234 ఎఫ్ కింద మీకు రూ. 5,000 ఆలస్య రుసుము విధించే అవకాశం ఉంటుంది. అయితే మీ వార్షిక ఆదాయం రూ. 5 లక్షల కంటే తక్కువ ఉంటే ఆలస్య ఖర్చులు రూ. 1000 కి పరిమితం చేశారు. సెక్షన్ 234ఏ ప్రకారం, మీరు పన్నులు చెల్లించకపోతే మీరు బకాయి ఉన్న పన్ను మొత్తంపై ప్రతి నెలా 1 శాతం వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది. ఈ వడ్డీని మీరు సంబంధిత ఆర్థిక సంవత్సరానికి రిటర్న్ దాఖలు చేసిన రోజు నుండి గడువు తేదీ వరకు లెక్కిస్తారు. రూ. 25,000 దాటిన ఆదాయపు పన్ను బకాయిదారులకు కనీసం 6 నెలలు నుండి 7 సంవత్సరాల వరకు కఠిన జైలు శిక్ష, అలాగే జరిమానా విధించవచ్చు. రూ.25,000 కంటే తక్కువ ఉంటే కనీసం మూడు నెలలు, గరిష్టంగా రెండు సంవత్సరాల వరకు కఠిన జైలు శిక్ష, అలాగే జరిమానా విధించవచ్చు. మీరు గడువు తేదీకి ముందు లేదా గడువు తేదీలోపు మీ ఆదాయపు పన్ను రిటర్న్‌ను దాఖలు చేస్తే మీరు నష్టాలను తదుపరి సంవత్సరాలకు బదిలీ చేయడానికి అనుమతి ఇస్తారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.